epaper.ninadamnews.com

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

మంగళవారం, ఆగస్టు 4, 2026 | సంపుటి - 22 | సంచిక 307 | వెల - 7 | పేజీలు - 12 - 8

Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

జార్ఖండ్‌లో పబ్లిక్ సర్వీస్ కమిషన్

## పేపర్ లీక్

- సమగ్ర విచారణ జరపాలంటూ విద్యార్థుల డిమాండ్
- ఆందోళన చేస్తూ నిరాహారదీక్షకు ఉద్యోగార్థులు
- ఆందోళనకు మద్దతు తెలిపన కాక్రోచ్ నేత అభిజిత్ దీప్కే



**రాంచీ,ఆగస్టు3(నినాదం):** నీట్ పేపర్ లీక్ నిరసనలతో కొన్నిరోజుల క్రితం దేశ రాజధాని ఢిల్లీ ఉద్రిక్తంగా మారగా.. ఇప్పుడు ఝార్ఖండ్‌లో అదే పరిస్థితి కనిపిస్తోంది. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రిలిమినరీ పరీక్షలో అవకతవకలు చోటుచేసుకున్నాయని రాజధాని నగరం రాంచీలో ప్రారంభమైన ఆందోళనలు ఉద్ధృతంగా మారాయి.

తరువాయి2లో..

# పోలీస్ భర్తీ ప్రక్రియపై అసంతృప్తి

- ఇందిరాపార్క్ వద్ద నిరుద్యోగుల మెరుపు ధర్నా



- 19వేల ఖాళీ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్
- నోటిఫికేషన్ విడుదలలో జాప్యం.. వయోపరిమితి దాటిపోయిందని ఆవేదన
- స్పందించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరిక

*తెలంగాణలో పోలీస్ ఉద్యోగాల భర్తీ వక్రియపై అసం తృప్తి వ్యక్తం చేస్తూ నిరుద్యోగ యువత హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ చౌరస్తాలో సోమవారం మెరుపు ధర్నాకు దిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన 7,437 పోలీస్ పోస్టుల నోటిఫికేషన్ సరిపోదని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న సుమారు 19 వేల పోలీస్ పోస్టుల భర్తీకి మరో సమగ్ర నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.*

**హైదరాబాద్,ఆగస్టు3(నినాదం):** నోటిఫికేషన్ విడుదలలో జరిగిన జాప్యం కారణంగా వేలాది మంది అభ్యర్థులు వయోపరిమితి దాటిపోయారని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఉద్యోగాలకు అర్హత కోల్పోయిన అభ్యర్థులకు న్యాయం చేయాలంటే వయోపరిమితిని పెంచాల్సిందేనని ప్రభుత్వాన్ని కోరారు. పోలీస్ నియామక నోటిఫికేషన్‌లో కానిస్టేబుల్ పోస్టులకు గరిష్ఠ వయోపరిమితిని 36 సంవత్సరాలకు, సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎసఐ) పోస్టులకు 38 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు.


తరువాయి2లో..

## నిరుద్యోగులను మోసం చేసిన రేవంత్



- ఉద్యోగాల భర్తీ పేరుతో ఆటలాడుకున్నారు
- నిరుద్యోగ నియామకాలు, భృతి హామీల విస్మరణ
- యువత ఆందోళనలను పట్టించుకోని కాంగ్రెస్
- మీడియా సమావేశంలో మండిపడ్డ కెటిఆర్

వివరాలు2లో..




విద్యార్థులపై నమోదైన

## కేసులు వెనక్కి

- ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు
- సుప్రీంకోర్టుకు వివరించిన కేంద్రం

2 వివరాలు



## సహజీవనం

చట్టబద్ధమైన జీవితమే

- భాగస్వామిని వేధింపులకు గురి చేస్తే చట్టప్రకారం శిక్ష
- సుప్రీం ధర్మాసనం సంచలన తీర్పు

సుప్రీంకోర్టు

## న్యాయమూర్తుల సంఖ్య పెంపు

- సీజేతో కలిపి 34 నుంచి 38కి చేరిక
- విపక్ష సభ్యుల ఆందోళన మధ్య చర్చ లేకుండానే ఆమోదం

2

సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను పెంచేందుకు ఉద్దేశించిన బిల్లుకు లోక్‌సభ సోమవారం ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను ప్రధాన న్యాయమూర్తితో కలిపి 34 నుంచి 38కి పెంచుతూ జారీ చేసిన ఆర్డినెన్స్ స్థానంలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు.



ఈయేడు కుంభవృష్టి

## వర్షాలు తప్పవు

వర్షాలతో ప్రాణనష్టం కూడా ఎక్కువే

రంగం భవిష్యవాణిలో మాతంగి వెల్లడి

### మహంకాళి ఆలయం వద్ద జోగినిలకు అవమానం

- జోగినిలను అడ్డుకోవడంపై ఆలయం ముందు ఆందోళన
- ప్రభుత్వ నిర్లక్ష్యంపై మండిపడ్డ జోగిని శ్యామల

వివరాలు2లో..



## రెండున్నరేళ్లలో వెయ్యి రొబోటిక్ శస్త్రచికిత్సలు

2


నిమ్స్ వైద్య బృందానికి సిఎం రేవంత్ రెడ్డి అభినందనలు



**హైదరాబాద్,ఆగస్టు3(నినాదం):** నిమ్స్‌లో రెండున్నరేళ్లలో వెయ్యి రొబోటిక్ శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి చేయడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ ఘనత సాధించినందుకు నిమ్స్ డైరెక్టర్ రాహుల్ దేవరాజ్‌తో పాటు వైద్య బృందం, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ బృందానికి అభినందనలు తెలిపారు.

## లాల్‌దర్వాజ బోనాలకు అన్ని ఏర్పాట్లు

- జోగినిలకు ప్రత్యేక గుర్తింపు కార్డులు
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



**హైదరాబాద్,ఆగస్టు3(నినాదం):**

లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి బోనాల సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటనలు చేశారు. జోగినిలకు ప్రత్యేక గుర్తింపు, గుర్తింపు కార్డుల జారీతో పాటు భవిష్యత్తులో వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ రోజు తెలంగాణ ప్రజలందరికీ శుభదినమని అన్నారు. అమ్మవారి ఆశీర్వాదంతో రాష్ట్రంలో సమృద్ధిగా వరాలు కురిసి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

తరువాయి2లో..

## బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌కు ఢిల్లీ కోర్టులో ఊరట

- మహిళా రెజ్లర్ల లైంగిక వేధింపుల కేసులో
- మాజీ డబ్ల్యూఎఫ్‌ఐ నిర్దోషిగా విడుదల



**న్యూఢిల్లీ,ఆగస్టు3(నినాదం):** మహిళా రెజ్లర్లు చేసిన లైంగిక వేధింపుల ఆరోపణల కేసులో భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) మాజీ అధ్యక్షుడు, బీజేపీ మాజీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌కు ఢిల్లీ కోర్టులో ఊరట దక్కింది. ఈ కేసులో ఆయనను నిర్దోషిగా ప్రకటిస్తూ రౌజ్ అవెన్యూ కోర్టు అదనపు ప్రధాన న్యాయమూర్తి అశ్విని పన్వార్ సోమవారం తీర్పు వెలువరించారు. ఈ కేసులో మరో నిందితుడైన డబ్ల్యూఎఫ్‌ఐ మాజీ సహాయ కార్యదర్శి వినోద్ తోమర్‌ను కూడా కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. సరైన సాక్ష్యాధారాలు లేకపోవడం, బాధితులు ఇచ్చిన వాంగ్మూలాల్లో వ్యత్యాసం కారణంగా కోర్టు ఈ కేసును కొట్టేసింది.

తరువాయి2లో..

సాగునీటి ప్రాజెక్టులకు

## పర్యావరణ అనుమతులే లక్ష్యం

- సుప్రీంకోర్టు తీర్పుతో న్యాయపరమైన స్పష్టత
- పాలమూరు`రంగారెడ్డి, సీతారామ సాగర్, డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులకు ప్రాధాన్యం
- సాధ్యమైనంతవరకు ఆరు నెలల్లో పక్రియ పూర్తిచేయాలని లక్ష్యం
- 60 రోజుల్లో ప్రధాన పరిపాలనా, దరఖాస్తుల పక్రియ పూర్తి
- గౌరవెల్లి పంప్‌హౌస్‌ను సర్వసన్నద్ధంగా ఉంచాలి
- అనుమతులు రాగానే సీతారామ సాగర్ పనులు పునఃప్రారంభించాలి
- మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

వివరాలు2లో..





వివరాలు2లో..

మరింత పటిష్టంగా

## మీ సేవ కేంద్రాలు

అత్యుత్తమ డిజిటల్ సేవలు అందించాలి

ప్రపంచ బ్యాంక్ ఆసియా పసిఫిక్ ప్రాంతీయ డైరెక్టర్‌తో సిఎస్ భేటీ

## సింగరేణికి డీప్‌సైడ్ కోల్‌బ్యాక్ దక్కడం సంతోషకరం

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి



**న్యూఢిల్లీ,ఆగస్టు3(నినాదం):**

డీప్‌సైడ్ కోల్ బ్లాక్ సింగరేణికి దక్కడం సంతోషకరమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సింగరేణి కార్మికులకు, కార్మికుల కుటుంబ సభ్యులకు, కార్మిక సంఘాల ప్రతినిధులకు, సింగరేణి అధికారులకు. తెలంగాణ ప్రజలకు అభినందనలు తెలిపారు. ఈ మేరకు కిషన్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల.. ఒడిశాలోని నైని కోల్ బ్లాక్, తాడిచర్ల `2 బ్లాక్ సింగరేణి

తరువాయి2లో..



## ట్రైనీ ఐపిఎస్ ఉదయ్ కస్టడీ కోరుతూ పిటిషన్

**హైదరాబాద్,ఆగస్టు3(నినాదం):** ట్రైనీ ఐపీఎస్ ఉదయ్‌కృష్ణారెడ్డి కస్టడీ కోరుతూ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఏడు రోజులపాటు కస్టడీకి కోరారు. ఈ కేసులో ఇప్పటికే పోలీసులు కీలక ఆధారాలు సేకరించారు. ఉదయ్‌కృష్ణారెడ్డి ఫోన్, ల్యాప్‌టాప్‌లను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపారు. మరో ఇద్దరి వాంగ్మూలాలను నమోదు చేశారు. ఈ వ్యవహారంలో ఆర్థిక లావాదేవీల కోణంలోనూ అధికారులు దర్యాప్తు చేపట్టారు.

2

## బాలికపై అత్యాచారం..దారుణ హత్య

### అసోంలో అమానవీయ ఘటన

**గౌహతి,ఆగస్టు3(నినాదం):** అస్సాంలో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. 15 ఏళ్ల బాలిక అత్యాచారానికి గురై, అతి దారుణమైన స్థితిలో ప్రాణాలు కోల్పోయింది. కుటుంబ సభ్యులే ఆమెను గుర్తించలేని స్థితిలో ఇంట్లో శవమై కనిపించిందని పోలీసు వర్గాలు వెల్లడించాయి. అస్సాంలోని హైలాఖాండీ జిల్లాకు చెందిన ఓ బాలిక కుటుంబ సభ్యులతో కలిసి సమీపంలోని బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కు వెళ్లింది. అయితే తన కజిన్‌తో గొడవ కారణంగా తిరిగి ఇంటికి వచ్చేసింది.



# జార్ఖండ్‌లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీక్

నియామక పరీక్షను రద్దు చేయాలని, ఆ ఆరోపణలపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని, నియామక వ్యవస్థలో సంస్కరణలు చేపట్టాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ విద్యార్థి నాయకుడు దేవేంద్రనాథ్ మహతో ఆదివారం జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ ఆందోళనలకు కాక్రోచ్ జనతాపార్టీ మద్దతు ప్రకటించింది. జేపీఎస్సీ పరీక్ష ఫలితాలు గతనెల విడుదలయ్యాయి. తర్వాత ముఖ్యమంత్రిని కలిసి, పేపర్ లీక్‌పై ఆధారాలను సమర్పించాం. కొన్నివారాలుగా నిరసనలు జరుగుతున్నా.. విద్యార్థుల ఆందోళనలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం, జేపీఎస్సీ తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమైంది. దాంతో విద్యార్థులు నిరుత్సాహానికి గురవుతున్నారు. వారిలో మనోధైర్యాన్ని నింపేందుకు, మా పోరాటాన్ని ఉద్ధృతం చేసేందుకు నిరాహార దీక్ష ప్రారంభిస్తున్నాను. నిందితులకు శిక్ష పడటమే మా ప్రధాన లక్ష్యం అని స్టేడియంలోని ఆందోళనకారులను ఉద్దేశించి మహతో మాట్లాడారు. పేపర్ లీక్ ఆరోపణలు, నియామక ప్రక్రియలో అవకతవకలు, పాలనాపరమైన లోపాలతో తమ కెరీర్‌కు తీవ్రనష్టం వాటిల్లుతోందంటూ ఆ రాష్ట్రంలోని విద్యార్థులు కొన్ని వారాల క్రితం నిరసనలు ప్రారంభించారు. జేపీఎస్సీ, జేఎస్ఎస్సీ సీజీఎల్ పరీక్షలకు సంబంధించి ఓఎంఆర్ షీట్ వైరల్ అయిన తర్వాతే ప్రభుత్వం స్పందించిందని ఆందోళనకారులు విమర్శించారు. ఈ పరీక్షల విషయంలో సంస్థాగత మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. వీరికి సీజేపీ మద్దతు ప్రకటించింది. నిరసనకారులతో మాట్లాడాం. వారికి మేం అండగా ఉంటాం. వారి డిమాండ్లకు మా మద్దతు ఉంటుందని అభిజీత్ దీప్కే ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రిలిమినరీ పరీక్షలో పేపర్ లీకైనట్లు ఆరోపణలు రావడంతో అక్కడి విద్యార్థులు గత కొన్ని రోజులుగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కాక్రోచ్ జనతా పార్టీ తాజాగా ఝార్ఖండ్ విద్యార్థులకు మద్దతు ప్రకటించింది. దేశరాజధాని రాంచీలో ప్రస్తుతం విద్యార్థుల నిరసనలు మిన్నంటాయి. పేపర్ లీక్ ఉదంతంపై దర్యాప్తు జరపాలని విద్యార్థులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. రాంచీలోని జైపాల్ సింగ్ ముండా స్టేడియం వద్ద విద్యార్థులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. విద్యార్థి నాయకుడు దేవేంద్ర నాథ్ మహతో ఆదివారం ఆమరణ దీక్ష ప్రారంభించారు. వారాల తరబడి నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు తీసుకోవడంలో విఫలమైందని మహతో ఆరోపించారు. కమిషన్, ప్రభుత్వం తీరుతో విద్యార్థుల మనోవేదనకు గురవుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి తమ డిమాండ్లకు ఆమోదం తెలిపే వరకూ తన దీక్ష కొనసాగుతుందని చెప్పారు. ఇటీవల జరిగిన ప్రిలిమినరీ పరీక్షను రద్దు చేయాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. ఈ మధ్యకాలంలో టీజీపీఎల్ ద్వారా జరిగిన పరీక్షలను సమీక్షించాలని డిమాండ్ చేశారు. ఎగ్జామ్‌లోనైనా పేపర్ లీక్ జరుగుతూనే ఉందని ఒక విద్యార్థులు మండిపడ్డారు. ఈ విషయాలపై సీఎం హేమంత్ సోరెన్ తమతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.




# విద్యార్థులపై నమోదైన కేసులు వెనక్కి

న్యూఢిల్లీ,ఆగస్టు3(నినాదం):



జంతర్‌మంతర్ వద్ద గత నెలలో విద్యార్థుల ఆందోళనల సందర్భంగా నమోదైన ఎఫ్ఐఆర్ ల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీపై సుప్రీంకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. విద్యార్థులపై నమోదైన కేసులను ముందుకు తీసుకెళ్లబోమన్న తమ హామీకి కట్టుబడి ఉన్నామని ధర్మాసనానికి కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ హామీని అత్యంత బాధ్యతగా అమలు చేయాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం, ప్రభుత్వం కోర్టుకు ఇచ్చిన హామీ కేవలం మాటల్లోనే కాకుండా ఆచరణలోనూ కనిపించాలని పేర్కొంది. గతంలో ఇచ్చిన హామీలకు విరుద్ధంగా విద్యార్థులపై అనవసరమైన చట్టపరమైన చర్యలు కొనసాగించకూడదని సూచించింది. విద్యార్థులపై బలవంతపు చర్యలు తీసుకోవద్దని ఇప్పటికే సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.ఇప్పటికే నమోదైన ఎఫ్ఐఆర్‌ల దర్యాప్తు అంశంపై వివాదం కొనసాగుతుండటంతో, ప్రభుత్వం తన హామీని ఎలా అమలు చేస్తుందనే అంశంపై కోర్టు దృష్టి సారించింది. ఇక విద్యార్థుల ఆందోళనలకు నాయకత్వం వహిస్తున్న సీజేపీ మాత్రం ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అన్ని ఎఫ్ఐఆర్‌లను పూర్తిగా ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేస్తోంది. హామీలు అమలు కాకపోతే దేశవ్యాప్తంగా మళ్లీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించింది.

# నిరుద్యోగులను మోసం చేసిన రేవంత్



హైదరాబాద్,ఆగస్టు3(నినాదం):

రాష్ట్రంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను సిఎం రేవంత్ రెడ్డి పూర్తిగా విస్మరించారని బీఆరఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. యూత్ డిక్లరేషన్ పేరిట ప్రచారంతో కాంగ్రెస్ ఊదరగొట్టిందని విమర్శించారు. జాబ్‌లు భర్తీ చేయకపోవడంతో ఓ యువకుడు ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. ఈ మేరకు సోమవారం పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో కెటీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 20వేల పోలీసు ఉద్యోగాల ఖాళీలు ఉంటే.. 7 వేల పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడమేంటన్నారు. ఉద్యోగాలు అడిగితే ఎండ్రిన్ తాగి చావాలని.. ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లను క్రిమినల్ వేస్ట్ అని సీఎం అంటున్నారు. ముఖ్యమంత్రి బాధ్యత లేకుండా మాట్లాడు తున్నారని మండిపడ్డారు. సీఎం వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ స్పందించరా..? యూత్ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ 24 హామీలు ఇచ్చి ఒక్కటైనా నెరవేర్చిందా..? అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్న రేవంత్‌రెడ్డే క్రిమినల్ వేస్ట్ అంటూ విమర్శలు గుప్పించారుఱ. సీఎం రేవంత్ రెడ్డి ఏం చదివారో కూడా నాకు డౌటే. ఆయన ఎన్నికల నామినేషన్ పత్రం సొంతంగా నింపుకోగలరా?. ఆయన ఒక్క ఇంటర్వ్యూకైనా వెళ్లారా..?' అని కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో యువత తీవ్ర నిరాశలో ఉందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఉద్యోగ హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలోని యువత ఒక రకమైన నిర్వేదంలో ఉందన్నారు. దేశ రాజకీయాలను గమనిస్తున్న ప్రతి ఒక్కరికి ఈ విషయం అర్థమవుతోందని.. ఎన్నికల సమయంలో యువతను వాడుకోవడం కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు అలవాటుగా మారిందన్నారు. అసెంబ్లీలో ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ ను ప్రస్తావిస్తూ.. రెండేళ్ల క్రితం కూడా ఉద్యోగాల భర్తీపై హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. ప్రచార సభల్లో ఇచ్చిన హామీలకు విలువ లేకపోయినా, కనీసం శాసనసభలో ఇచ్చిన మాటకైనా విలువ ఉండాలని అన్నారు. ఇటీవల ఖమ్మంలో వేణు అనే విద్యార్థి ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటనను ప్రస్తావించిన కేటీఆర్.. అతడు రాసిన సూసైడ్ నోట్‌లో రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు చేరే వరకు షేర్ చేయాలని పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. ఆ లేఖలో తమను కూడా ప్రస్తావించారని, అయితే అది సాధారణ సూసైడ్ నోట్ కాదని, కాంగ్రెస్ ప్రభుత్వంపై రాసిన చార్జ్‌షీట్‌లాంటిదని అన్నారు. అశోక్‌నగర్‌లో రాహుల్ గాంధీ ఇచ్చిన ఉద్యోగ హామీలను గుర్తు చేస్తూ.. ఉద్యోగాలు ఇవ్వకపోతే రాహుల్ గాంధీ ఇప్పుడు తెలంగాణకు ఎందుకు రావడం లేదు.? ఎక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందో అక్కడికి వెళ్లరు.. కానీ తమ ప్రభుత్వం లేని రాష్ట్రాల్లో మాత్రం రాజ్యాంగ పుస్తకం పట్టుకుని తిరుగుతారంటూ విమర్శించారు. చివరగా ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో మాజీమంత్రి జగదీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.



## పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై అసంతృప్తి

అలాగే దరఖాస్తు రుసుము కూడా నిరుద్యోగులపై అదనపు భారం అవుతోందని, దానిని వెంటనే తగ్గించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసిన నిరుద్యోగులు, తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసామని హెచ్చరించారు. పోలీస్ ఉద్యోగాల భర్తీలో పారదర్శకతతో పాటు నిరుద్యోగులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. నిరుద్యోగ జేఏసీ నేతలు పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

# సహజీవనం కూడా చట్టబద్ధమైన జీవితమే

న్యూఢిల్లీ : సహజీవనం అంశంపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. సహజీవనంలో భాగస్వామిని వేధింపులకు గురి చేసే భారతీయ శిక్షాస్మృతి లోని సెక్షన్ 498'ఏ ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చని స్పష్టం చేసింది. పెళ్లి కాలేదనే కారణంతో భర్త స్థానంలో ఉన్న వ్యక్తి వేధింపుల ఆరోపణల నుంచి తప్పించుకోలేరని పేర్కొంది. వివాహం జరగలేదన్న కారణాన్ని చూపి బాధితురాలికి చట్టపరమైన రక్షణ కల్పించకపోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు విరుద్ధమని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా భర్త అనే పదానికి ధర్మాసనం విస్తృత వివరణను ఇచ్చింది. సహజీవనం చేస్తున్న వ్యక్తిని భర్తతో సమానంగా పరిగణించవచ్చని తెలిపింది. ఇలాంటి వ్యక్తులు భాగస్వామిని వేధించి తప్పించుకోలేరని ధర్మాసనం పేర్కొంది. అయితే, అన్ని రకాల సహజీవనాలకు ఈ తీర్పు వర్తించదని స్పష్టం చేసింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి సహజీవనం చేస్తూ హింసకు పాల్పడిన వారికే సెక్షన్ 498'ఏ వర్తిస్తుందని వెల్లడించింది. అలాగే, ప్రాథమిక విచారణ నిర్వహించకుండా తక్షణ అరెస్టులు చేయవద్దని పోలీసులకు కఠిన ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా సెక్షన్ 498'ఏ ఉద్దేశాన్ని ధర్మాసనం వివరించింది. ఈ సెక్షన్ మహిళలకు భర్త లేదా అతని కుటుంబ సభ్యుల మానసిక, శారీరక వేధింపుల నుంచి రక్షించడానికి అని గుర్తు చేసింది. అలాంటి వేధింపులు కేవలం చట్టబద్ధమైన వివాహ బంధంలోనే జరుగుతాయని భావించడం వాస్తవాలకు విరుద్ధమని వ్యాఖ్యానించింది. వివాహిత మహిళకు ఒక రకమైన రక్షణ కల్పించి, అదే తరహా సంబంధంలో ఉన్న మరో మహిళకు రక్షణ నిరాకరించడం సహేతుకం కాదని ధర్మాసనం అభిప్రాయ పడింది. వ్యక్తిగత స్వేచ్ఛలో భాగంగా జీవిత భాగస్వామిని ఎంచుకునే హక్కును చట్టం గుర్తించిందని ధర్మాసనం తెలిపింది. ఆ విధంగా భాగస్వామిని ఎంచుకున్న మహిళకు చట్టపరమైన రక్షణను నిరాకరించలేమని పేర్కొంది. సహజీవనం చేస్తున్న మహిళకు తన భాగస్వామి లేదా అతని కుటుంబ సభ్యుల నుంచి వేధింపులు ఎదురైతే ఆమెకు కూడా సమాన చట్టపరమైన రక్షణ కల్పించాల్సిందేనని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది.

# సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంపు

న్యూఢిల్లీ,ఆగస్టు3(నినాదం):

నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం, రామమందిర విరాళాల నిధుల దుర్వినియోగం అంశాలపై విపక్ష సభ్యుల నినాదాల మధ్యే లోక్‌సభలో ఎలాంటి చర్చ లేకుండానే బిల్లు ఆమోదం పొందింది. ఆర్డినెన్స్ జారీ చేసినప్పటికీ విపక్ష సభ్యులు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ మూజువాణి ఓటుతో సభ తిరస్కరించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య సవరణ బిల్లు`2026ను సభలో ప్రవేశపెట్టిన సందర్భంగా కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ దాని గురించి వివరించారు. అనంతరం బిల్లుపై సభ్యులు మాట్లాడాలని సభాపతి ఓం బిర్లా కోరినప్పటికీ, విపక్షాల నినాదాలు కొనసాగడంతో బిల్లును ఓటింగ్‌కు పెట్టారు. దీంతో ఎలాంటి చర్చ లేకుండానే న్యాయమూర్తుల సంఖ్య సవరణ బిల్లు`2026కు సభ ఆమోదం తెలిపింది. ఇటీవల జనన, మరణాల నమోదు చట్ట సవరణ బిల్లు కూడా లోక్‌సభలో చర్చ లేకుండానే ఆమోదం పొందింది. తాజా బిల్లు ఆమోదం అనంతరం లోక్‌సభను స్పీకర్ వాయిదా వేశారు.

# మహంకాళి ఆలయం వద్ద జోగినిలకు అవమానం

**జోగినిలను అడ్డుకోవడంపై ఆలయం ముందు ఆందోళన**

**ప్రభుత్వ నిర్లక్ష్యంపై మండిపడ్డ జోగిని శ్యామల**

హైదరాబాద్ : ఉజ్జయిని మహంకాళి ఆలయంలో అధికారుల నిర్లక్ష్యంపై జోగిని శ్యామల ఆగ్రహం వ్యక్తం చేశారు. అవసరం వచ్చినప్పుడే జోగినిలను ప్రభుత్వం గుర్తు చేసుకుంటుందని ధ్వజమెత్తారు. బోనాల సందర్భంగా జోగినిలకు కనీస ఏర్పాట్లు కూడా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఆలయ సిబ్బంది జోగినిలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుల అత్యుత్సాహం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని జోగిని శ్యామల ఆగ్రహించారు. ఉదయం నుంచే గేట్ల వద్ద పోలీసులు జోగినిలను ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. సంప్రదాయాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా జోగినిలను అవమానించారని దుయ్యబట్టారు. ఆలయ కమిటీ జోగినిలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులు కనీసం జోగినిలని అని కూడా చూడకుండా బయటకు ఎందుకు నెట్టేశారని ప్రశ్నించారు. జోగినిలకు గౌరవం, ప్రత్యేక ఏర్పాట్లు కల్పించాలని ప్రభుత్వాన్ని జోగిని శ్యామల కోరారు. ఈ క్రమంలో ఉజ్జయిని మహంకాళి ఆలయం ముందు జోగినిలు సోమవారం ధర్నా చేపట్టారు. ఆదివారం బోనాల వేడుకల్లో జోగినిలను అవమానపరిచారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే జోగిని శ్యామలను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులకు జోగినిలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. బ్యారికేడ్లు తొలగించుకుని మహంకాళి ఆలయంలోకి జోగినిలు ప్రవేశించారు. మహంకాళి ఆలయం ముందు జోగినిల ఆందోళనతో ఆలస్యంగా రంగం కార్యక్రమం ప్రారంభమైంది. జోగినిల ఆందోళనతో అమ్మవారి ఆలయం ముందు గందరగోళ వాతావరణం నెలకొంది. జోగినిలను చర్చలకు పిలిచి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండోమెంట్ ఉన్నతాధికారులు మాట్లాడారు. ఆందోళనను విరమించాలని జోగినిలను మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

# లాల్‌దర్వాజ బోనాలకు అన్ని ఏర్పాట్లు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల జాతర కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ఈసారి భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో కొంత ఒత్తిడి ఏర్పడినా, దర్శనాలు సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేశారని చెప్పారు. జోగినిలకు ప్రత్యేక గుర్తింపు కల్పించాలని వారు కోరిన విషయాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని మంత్రి వెల్లడించారు. భవిష్యత్తులో జోగినిలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని, వారికి గుర్తింపు కార్డులు జారీ చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. అలాగే మున్సిపల్ ఎన్నికల్లో వారిని కో`ఆప్షన్ సభ్యులుగా తీసుకునే దిశగా కూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. అమ్మవారికి సేవ చేసే వారికి మూడు శాఖల సమన్వయంతో లాల్‌దర్వాజా బోనాల సందర్భంగా మరింత మెరుగైన ఏర్పాట్లు చేస్తామని, జోగినిలకు అధికారిక గుర్తింపు కల్పించే అంశంపై సంబంధిత మంత్రితో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

# ట్రైనీ ఐపిఎస్ ఉదయ్ కస్టడీ కోరుతూ పిటిషన్

ఇన్‌స్టాలో పరిచయమైన మరో యువతికి ఉదయ్ పెళ్లి ప్రతిపాదనలు పంపినట్లు గుర్తించారు. ఆ యువతి స్టేట్‌మెంట్‌ను ఇప్పటికే పోలీసులు రికార్డు చేశారు. మరోవైపు ఉప్పరపల్లి కోర్టులో ఉదయ్ బెయిల్ పిటిషన్‌పై మధ్యాహ్నం కోర్టు విచారణ చేపట్టనుంది. పోలీసు కస్టడీ పిటిషన్ రేపు విచారణకు వచ్చే అవకాశం ఉంది.

# బాలికపై అత్యాచారం.. దారుణ హత్య

వేడుక అనంతరం వారు ఇంటికి వచ్చేసరికి తమ కుమార్తెను ఆ స్థితిలో చూసి హతాశులయ్యారు. హత్య చేయడానికి ముందు తమ బిడ్డపై అత్యాచారం జరిగిందని వారు ఆరోపించారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆమె తల, ముఖం గుర్తుపట్టలేని విధంగా ఛిద్రమైందని, వ్యక్తిగత అవయవాల్లోకి రాడ్డు చొప్పించారని పోలీసు వర్గాలు వెల్లడించాయి. శవపరీక్ష అనంతరం లైంగికదాడి జరిగిందా లేదా అనేది తెలుస్తుందని, హత్యకు గల కారణాలపై స్పష్టత వస్తుందని పేర్కొన్నాయి. ఈ ఘటనపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలంటూ జాతీయ రహదారిని దిగ్బంధించారు. ప్రస్తుతం ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# మరింత పటిష్టంగా మీ సేవ కేంద్రాలు

హైదరాబాద్,ఆగస్టు3(నినాదం):

రాష్ట్రంలో మీ సేవ కేంద్రాలను మరింత పటిష్టపరిచి ప్రజలకు అత్యుత్తమ డిజిటల్ సేవలు అందించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ప్రపంచ బ్యాంక్ గ్రూప్‌కు చెందిన డిజిటల్ ఆసియా పసిఫిక్ ప్రాంతీయ డైరెక్టర్ మహేష్ ఉత్తమ్‌చందానీ నేతృత్వంలోని ప్రతినిధుల బృందంతో ప్రధాన కార్యదర్శి సమావేశమయ్యారు. సమావేశంలో డిజిటల్ ఇండియా వికసిత్ భారత్?2047 లక్ష్యాల సాధనలో భాగంగా రాష్ట్రంలో మీ సేవ కేంద్రాల ఆధునీకరణ, భారత్ ఫ్యూచర్ సిటీలో కొత్త డేటా సెంటర్ల ఏర్పాటు కోసం మౌలిక సదుపాయాల కల్పన, కృత్రిమ మేధస్సు, సైబర్ భద్రత, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్టక్చ ర్, యువతకు ఐటీ ఆధారిత ఉపాధి అవకాశాల విస్తరణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.

# సాగునీటి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులే లక్ష్యం

హైదరాబాద్,ఆగస్టు3(నినాదం):

రాష్ట్ర సాగునీటి భవిష్యత్తుకు అత్యంత కీలకమైన నాలుగు ప్రధాన ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు సాధించే ప్రక్రియను ఇకపై కాలపరిమితితో కూడిన కార్యాచరణగా ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పాలమూరు`రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, సీతారామ్ సాగర్, డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులను అత్యున్నత ప్రాధాన్య జాబితాలో ఉంచి, సాధ్యమైనంతవరకు ఆరు నెలల్లో ప్రాజెక్టులవారీగా పర్యావరణ అనుమతులు సాధించేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. పర్యావరణ అనుమతుల ప్రక్రియకు సంబంధించి సుప్రీంకోర్టు ఇటీవల వెలువరించిన తీర్పు న్యాయపరమైన స్పష్టతను కల్పించడంతోపాటు రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టుల అనుమతుల సాధనకు కొత్త అవకాశాల ద్వారాలను తెరిచిందని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకొని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖతో పాటు సంబంధిత చట్టబద్ధ సంస్థల వద్ద పెండింగ్‌లో ఉన్న ప్రతి అర్హమైన ప్రతిపాదనను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. సాగునీటి ప్రాజెక్టుల పర్యావరణ అనుమతులు, న్యాయపరమైన అంశాలు, పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంపై సోమవారం రోజున రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షత వహించారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ బలరాం నాయక్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. సుప్రీంకోర్టు తాజా తీర్పులో పేర్కొన్న అంశాలను ప్రస్తావించిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, గతంలో చట్టబద్ధంగా పర్యావరణ అనుమతులు పొందిన ప్రాజెక్టులకు ఆ రక్షణ కొనసాగుతుందని తెలిపారు. ఇప్పటికే పరిశీలనలో ఉన్న దరఖాస్తులను సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కరించే అవకాశం ఉందన్నారు. గతంలో తిరస్కరణకు గురైన ప్రతిపాదనలను ప్రాజెక్టులవారీగా సమగ్రంగా పరిశీలించి, సాంకేతిక, విధానపరమైన లోపాలను సరిదిద్దిన అనంతరం చట్టపరంగా అవకాశం ఉన్నచోట తిరిగి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాజెక్టుల పర్యావరణ అనుమతులపై సుదూర ప్రభావం చూపగల ఈ తీర్పు వెలువడటం వెనుక తెలంగాణ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు అనుమతులు సాధించేందుకు నిరంతరంగా సాగించిన న్యాయపోరాటం ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఈ తీర్పులోని న్యాయసూత్రాలను లోతుగా అధ్యయనం చేసి, రాష్ట్రంలోని ప్రతి ప్రాజెక్టుకు అవి ఏ విధంగా వర్తిస్తాయో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. తెలంగాణ సాగునీటి ప్రయోజనాల పరిరక్షణలో అంతర్రాష్ట్ర విభాగం అత్యంత కీలకమని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆ విభాగాన్ని తగిన సాంకేతిక, పర్యావరణ, న్యాయ నిపుణులతో మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం, జాతీయ హరిత ట్రిబ్యునల్?ఎన్‌జీటీ, సుప్రీంకోర్టు, ఇతర న్యాయస్థానాలు, చట్టబద్ధ సంస్థల ముందు తెలంగాణ వాదనను శాస్త్రీయ ఆధారాలు, సమగ్ర పత్రాలతో బలంగా వినిపించే సామర్థ్యాన్ని పెంపొందించాలన్నారు. `రతి ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి చరిత్ర అధికారుల వద్ద అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ప్రతి అంశాన్ని ఒకే సమగ్ర దస్త్రంలో పొందుపరచాలని ఆదేశించారు. పర్యావరణ అనుమతుల సాధనకు మంత్రి దశలవారీ కార్యాచరణను నిర్దేశిరచారు.

# సింగరేణికి డీప్‌సైడ్ కోల్ బ్యాక్ దక్కడడం సంతోషకరం

సిగలో చేరిన సందర్భంలో.. ఖఐక్షఅ`2 డిప్ సైడ్ బ్లాక్‌ను కూడా సింగరేణికే దక్కేలా చొరవ తీసుకోవాలని కార్మికులు, యూనియన్ లీడర్ల నుంచి డిమాండ్లు వచ్చాయని ప్రస్తావించారు. ఖఐక్షఅ`2 డీప్‌సైడ్ బ్లాక్ సింగరేణికి వచ్చే విధంగా అన్నిరకాలుగా బాధ్యత వహించానని తెలిపారు. తాను కేంద్ర మంత్రిగానే కాకుండా తెలంగాణ బిడ్డగా.. సింగరేణి శ్రేయస్సు, అభివృద్ధి, సింగరేణి కార్మికులను ప్రేమించే వ్యక్తిగా ప్రత్యేక కృషి చేశానని చెప్పుకొచ్చారు. తన సహకారం ఫలితంగా సింగరేణి విజయం సాధించడం చాలా సంతోషకరమైన విషయమని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో సోమవారం వేలం ప్రక్రియ పూర్తయిపోయిందని వెల్లడించారు. ఈ విధానంలో సింగరేణి సంస్థకు మణుగూరు ఖఐక్షఅ`2 డిప్‌సైడ్ బ్లాక్‌ను కేటాయిస్తున్నట్లు తెలిపారు. దక్షిణ భారతదేశంలో ఉన్న ఏకైక బొగ్గు ఉత్పత్తి సంస్థ అయిన సింగరేణి సంస్థ.. ఈ డిప్ సైడ్ బ్లాక్ వల్ల సుమారు 180 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వ్ ఉన్నాయని వెల్లడించారు. ఈ సంవత్సరానికి 6 మిలియన్ టన్నుల చొప్పున 25 ఏళ్లపాటు ఈ మైన్ నడుస్తుందని స్పష్టం చేశారు. దాదాపు 2వేల మందికి ఉద్యోగాలు వస్తాయని కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఇక్కడ దొరికే ఉ`8 బొగ్గు కారణంగా.. మొత్తం రూ.43వేల కోట్లకు పైగా రెవెన్యూ జనరేట్ అవుతుందని చెప్పుకొచ్చారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వానికి రూ.10,500 కోట్లకు మించి ఆదాయం కూడా వస్తుందని వివరించారు. తెలంగాణ ఇంధన భద్రతకు భరోసా దక్కడంతోపాటుగా.. సింగరేణి భవిష్యత్తు అభివృద్ధికి అవసరమైన వనరులు లభిస్తాయని వెల్లడించారు. ప్రభుత్వానికి, సింగరేణికి, విద్యుత్ రంగానికి, ఉద్యోగులకు మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వానికి దాదాపుగా రూ.48వేల కోట్లకు పైగా ఆదాయం సమకూరుతుందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# రెండున్నరేళ్లలో వెయ్యి రోబోటిక్ శస్త్రచికిత్సలు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పం నెరవేరిందన్నారు. నిమ్స్‌లో ఇప్పటివరకు నిర్వహించిన రోబోటిక్ సర్జరీల్లో 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా నిర్వహించడం ప్రత్యేకంగా అభినందించాల్సిన విషయమని అన్నారు. ఇటీవలే రెండు వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను పూర్తి చేసిన నిమ్స్, ఇప్పుడు వెయ్యి రోబోటిక్ సర్జరీల మైలురాయిని చేరుకోవటం ద్వారా కొత్త రికార్డు నెలకొల్పిందన్నారు. వైద్య రంగంలో నిమ్స్ మరిన్ని మైలురాళ్లు సాధించాలని సీఎం ఆకాంక్షించారు

# బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌కు ఢిల్లీ కోర్టులో ఊరట

ఆరుగురు మహిళా రెజ్లర్లు చేసిన ఫిర్యాదుల ఆధారంగా బ్రిజ్‌భూషణ్‌పై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం 2023 జూన్ 15న మహిళల గౌరవానికి భంగం కలిగించడం, లైంగిక వేధింపులు, బెదిరింపులకు పాల్పడినట్లు పలు సెక్షన్ల కింద ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. 2024 మే 10న ట్రయల్ కోర్టు ఐదుగురు మహిళా రెజ్లర్లకు సంబంధించిన ఆరోపణలపై బ్రిజ్‌భూషణ్‌పై అభియోగాలు నమోదు చేసింది. ఇద్దరు రెజ్లర్లను బెదిరించిన ఆరోపణలపైనా విచారణ కొనసాగింది. అలాగే ఒక మైనర్ రెజ్లర్ కూడా ఆరోపణలు చేసినప్పటికీ, అనంతరం ఆమె ఫిర్యాదును ఉపసంహరించుకోవడంతో పోక్సో చట్టం కింద నమోదైన కేసును పోలీసులు రద్దు చేశారు. తాజా తీర్పుతో బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్, వినోద్ తోమర్ ఇద్దరూ ఈ కేసులో నిర్దోషులుగా విడుదలయ్యారు. సరైన సాక్ష్యాధారాలు లేకపోవడం, బాధితులు ఇచ్చిన వాంగ్మూలాల్లో వ్యత్యాసం కారణంగా కోర్టు ఈ కేసును కొట్టివేసింది.2016`2019 మధ్యకాలంలో తాము లైంగిక వేధింపులు ఎదుర్కొన్నామంటూ 2023లో మహిళా రెజ్లర్లు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసనలు చేపట్టడం అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనమైంది. నాటి సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ , ఇతర సభ్యులపై వారు ఈ ఆరోపణలు చేశారు. ఈ నిరసనల్లో స్టార్ రెజ్లర్లు వినేశ్ ఫొగాట్, సాక్షి మాలిక్, బజరంగ్ పునియా తదితరులు పాల్గొన్నారు. కేంద్రం జోక్యంతో వారు మధ్యలో నిరసనలు విరమించారు. అయితే తగిన చర్యలు తీసుకోవట్లేదని ఆరోపిస్తూ ఆరుగురు రెజ్లర్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. మరోసారి నిరసనలు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా పార్లమెంట్ కొత్త భవనంవైపు మార్చ్ చేపట్టగా.. వారిని పోలీసులు అడ్డుకోవడం, వారిని ఈడ్చుకెళ్లిన దృశ్యాలు వైరల్ అయ్యాయి. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ కూడా తీవ్రంగా స్పందించింది. ఆరుగురు మహిళా రెజ్లర్లు చేసిన ఫిర్యాదు ఆధారంగా బ్రిజ్‌భూషణ్‌పై కేసు నమోదైంది. పోలీసులు అభియోగాలు దాఖలు చేశారు. ఆ ఆరుగురిలో వినేశ్ ఫొగాట్ కూడా ఉన్నారు. ఆ విషయాన్ని 3 నెలల క్రితం ఆమె వెల్లడించారు. లైంగిక వేధింపుల బాధితుల గుర్తింపును పరిరక్షించేలా సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఇంతకాలం తన గుర్తింపును బయటపెట్టలేదని వెల్లడించారు. అంతకు ముందు మైనర్ రెజ్లర్ ఒకరు తాను చేసిన ఆరోపణలను వెనక్కి తీసుకోవడంతో పోక్సో కేసులో సింగ్ ఇప్పటికే నిర్దోషిగా తేలారు. ఇక నేటి తీర్పుతో ఆయనపై క్రిమినల్ విచారణ ముగిసినట్లయింది. తొలినుంచి బ్రిజ్ భూషణ్ తనపై వచ్చిన ఆరోపణలను తోసిపుచ్చారు. ఆ ఆరోపణలు నిజమని తేలితే.. నేను ఉరివేసుకుంటానని తొలిరోజే చెప్పాను. నేడు నేను నిర్దోషిగా తేలినందుకు ఎంతో సంతోషంగా ఉందని తీర్పు అనంతరం సింగ్ వ్యాఖ్యానించారు.



# పొలంలో నాట్లు వేసి విద్యార్థులకు పాఠాలు

అన్నం తయారయ్యే తీరును చూపిన ఉపాధ్యాయుడు

వెంకటాపురం మండలం మరికాల కొత్తూరులో వినూత్న కార్యక్రమం






**ములుగు ప్రతినిధి, ఆగస్టు 3 (నినాదం):** సెల్‌ఫోన్, టీవీల మధ్య పెరుగుతున్న నేటి తరానికి వ్యవసాయం అంటే ఏమిటో, రైతు కష్టం ఎంతంతో తెలియజేయాలనే సంకల్పంతో ఓ ఉపాధ్యాయుడు తరగతి గదిని వదిలి పొలంలోకి వచ్చారు. పిల్లల చేతులతోనే వరి నాట్లు వేయించి "అన్నం ఎలా వస్తుంది"నే ప్రత్యక్షంగా చూపించారు. వెంకటాపురం మండలం మరికాల కొత్తూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కాపుల విజయ్ ఈ వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించి అందరి ప్రశంసలు అందుకున్నారు. సోమవారం పాఠశాల విద్యార్థులందరిని సమీపంలోని వరి పొలానికి తీసుకెళ్లారు. అక్కడ స్థానిక రైతుల సహకారంతో విద్యార్థులకు వరి సాగులోని ప్రతి అంశాన్ని ఆచరణాత్మకంగా నేర్పించారు. ముందుగా నారు ఎలా పెంచుతారో, పొలాన్ని ఎలా దున్ని సిద్ధం చేస్తారో వివరించారు. ఆ తర్వాత విద్యార్థుల చేతులతోనే వరి నాట్లు వేయించారు. బురదలోకి దిగిన పిల్లలు మొదట్లో భయపడినా, కాసేపటికే ఉత్సాహంగా నాట్లు వేయడం ప్రారంభించారు. నాట్లు వేసిన తర్వాత పంటకు నీరు ఎలా పెట్టాలి, కలుపు ఎలా తీయాలి, తెగుళ్ళ నుంచి ఎలా కాపాడాలి, ఎరువులు ఎప్పుడు వేయాలి, చివరకు పంటను ఎలా కోత కోయాలనే విషయాలను సులభమైన భాషలో విద్యార్థులకు అర్థమయ్యేలా చెప్పారు. పాఠ్యపుస్తకంలో చదివే దానికంటే కళ్ల ముందు చూడటం వల్ల విషయం త్వరగా మనసులో నాటుకుంటుంది. వ్యవసాయం కేవలం ఒక వృత్తి కాదు, అది ఒక జీవన విధానం" అని విజయ్ సార్ విద్యార్థులకు తెలియజేశారు. బురదలో గంటసేపు పనిచేసిన తర్వాత రైతు ఎంత కష్టపడతాడో విద్యార్థులకు అర్థమైంది. "సార్ కాళ్లు నొప్పులు వస్తున్నాయి, కానీ రైతులు రోజంతా ఇలాగే ఎలా చేస్తారా" అని ఒక విద్యార్థి అడిగిన ప్రశ్న అందరినీ ఆలోచింపజేసింది. ఈ అనుభవంతో విద్యార్థుల్లో అన్నం వృథా చేయకూడదనే భావం, రైతు పట్ల గౌరవం పెరిగింది. ఈ సందర్భంగా కాపుల విజయ్ మాట్లాడుతూ, "నేటి తరం పిల్లలకు వ్యవసాయం అంటే తెలియడం లేదు. అన్నం ప్లేట్‌లోకి ఎలా వస్తుందో తెలియదు. దేశానికి అన్నం పెట్టే రైతు గొప్పతనాన్ని చిన్నప్పటి నుంచే పిల్లలకు తెలియజేయాలి. విద్యతో పాటు జీవిత నైపుణ్యాలు, ప్రకృతి పట్ల ప్రేమ, వ్యవసాయం పట్ల అవగాహన పెంపొందించడం కూడా పాఠశాలల బాధ్యత" అని అన్నారు. ఈ కార్యక్రమాన్ని గ్రామస్తులు, రైతులు, తల్లిదండ్రులు అభినందించారు. "ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి అనుభవాత్మక బోధన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం. దీనివల్ల పిల్లల్లో వ్యవసాయంపట్ల చైతన్యం, శ్రమకు గౌరవం, ప్రకృతి పరిరక్షణపై బాధ్యత పెరుగుతుంది" అని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యత పెంపొందించడంలో ఈ కార్యక్రమం ఆదర్శప్రాయంగా నిలిచిందని ప్రశంసించారు. ఇలాంటి కార్యక్రమాలను ప్రతి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించాలని కోరారు.




**SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
**గంజ్ బ్రాంచ్, భైంసా, (బ్రాంచ్ కోడ్: (20123)**
**నిర్మల్ జిల్లా. Email: sbi.20123@sbi.co.in**

**ఇ-వేలం అమ్మకపు ప్రకటన**

సాధారణ ప్రజలతో పాటు ముఖ్యంగా ఋణగ్రహీతలకు మరియు హామీదారులకు ఈ నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారి భౌతిక స్వాధీనం చేసుకున్న క్రింద పేర్కొన్న వాహనమును "ఎక్కడ ఏ స్థితిలో ఉన్నదో అక్కడ ఆ స్థితిలో", "ఏ స్థితిలో ఉన్నదో ఆ స్థితిలో" మరియు "ఏది ఏ స్థితిలో ఉన్నదో ఆ విధంగా" ప్రాతిపదికన 07.08.2026 నాటి వేలంలో విక్రయించడము జరుగుతుంది. ఋణగ్రహీతలు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెల్లించాల్సిన బాకీ నిమిత్తం 05-02-2026 నాటి రూ.4,43,505/- తో పాటు తదుపరి వడ్డీ, ఇతర ఖర్చుల రాబట్టుకొరకుగానే ఈ విక్రయం నిర్వహించబడుతుంది.

| ఎ | బి | సి | డి | ఇ | ఎఫ్ |
|---|---|---|---|---|---|
| క్ర. సం. | ఋణగ్రహీత పేరు & ఖాతా నం. | కారు యొక్క వివరములు, రిజిస్ట్రేషన్ నెం. / మోడల్ / కి.మీ. రీడింగ్ | రిజర్వు ధర & ఇ.యం.డి. | వేలం సమయం | వాహన తనిఖీ కొరకు సంప్రదించవలసిన వారు |
| 01 | శ్రీమతి అడెలు అశ్విని రెడ్డి సామాల్, ఓవర్‌డ్రాఫ్ట్ అకౌంట్ నెం.42669818219 | TS-18-J-2561, MARUTI ALTO K10 VXI 1L 5MT BSVI-PH2, Chassis No. MA3SFM61SPK229546 Model 2023, Reading: 45000 KMS | రూ. 2,60,000/- & ఇ.యం.డి. రూ. 26,000/- | 07.08.2026 వేలం తేదీ 11-30 గంటల నుండి మధ్యాహ్నం 12-30 గంటల వరకు | సూర్య అసోసియేట్స్ (ఆడిట్) సిహెచ్.శ్యామ్ 8886068456 |
| | | కనీస బిడ్ పెంపుదల రూ.2,000/- | | | |


ఇ-వేలం నిబంధనలు మరియు షరతులు: (1) ఆన్‌లైన్ ఇ-వేలం బిడ్ ఫారమ్, డిక్లరేషన్, ఆన్‌లైన్ వేలం విక్రయ సాధారణ నిబంధనలు మరియు షరతులు కలిగిన ఈ-వేలం టెండర్ డాక్యుమెంట్ https://bankeauctions.com వెబ్‌సైట్ లో అందుబాటులో ఉన్నాయి. [illegible] M/s. C1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, [illegible] +91-124-4302020 / 21 / 22 / 23, 7291981124 / 81125 / 81126; [illegible] +91-9948182222 [illegible] support@bankeauctions.com, [illegible] Telangana@c1india.com మరియు sbi.20123@sbi.co.in [illegible] (2) బిడ్డర్ ధరలో 10% ఆధీ ధరావత్తు మొత్తం ను 06-08-2026 నాటి సాయంత్రం 3.00 గంటల లోపు కేవలం NEFT/RTGS ద్వారా క్రింది "STATE BANK OF INDIA, GUNJ BRANCH (20123) BHAINSA, NIRMAL DISTRICT" [illegible] మిగిలిన మొత్తాన్ని వేలం పూర్తయిన వెంటనే అదే రోజున పైన పేర్కొన్న ఖాతాలో జమ చేయాలి, లేనిచో ఇప్పటికే చెల్లించిన ధరావత్తు మొత్తం జప్తు చేయబడుతుంది మరియు సదరు వాహనమును తిరిగి వేలం నిర్వహించే పూర్తి హక్కు బ్యాంకుకు ఉంటుంది. (3) ఈ విక్రయం బ్యాంకు విధించిన నిబంధనలు/షరతులకు లోబడి ఉంటుంది మరియు ఎటువంటి కారణం చూపకుండా ఏదైనా/అన్ని ఆఫర్‌లను ఆమోదించే లేదా తిరస్కరించే హక్కు బ్యాంకుకు ఉంది. (4) ఈ విక్రయం బ్యాంకు విధించిన నిబంధనలు/షరతులకు లోబడి ఉంటుంది మరియు ఎటువంటి కారణం చూపకుండా ఏదైనా/అన్ని ఆఫర్‌లను ఆమోదించే లేదా తిరస్కరించే హక్కు బ్యాంకుకు కలదు. (5) కార్లను తనిఖీ చేయడానికి 04-08-2026 నుండి 06-08-2026 వరకు శ్రీ సాయి పార్కింగ్ యార్డ్, కొండపూర్ రోడ్, నిర్మల్-504106 వద్ద అందుబాటులో ఉంటాయి.

తేది: 03-08-2026, ప్రదేశము: నిర్మల్ — సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

## శభాష్ టీచర్...!

నిరుపేద విద్యార్థి చదువుకు అండ

రూ.80 వేల ఆర్థిక సహాయం అందజేత



**పాలేరు ఆగస్టు 03(నినాదం):** ఓ నిరుపేద విద్యార్థి ఉన్నత చదువుల కు ఉపాధ్యాయురాలు అండగా నిలిచి ఆదర్శంగా నిలిచింది. నేలకొండపల్లి మండలం లోని రాయగూడెం లో గత ఏడాది పదో తరగతి లో అత్యంత ప్రతిభ కనపరిచిన విద్యార్థి కె.పృధ్వీ చరణ్ కు ఆ పాఠశాల ఉపాధ్యాయురాలు బాసటగా నిలిచింది. పేదరికం వలన విద్య ఆగకూడదని.సరస్వతీ పుత్రుడు కు ఉన్నత విద్య ను అందించేందుకు హిందీ ఉపాధ్యాయురాలు వి.మాధవీలత ముందుకొచ్చింది. ఉన్నత చదువుల కోసం నేనున్నాను అంటూ ఉపాధ్యాయురాలు దాతృత్వం ను చాటుకుంది.ఆ విద్యార్థి ఇంటర్ చదువుల కోసం రూ.80 వేల నగదు ను సోమవారం ఆర్థిక సహాయం అందించారు. ఉపాధ్యాయురాలను పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీ.వెంకటేశ్వర్లు, సుంతరమోని నాగార్జున,బెల్లంకొండ సత్యనారాయణ, జీ.రాజు, బీ.నాగేశ్వరరావు, బీ.తిరుమలప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్ తరాల కోసం భూగర్భజలాలు పెంచాలి

సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్



**వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 3 (నినాదం):** భవిష్యత్ తరాలకు నీటినిల్వలు అందించాలంటే భూగర్భ జలాలను పెంచాలని పెద్దమందడి మండలం మనిగిల్ల సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ కోరారు. సోమవారం గ్రామంలో జలసిరి కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి ఊరికి ఊట కుంట అనే నినాదంతో సామాజిక ఇంకుడు గుంతలకు సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతిష్టాత్మకంగా నీటి నిలువలు, భూగర్భ జలాలు పెరగడానికి అవసరాలకు ఉపయోగించుకున్న నీరు వృధా కాకుండా ఇంకుడు గుంతల్లో వదలాలని అన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణంతో నీటి నిల్వలు పెరుగుతాయని, ప్రతి ఒక్కరు ప్రతి ఇంటి దగ్గర ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలని గ్రామస్తులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వెంకటేష్, ఉప సర్పంచ్ ముప్పూరీ గణేష్, పాఠశాల హెచ్ ఎం వెంకటేష్, గ్రామస్తులు సంచార మౌని రాములు, రాంరెడ్డి, ప్రతాప్ రెడ్డి, బాలరాజు, వెంకటయ్య, శ్రీకాంత్ రెడ్డి, కోములయ్య, రాములు సాగర్ తదితరులు పాల్గొన్నారు.



## ఒక్కరి అవయవ దానం ఐదుగురు ప్రాణాలను కాపాడుతుంది

- జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్




**నల్లగొండ ప్రతినిధి ఆగస్టు 3 (నినాదం ):** ఒక్కరి అవయవ దానం ఐదుగురు ప్రాణాలను కాపాడవచ్చు అని జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాతీయ అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని, అవయవదానం పట్ల సమాజంలో మరింత అవగాహన కల్పించి, మరణానంతరం కూడా అనేక మంది జీవితాలకు వెలుగునిచ్చిన అవయవదాతల కుటుంబాలను గౌరవించాలనే లక్ష్యంతో లయన్స్ క్లబ్ ఆఫ్ నల్గొండ చారిటబుల్ ట్రస్ట్ మరియు లయన్స్ క్లబ్ నల్గొండ ఆధ్వర్యంలో, నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో హృద్యమైన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గౌరవ నల్గొండ జిల్లా కలెక్టర్ శ్ ముందుగా అవయవదాన ప్రతిజ్ఞ పత్రంపై సంతకం చేసి, అవయవదానం పట్ల తన సంపూర్ణ మద్దతును తెలియజేశారు. అనంతరం అవయవదానం ద్వారా పలువురికి పునర్జన్మ ప్రసాదించిన తొమ్మిది మంది అవయవదాతల కుటుంబాలను శాలువాలతో ఘనంగా సత్కరించి, ప్రత్యేకంగా రూపొందించిన "కృతజ్ఞతా పూర్వక" ప్రశంసా పత్రాలతో కూడిన ప్రత్యేకమైన ఫోటో ఫ్రేమ్ లను అందజేసి వారి సేవా త్యాగానికి గౌరవ వందనం అర్పిం మాట్లాడుతూ, అత్యంత విషాద సమయంలో కూడా తమ ప్రియమైన కుటుంబ సభ్యుల అవయవాలను దానం చేయడానికి అంగీకరించిన ఈ కుటుంబాలు నిజమైన మానవతా మూర్తులని కొనియాడారు. తమ వ్యక్తిగత దుఃఖాన్ని అధిగమించి, తెలియని వ్యక్తుల జీవితాలను కాపాడేందుకు తీసుకున్న ఈ మహోన్నత నిర్ణయం సమాజానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా వెంటనే సంబంధిత శాఖల అధికారులకు తెలియచేశారు. కుటుంబాలకు ధైర్యం చెబుతూ "ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది. మీ కుటుంబ సభ్యులు చేసిన ఈ మహోన్నత సేవను సమాజం ఎప్పటికీ గుర్తుంచుకుంటుంది" అని భరోసా కల్పించారు. అలాగే భవిష్యత్తులో లయన్స్ క్లబ్ చేపట్టనున్న నేత్రదానం, అవయవదాన అవగాహన కార్యక్రమాలకు జిల్లా యంత్రాంగం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 320జు జిల్లా గవర్నర్ కే. వి ప్రసాద్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు అశోక్ ఎర్రమాద, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్ వి కుమార్, ఐ డొనేషన్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ డా. హరనాథ్ కడిమి , కో-ఆర్డినేటర్ లు చిరునోముల చంద్రశేఖర్, కో-ఆర్డినేటర్ కోట సరిత, లయన్స్ సభ్యులు, అవయవదాతల కుటుంబ సభ్యులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ అరుదైన గౌరవం తమ జీవితంలో మరపురాని అనుభూతిగా నిలిచిపోతుందని అవయవదాతల కుటుంబ సభ్యులు భావోద్వేగంతో తెలిపారు. తమ కుటుంబ సభ్యుల త్యాగానికి ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ గారు మరియు లయన్స్ క్లబ్ వారు ఇచ్చిన గౌరవం తమకు గొప్ప ఆత్మస్థైర్యాన్ని కలిగించిందని పేర్కొంటూ, లయన్స్ సంస్థకు మరియు కార్యక్రమ నిర్వాహకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

పంజాబ్ నేషనల్ బ్యాంక్ | punjab national bank ...the name you can BANK upon!

**ఎఆర్ఎంబి సికింద్రాబాద్**
103, 8-2-248-ఎ, మహర్షి హౌస్, రోడ్ నెం. 3, బంజారా హిల్స్, హైదరాబాద్ - 500034.
టెలిఫోన్: 040-23147032, ఇమెయిల్ : cs8313@pnb.bank.in

**చరాస్తుల స్వాధీనం సేకరణకు తుది ప్రకటన**

**శ్రీ మూడా శ్రీనివాస్, తండ్రి అంజయ్య,** ఇ.నెం. 6-22-844, రాజీవ్ నగర్, నిజామాబాద్, **శ్రీమతి మూడా రుచిత, భర్త మూడా శ్రీనివాస్,** ఇ.నెం. 6-22-844, రాజీవ్ నగర్, నిజామాబాద్

గౌరవ చీఫ్ జుడీషియల్ మెజిస్ట్రేట్, నిజామాబాద్ గారిచే నియమించబడిన అడ్వకేట్ కమీషనర్, నిజామాబాద్‌లోని కంఠేశ్వర్‌లో ఉన్న సమృద్ధి హోమ్స్ అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్ నెం. 108 గల సెక్యూర్డ్ ఆస్తిని స్వాధీనం చేసుకుని, దానిని **పంజాబ్ నేషనల్ బ్యాంక్** యొక్క అధీకృత అధికారికి పంపించారు. సెక్యూర్డ్ ఆస్తిని **భౌతికంగా స్వాధీనం** చేసుకునే సమయంలో, ఫ్లాట్‌లో కొన్ని చరాస్తులు కనుగొనబడ్డాయి, వాటిని సక్రమంగా జాబితా చేసి, బ్యాంకు అద్దెకు తీసుకున్న గోదాములో భద్రపరిచారు. బ్యాంకు అధీకృత అధికారి గతంలో మీకు తేది **20-12-2025 మరియు 12-01-2026** తేదీలలో నోటీసులు జారీ చేసి, బ్యాంకు నుండి చరాస్తులను స్వాధీనం చేసుకోమని కోరారు, కానీ మీ నుండి ఎటువంటి స్పందన రాలేదు.

కావున మిమ్మల్ని 7 రోజుల వ్యవధిలోగా బ్యాంకు నుండి చరాస్తులను స్వాధీనం చేసుకోమని కోరడమైనది. అలా చేయడంలో విఫలమైతే, స్క్రాప్ డీలర్ల నుండి కొటేషన్లను ఆహ్వానించడం ద్వారా బ్యాంకు ఆ చరాస్తులను విక్రయించుటకు ముందుకు సాగుతుంది మరియు బ్యాంకుకు అయిన ఖర్చులను అమ్మకం ద్వారా వచ్చిన సొమ్ము నుండి సర్దుబాటు చేయడం జరుగుతుంది.

**దీనిని తుది నోటీసుగా పరిగణించండి.**

**తేది: 03.08.2026** — సం/- చీఫ్ మేనేజర్ / అధీకృత అధికారి
ప్రదేశము: హైదరాబాద్ — పంజాబ్ నేషనల్ బ్యాంక్

**సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్**
ఆపరేషన్ : మేడ్చల్ సర్కిల్


**టెండరు ప్రకటన నెం.05/2026-27 Tsp No.46 to 71 /26-27**

దిగువ వాటి కొరకు అనుభవం మరియు జిఎస్‌టి కలిగిన విక్రేతల నుండి సీల్డ్ టెండర్లు ఆహ్వానించబడుతున్నాయి. 1) Tsp No.58, 62, 64 & 69/26-27 - మేడ్చల్ సర్కిల్ కార్యాలయం, 2) Tsp No.54/25-26 - జీడిమెట్ల డివిజన్ కార్యాలయం, 3) Tsp No.53/26-27 - కూకట్‌పల్లి డివిజన్ కార్యాలయం, 4) Tsp No.56, 57, 59, 60, 61, 63, 65, 66, 67, 68, 70 & 71/26-27 - మేడ్చల్ డివిజన్ కార్యాయలయం, 5) Tsp No.46/26-27 - నిర్మాణము డివిజన్ కార్యాలయం, మేడ్చల్, 6) Tsp No.55/26-27 - MRT డివిజన్ కార్యాలయం, మేడ్చల్, 7) Tsp No.47/26-27 - సివిల్ వింగ్ కార్యాలయం, మేడ్చల్. తదుపరి వివరముల కొరకు www.tgsouthernpower.orgలో చూడవచ్చును.

DIPR RO No.7204-PP/CL/Adv/2026-27, తేది : 03.08.2026 — సం/- కార్యనిర్వాహక ఇంజనీర్, ఆపరేషన్, మేడ్చల్

## ఎస్ఐఆర్ విజయవంతానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు క్రియాశీలకంగా సహకరించాలి

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 03 (నినాదం):** జిల్లాలో జరుగుతున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, విజయవంతంగా పూర్తి చేయడంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు క్రియాశీలకంగా సహకరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు. ఎన్నికల ప్రక్రియను మరింత పటిష్టంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల సూచనలు, సహకారం ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ, డిజిటలైజేషన్ పురోగతి, ఓటరు జాబితా సవరణకు సంబంధించిన అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణ గడువును ఆగస్టు 10 వరకు పొడిగించిందని తెలిపారు. ఇప్పటివరకు ఫారాలు సమర్పించని అర్హులైన ఓటర్లు వెంటనే తమ బూత్ స్థాయి అధికారి (బీఎల్‌వో)కి లేదా సంబంధిత హెల్ప్‌డెస్క్‌లో ఫారాలు అందజేయాలని కోరారు. జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ సగటున 78.50 శాతం పూర్తయిందని తెలిపారు. నిర్ణీత గడువులోగా డిజిటలైజేషన్ పూర్తి చేయడానికి నిరంతర పర్యవేక్షణతో చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ (పునర్వ్యవస్థీకరణ) ప్రక్రియ కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే ఓటరు జాబితాలో గుర్తించిన వ్యత్యాసాల (అనామలీస్)కు సంబంధించి ఆయా ఓటర్లకు నోటీసులు జారీ చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో నియోజకవర్గాల వారీగా డిజిటలైజేషన్ పురోగతి వివరాలను వెల్లడిస్తూ, నారాయణఖేడ్‌లో 88 శాతం, ఆందోల్‌లో 87 శాతం, జహీరాబాద్‌లో 81 శాతం, సంగారెడ్డిలో 79 శాతం, పటాన్‌చెరులో 66 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమం సజావుగా కొనసాగుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. తమ పరిశీలనలో గుర్తించిన పలు అంశాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి, కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, ఈఆర్‌వోలు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

## గ్రామాలలో అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

- సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేయండి
- పటాన్చెరు శాసనసభ్యులు మహిపాల్ రెడ్డి



**పటాన్చెరు, ఆగస్టు 03 (నినాదం):** పటాన్చెరు, గుమ్మడిదల మండల పరిధిలోగల గ్రామాలలో ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సోమవారం సాయంత్రం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పటాన్చెరు, గుమ్మడిదల మండలాల పరిధిలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, పిఆర్ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అందించే నిధులతో పాటు సిఎస్ఆర్ నిధులు కేటాయిస్తామని తెలిపారు. నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో పరిష్కారానికి నోచుకోని సమస్యలను తన దృష్టికి తీసుకొని వస్తే.. పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. నందిగామ గ్రామపంచాయతీ పరిధిలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేస్తే. రాబోయే పది రోజుల్లో ప్రారంభిస్తామని తెలిపారు. దీని ద్వారా ప్రతినెల గ్రామపంచాయతీకి ఆదాయం లభిస్తుందని తెలిపారు. భానూరు, క్యాసారం, నందిగామ గ్రామపంచాయతీల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలకు రూపకల్పన చేయాలని ఆదేశించారు. గుమ్మడిదల మండల పరిధిలోని అనంతరం, కానుకుంట, నూతనకల్, కొత్తపల్లి, తదితర గ్రామాల పరిధిలో అంతర్గత రహదారుల నిర్మాణానికి హ్యామ్ ద్వారా నిధులు మంజూరయ్యాయని.. త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు డిఈ దీపక్ తెలిపారు. టెండర్లు పూర్తి చేసిన పనులు ప్రారంభించక పోతే.. సంబంధిత కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవోలు యాదగిరి, ఉమాదేవి, పిఆర్ డిఈ దీపక్, ఎంపీఓ హరిశంకర్ గౌడ్, ఏఈ శశిధర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేక నిఘా

సంఘవిద్రోక చర్యలకు పురికొల్పే యత్నం

యువత విద్యార్థుల టార్గెట్‌గా గంజాయి విక్రయం

6 కేజీల గంజాయి 38 బాటిల్ల దగ్గు మందు స్వాధీనం

పట్టణ సీఐ, ఎస్సైలకు రివార్డుకు ప్రతిపాదన






**కోదాడ,ఆగస్టు 3(నినాదం):** కోదాడ పట్టణ సీఐ శివశంకర్ నాయక్ నేతృత్వంలో ప్రత్యేక నిఘా టీం ఆదివారం సాయంత్రం కోదాడ పట్టణ పరిధిలోని దేగ బాబు కళ్యాణ మండపం సమీపంలో నిందితుల నుండి 6 కేజీల గంజాయి 38 పార్టీల దగ్గు మందును స్వాధీనం చేసుకుంది.... డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ కార్యాలయంలో విలేకరులకు వెల్లడించిన వివరాల ప్రకారం కోదాడ పట్టణానికి చెందిన పంది వినోద్ షేక్ మగ్దుంపాషా ఆవిడి రాఘవ లు, అనంతగిరి మండలానికి చెందిన రవితేజ షేక్ ఇర్ఫాన్‌తోపాటు ఖమ్మం పట్టణానికి చెందిన షేక్ సుభానిలను పట్టణ సీఐ నేతృత్వంలో ప్రత్యేక టీం దాడి నిర్వహించి నిందితులను పట్టుకొని వారి నుండి 6 కేజీల గంజాయి 38 దగ్గు మందు బాటిళ్లు ఒక ద్విచక్ర వాహనం రెండు మొబైల్ లను స్వాధీనం చేసుకున్నారు... ప్రధాన నిందితుడు రవితేజ ఒరిస్సా రాష్ట్రం నుండి గంజాయి కొనుగోలు చేసి కోదాడకు తెచ్చి స్థానికంగా విక్రయిస్తున్నారు, అతని ద్వారా ఇతర నిందితులు కొనుగోలు చేసుకుని విక్రయిస్తున్నారు దీంతోపాటు ఖమ్మం పట్టణంలో మెడికల్ జనరల్ స్టోర్ యజమాని సుభాని ఎటువంటి ప్రిస్క్రిప్షన్ లేకుండా దగ్గు మందు విక్రయిస్తున్నాడు.. ఈ సందర్భంగా డిఎస్పీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేక నిఘా టీమును ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.. పట్టుబడిన నిందితులు యువతకు విద్యార్థులు టార్గెట్ గా.. వారితోపాటుఆటో డ్రైవర్లకు గంజాయి సరఫరా చేసి సంఘవిద్రోహక చర్యలకు పురి కోల్పోతున్నారని పేర్కొన్నారు.. ఈ దాడిలో ముగ్గురు బాల నేరస్తులు కూడా ఉన్నారన్నారు... గంజాయి సరఫరాకు పాల్పడ్డ మరికొందరిని త్వరలో గుర్తించి అరెస్టు చేయనున్నట్టు పేర్కొన్నారు.. నిందితులను బాల నేరస్తులను న్యాయస్థానం ఎదుట హాజరు పరుస్తామని పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.. డ్రగ్ ఫ్రీ సొసైటీ లక్ష్యంగా విస్తృతస్థాయిలో మెగా తనిఖీలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు డీఎస్పీ పేర్కొన్నారు.. మాదకద్రవ్యాల వినియోగంపై ప్రజలు సమాచారాన్ని స్థానిక పోలీస్ స్టేషన్కు, పోలీస్ అధికారులకు తెలియజేయాలని డిఎస్పి సూచించారు. ఈ కేసును చేదించిన పట్టణ సీఐ శివశంకర్ నాయకులు ఎస్ఐ అజయ్ కుమార్ ఇతర పోలీసులకు రివార్డుకు ప్రతిపాదించినట్టు పేర్కొన్నారు.

## వాహనాల చోరీలకు పాల్పడిన ఇద్దరు నిందితులను పట్టుకున్న పోలీసులు

- మొత్తం 28 మోటార్ సైకిళ్ల స్వాధీనం
- విలువ రూ. 25 లక్షలు

**హన్మకొండ,ఆగస్టు3, (నినాదం):** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ద్విచక్ర వాహనాల చోరీలపై సంబంధిత పోలీస్ స్టేషన్ లలో కేసులు నమోదుకాగా బైక్ చోరీలు చైన్ స్నాచింగ్ కేసుల నేపద్యంలో సెంట్రల్ జోన్ డీసీపీ కవిత ఆధ్వర్యంలో స్పెషల్ టీం లను నియమించారు. సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో ప్రత్యేక దృష్టి సారించి నేర విచారణ చేయడం జరిగింది. గత కొద్ది కాలంగా జరిగిన నేరాలను విశ్లేషణ చేయగా, సోమవారం ఉదయం ఇద్దరు అనుమానితులను అదుపులోనికి తీసుకోని విచారణ చేయగా బైక్ చోరీలకు సంబంధించి కీలక వివరాలు వెలుగులోకి వచ్చాయి. దొంతుల ప్రశాంత్ కుమార్ (20), దుర్గం సాయి కార్తీక్ (21), వీరు సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో ద్విచక్ర వాహనాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. వాహన తనిఖీల సందర్భంగా నిందితులు ప్రయాణిస్తున్న అనుమానాస్పద పల్సర్ మోటార్ సైకిల్ ఏ పీ నంబర్ ఏ పీ 36 ఈ వై 4700 వాహనాన్ని పోలీస్ టీం స్వాధీనం చేసుకుని విచారించగా, వివిధ ప్రాంతాల్లో దాచిపెట్టిన వాహనాల గురించి సమాచారం అందించారు. వారి చూపిన మేరకు కే యూ పీ ఎస్ ముని పల్లి గ్రామ శివారు ఎలుకతుర్తి సమీపంలోని ప్రాంతాల నుండి మొత్తం 28 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాల్లో హోండా షైన్, హీరో స్ప్లెండర్ ప్లస్, హీరో గ్లామర్, హెచ్‌ఎఫ్ డీలక్స్, బజాజ్ పల్సర్, హోండా హార్నెట్ తదితర మోడళ్లకు చెందిన ద్విచక్ర వాహనాలు ఉన్నాయి. అవి వరంగల్ కమీషనరేట్ లో -8, కరీంనగర్ కమీషనరేట్ లో -9, రామగుండం కమిషనరేట్ పెద్దపల్లి లో -3, సిద్దిపేట కమీషనరేట్ లో - 2 హైదరాబాద్ కమీషనరేట్ లో-3, రాచకొండ కమీషనరేట్ లో -1, భూపాలపల్లి జిల్లాలో -2 మొత్తం 28 మోటార్ సైకిల్ల దొంగతనాలు చేశారు. వీటికి సంబంధించిన కేసులను ఆయా పోలీస్ స్టేషన్లతో అనుసంధానం చేస్తూ తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది. నిందితులపై గతంలో కూడా పలు పోలీస్ స్టేషన్లలో ఆస్తి నేరాలకు సంబంధించిన కేసులు నమోదు అయినాయి. స్వాధీనం చేసుకున్న వాహనాల అసలు యజమానులను గుర్తించి చట్టపరమైన ప్రక్రియ అనంతరం అప్పగిం చేందుకు చర్యలు చేపడుతున్నారు. ప్రజలు తమ వాహ నాలను భద్రంగా పార్కింగ్ చేసి, స్టీరింగ్,వీల్ లాక్స్ వంటి అదనపు భద్రతా చర్యలు తీసుకోవాలని, అనుమానా స్పదవ్యక్తులు లేదావాహనాలు కనిపించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100 కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పై వరుస వాహనాల చోరీలకు పాల్పడిన ఇద్దరు నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనపరిచిన సీసీ ఎస్ ఇన్స్పెక్టర్ లు ఏ. రాఘవేందర్, ఈ, హరికృష్ణ కే.రామకృష్ణ లను, కే



యూ సీ ఇన్స్పెక్టర్ రవి కుమార్ ని సీసీఎస్ ఎస్ ఐ ఎస్ ఐ శ్రీనివాసరాజు, హెడ్ కానిస్టేబుల్లు నసీమ్ అహ్మద్, రవిప్రసాద్, జంపయ్య, కానిస్టేబుల్లు విశ్వేశ్వర్, వంశీ, వినోద్ లను, ఐటీ కోర్ టీం ఏ ఓ ఎం డీ, సల్మాన్ పాషా కానిస్టేబుల్ నగేష్, క్రైమ్ కానిస్టేబుళ్లను సీ పీ శ్వేతా ఐ పీ ఎస్ మన స్ఫూర్తిగా అభినందించారు. ఈ సమావేశంలో హన్మకొండ, సీసీఎస్ ఏసీపీలు నర్సింహారావు, సదయ్య పాల్గొన్నారు.

# తల్లిపాల వారోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలి

## అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రతి కుటుంబానికి తల్లిపాల ప్రాధాన్యతను చేరవేయాలి: జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

**నాగర్ కర్నూల్ ఆగస్టు 3 (నినాదం)**

పోషక అభియాన్‌లో భాగంగా జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను అత్యంత ప్రణాళికాబద్ధంగా, సమర్థవంతంగా నిర్వహించాలని, తల్లిపాలతో శిశువు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. తల్లిపాల ప్రాధాన్యత, శిశు పోషణ, తల్లి ఆరోగ్యం, సమతుల్య ఆహారంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు వైద్య ఆరోగ్య, సంక్షేమ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా రూపొందించిన ప్రత్యేక అవగాహన గోడపత్రికను (పోస్టర్‌ను) జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. చెన్నయ్య, దేవ సహాయం, జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో), జిల్లా ఇన్‌చార్జి సంక్షేమ శాఖ అధికారి పాండు, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్ మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...., తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన వరమని, పుట్టిన వెంటనే శిశువుకు తల్లిపాలు అందించడం ద్వారా శిశువు ఆరోగ్యవంతంగా ఎదగడంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. పుట్టిన తొలి గంటలోనే తల్లిపాలు పట్టించడం అత్యంత ముఖ్యమని, అలాగే తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం వల్ల శిశువుకు అవసరమైన అన్ని పోషకాలు సహజంగానే అందుతాయని తెలిపారు. తల్లిపాలు శిశువు శారీరక, మానసిక ఎదుగుదలకు ఎంతగానో దోహదపడతాయని, తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లి ఆరోగ్యానికి కూడా అనేక ప్రయోజనాలు ఉన్నాయని, అందువల్ల ప్రతి గర్భిణి, బాలింతకు తల్లిపాల ప్రాముఖ్యతపై సమగ్ర అవగాహన కల్పించడం మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తల ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు. జిల్లాలో నిర్వహించే తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గ్రామాలు, మండలాలు, పట్టణ ప్రాంతాల్లోని అంగన్వాడీల్లో ప్రత్యేక అవగాహన సమావేశాలు నిర్వహించి, ఇంటింటి ప్రచార కార్యక్రమాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక చర్చలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. తల్లిపాలపై ప్రజల్లో ఉన్న అపోహలను శాస్త్రీయ ఆధారాలతో తొలగించి, ప్రతి తల్లి తన బిడ్డకు తల్లిపాలే ఉత్తమ ఆహారమనే సందేశాన్ని చేరవేయాలని ఆదేశించారు. పోషకాహార లోపాన్ని తగ్గించడం, శిశు మరణాలను నివారించడం, చిన్నారుల్లో రోగనిరోధక శక్తిని పెంపొందించడం వంటి లక్ష్యాల సాధనలో తల్లిపాలు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రభుత్వం అమలు చేస్తున్న పోషక అభియాన్ కార్యక్రమం లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రతి కార్యక్రమం ఫలవంతంగా జరిగేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.




## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని అలంపూరులోనే కొనసాగించాలి

### కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన అలంపూర్ అభివృద్ధి కమిటీ సభ్యులు

**గద్వాల ప్రతినిధి ఆగస్టు 3 (నినాదం)**



జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ పట్టణంలో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని వేరే ప్రాంతానికి తరలించకుండా, యథావిధిగా అలంపూర్‌లోనే కొనసాగించాలని అలంపూర్ అభివృద్ధి కమిటీ నాయకులు, సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అభివృద్ధి కమిటీ సభ్యులు మాట్లాడుతూ, అలంపూర్ మండల పరిధిలోని ప్రజలు, రైతులు, వ్యాపారులు, వివిధ గ్రామాల ప్రజలకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎంతో కాలంగా అందుబాటులో ఉండి సేవలు అందిస్తోందని తెలిపారు. భూముల కొనుగోలు, విక్రయాలు, రిజిస్ట్రేషన్లు, వ్యవసాయ భూముల లావాదేవీలు, ఇతర ఆస్తుల నమోదు వంటి అనేక ముఖ్యమైన పనుల కోసం ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ కార్యాలయాన్ని ఆశ్రయిస్తున్నారని పేర్కొన్నారు. అలంపూర్ చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన ప్రాంతమే కాకుండా, మండల కేంద్రంగా కూడా ప్రజలకు వివిధ ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇలాంటి కీలకమైన ప్రాంతం నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని వేరే ప్రాంతానికి తరలిస్తే మండల పరిధిలోని ప్రజలు అదనపు దూరం ప్రయాణించాల్సి వస్తుందని, సమయం, రవాణా ఖర్చులు పెరగడంతో పాటు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రైతులు, వృద్ధులు, మహిళలు, నిరుపేద కుటుంబాలు రిజిస్ట్రేషన్ పనుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లడం వల్ల ఆర్థికంగా, శారీరకంగా ఇబ్బందులు పడే అవకాశం ఉందని తెలిపారు. ప్రజా సౌకర్యం, అలంపూర్ ప్రాంత ప్రాధాన్యత, మండల పరిధిలోని గ్రామాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని అలంపూర్ పట్టణంలోనే కొనసాగించేలా జిల్లా యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. అలంపూర్ ప్రాంత ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైతే ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి మరింతగా వినతులు అందజేస్తామని, కార్యాలయాన్ని తరలించే నిర్ణయాన్ని పునరాలోచించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అలంపూర్ అభివృద్ధి కమిటీ సభ్యులు, ముఖ్య నాయకులు, యువకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి అంతానికి ఆయుధం స.హ.చట్టం

### నేషనల్ ఆర్.టి.ఐ ఆక్టివిస్ట్ ఫోరం చైర్మన్ బాబుల్ రెడ్డి

**నాగర్ కర్నూల్ ఆగస్టు 3 (నినాదం)**



అవినీతి అంతానికి పదునైన ఆయుధం స.హ.చట్టమని దానిని మరింత బలోపేతం చేయాలని ఉద్యమకారులు నడుం బిగించి ఐక్యతగా పోరాడాలని స్థానిక ఒక ఫంక్షన్ హాల్లో ఏర్పాటుచేసిన సమావేశంలో నేషనల్ ఆర్.టి.ఐ ఆక్టివిస్ట్ ఫోరం చైర్మన్ బాబుల్ రెడ్డి అన్నారు. ప్రస్తుత ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా స.హ చట్ట పరిరక్షణకై నడుస్తున్న సమాచార హక్కు చట్ట పరిరక్షణ వేదికను జాతీయంగా విస్తృతపరచ్చు న్యాయని త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ఏర్పాటు చేసి సహ ఉద్యమకారుల సభ్యత్వాలను మెరుగుపరుస్తూ జిల్లాల వారీగా కమిటీ మెంబర్లను ఏర్పాటు చేస్తూ ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సెక్షన్ 4(1b)ఖచ్చితంగా అమలు అయ్యే విధంగా ప్రభుత్వపరంగా ప్రతి జిల్లాకు ఇద్దరు కమిటీ మెంబర్లను ఏర్పాటు చేసే విధంగా పోరాటం కొనసాగిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.టి.ఐ ఉద్యమకారులు నరసింహులు, వాడాల రాజశేఖర్ శర్మ, ఉట్కూరు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## కాసు సీతమ్మ మరణం విషాదకరం

### మృతదేహానికి నివాళులు అర్పించిన డోకూరి ప్రభాకర్ రెడ్డి



**కల్వకుర్తి ఆగస్టు 3 (నినాదం)**

తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగ రావు పల్లె గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి తల్లి కాసు సీతమ్మ రెండు రోజుల క్రితం మరణించడం జరిగింది విషయం తెలుసుకున్న తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి మృతురాలి స్వగృహానికి చేరుకొని పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కాసు శ్రీనివాస్ రెడ్డిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## వర్షాలకు దెబ్బతిన్న రోడ్లలో మట్టి గుంతలకు మరమ్మతులు

### సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి




**కల్వకుర్తి ఆగస్టు 3 (నినాదం)**

తలకొండపల్లి మండలంలోని పడకల్ గ్రామ ప్రజలకు సురక్షితమైన రాకపోకలు కల్పించాలనే ఉద్దేశంతో బీటీ రోడ్డుపై ఏర్పడిన మట్టి గుంతలను సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మరమ్మతులు చేయించారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా రోడ్డుపై గుంతలు ఏర్పడి వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వెంటనే స్పందించిన సర్పంచ్, డోకూరి ప్రభాకర్ రెడ్డి మట్టి పోయించి గుంతలను పూడ్చించి రహదారిని ప్రయాణానికి అనుకూలంగా మార్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రహదారులు, మౌలిక సదుపాయాల నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. గ్రామాభివృద్ధికి అవసరమైన ప్రతి పనిని దశలవారీగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. స్థానికులు సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి చొరవను అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

## నిరుద్యోగుల పక్షాన బీజేపీ ఆందోళన

**కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం.. ఆసుపత్రిలో నిరుద్యోగి వేణును పరామర్శించిన బీజేపీ నేతలు..**

**జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్**




**ఖమ్మం ప్రతినిధి,ఆగస్టు 3 (నినాదం )**

రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సోమవారం ఖమ్మంలో నిరసన కార్యక్రమాలు చేపట్టింది. ఆత్మహత్యాయత్నం చేసి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నిరుద్యోగ యువకుడు గడ్డం వేణును బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. గౌతమ్ రావు, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుందే, జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు తదితరులు పరామర్శించారు. అనంతరం ఖమ్మం జెడ్పీ సెంటర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన నిర్వహించి ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆసుపత్రిలో బాధితుడిని పరామర్శించిన సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, యువత ఆత్మహత్యలకు పాల్పడడం బాధాకరమని, ప్రాణాలు తీసుకోవడం ఏ సమస్యకూ పరిష్కారం కాదని అన్నారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ అండగా నిలుస్తుందని బాధితుడికి భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. గౌతమ్ రావు, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి, ప్రతి ఏడాది రెండు లక్షల ఉద్యోగాల హామీ, జాబ్ క్యాలెండర్ వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల కోసం శాంతియుతంగా పోరాడుతున్న యువతపై కేసులు నమోదు చేయడం, లాఠీచార్జీలు చేయించడం సరికాదన్నారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుందే మాట్లాడుతూ, ఎన్నికల ముందు కాంగ్రెస్ అగ్రనేతలు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టకుండా ఇతర అంశాలపైనే దృష్టి సారిస్తోందని ఆరోపించారు. ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రులు కూడా ఈ ఘటనపై స్పందించకపోవడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. అనంతరం బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా జెడ్పీ సెంటర్‌కు చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ నియామకాలను వెంటనే పూర్తి చేయాలని, మెగా డీఎస్సీతో పాటు ఇతర నియామకాల జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అధికార ప్రతినిధి వాగదాన్ని ఫులారావు యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల నాగేందర్, యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి వైష్ణవ్, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు శాసనాల సాయిరాం, జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తా వెంకటేశ్వరరావు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మందా సరస్వతి, ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయిలో బిజ్వారం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుదాం

### గ్రామాభివృద్ధికి గ్రామసభలో పలు అంశాలపై తీర్మానాలు




**గద్వాల ప్రతినిధి ఆగస్టు 3 (నినాదం)**

జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం బిజ్వారం గ్రామంలో సోమవారం గ్రామపంచాయతీ కార్యదర్శి బసిరెడ్డి అధ్యక్షతన గ్రామసభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గ్రామ సర్పంచ్ వై. శైలజ శ్రీనివాస్ రెడ్డి హాజరై గ్రామాభివృద్ధి, పరిశుభ్రత, ప్రజా సమస్యల పరిష్కారంపై పలు అంశాలను వివరించారు.ఈ సందర్భంగా సర్పంచ్ శైలజ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ బిజ్వారం గ్రామాన్ని రాష్ట్రస్థాయిలో ఆదర్శ స్వచ్ఛ భారత్ గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామ ప్రజలందరూ సహకరించాలని కోరారు. ముఖ్యంగా గ్రామ ప్రధాన కూడలితో పాటు అన్ని వీధుల్లో చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రతను పాటించాలని సూచించారు. డ్రైనేజీ కాలువల్లో చెత్తాచెదారం వేయడం వల్ల దుర్వాసనతో పాటు విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి ఇంటి ముందు మురుగునీరు నిల్వ ఉండకుండా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని గ్రామ ప్రజలకు సూచించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి మిషన్ భగీరథ తాగునీరు పూర్తిస్థాయిలో అందేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. గ్రామ ప్రజలకు ఎలాంటి సమస్య ఎదురైనా ఎల్లవేళలా అందుబాటులో ఉండి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.గ్రామ అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామసభలో గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చాపకండ్ల కర్రెన్న, పంచాయతీ కార్యదర్శి బసిరెడ్డి, జీపీఓ, వార్డు సభ్యులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వ్యవసాయ శాఖ ఏఈఓ, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కామారెడ్డిలో విషాదం.. ఉరేసుకుని బాలుడి ఆత్మహత్య

**కామారెడ్డి రూరల్,ఆగస్టు 3 (నినాదం):**



కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇంట్లో ఎవరూ లేని సమయంలో పదహారేళ్ల బాలుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.ఈ ఘటన కామారెడ్డి పట్టణంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఉస్మాన్పురాకు చెందిన.. కుటుంబ సభ్యులు,పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఉస్మాన్ పురాకు చెందిన మహమ్మద్ ఇర్ఫాన్ సిద్ధికి,తన భార్య ఇర్ఫానకు కాలు విరగడంతో శనివారం మధ్యాహ్నం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు.ఈ క్రమంలో ఇంటి వద్ద చిన్న కుమారుడు అబ్దుల్ సమద్ ఒంటరిగా ఉన్నాడు.రాత్రి 8.40 గంటలకు పెద్ద కుమారుడు అబ్దుల్ సలాం ఇంటికి వెళ్లి చూడగా తలుపులు మూసి ఉన్నాయి.తలుపులు తెరిచి లోపలికి వెళ్లి చూడగా బెడ్ రూమ్లో అబ్దుల్ సమద్ ఉరి వేసుకుని ఉన్నాడు.వెంటనే తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు ఇంటికి చేరుకుని కుమారుడిని ఉరి నుండి దించి కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో తరలించారు. అక్కడ విధుల్లో ఉన్న వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బలిజపేట అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన

**గద్వాల ప్రతినిధి ఆగస్టు 3 (నినాదం)**



జోగులంబ గద్వాల జిల్లా అయిజ సెక్టార్, అయిజ మున్సిపాలిటీ కేంద్రం బలిజపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో ఏఎన్ఎం ప్రమీలతో కలిసి తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ ఈశ్వరమ్మ, ఏఎన్ఎం ప్రమీల లు మాట్లాడుతూ, తల్లిపాలు శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు ఎంతో అవసరమని తెలిపారు. పుట్టినప్పటి నుంచి మొదటి ఆరు నెలల వరకు శిశువులకు కేవలం తల్లిపాలు మాత్రమే అందించాలని సూచించారు. తల్లిపాలలో శిశువుకు అవసరమైన పోషకాలు ఉండటంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు.ఈ కార్యక్రమంలో ఆశలు ఉష, అరుణ, గర్భిణీలు, బాలింతలు, తల్లులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు .

## మక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల బాధితులకు న్యాయం చేయాలి

### ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించిన నిర్వాసితుల సంఘం నాయకులు

**నారాయణపేట ప్రతినిధి, ఆగస్టు 3, (నినాదం):**



మక్తల్–నారాయణపేట–కోడంగల్ ఎత్తిపోతల పథకం కింద భూములు, ఆస్తులు కోల్పోయిన రైతులకు తక్షణమే పరిహారం అందించి న్యాయం చేయాలని నిర్వాసితుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నాడు నారాయణపేట ఆర్డీవో కు సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతులు అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టులో భాగంగా చెట్లు, బావులు, బోర్ బావులు, పైప్‌లైన్లు ఇతర నిర్మాణాలను కోల్పోయిన రైతులకు ప్రభుత్వం నుంచి పరిహారం అందకపోవడం శోచనీయమన్నారు. అలాగే మక్తల్ మండలంలోని కాచవార్, ఊట్కూరు మండలంలోని ఎడపల్లి, బాపూర్, దామరగిద్ద మండలంలోని లింగారెడ్డిపల్లి రైతుల భూములపై కాంట్రాక్టర్లు అదనంగా ఐదు నుంచి పది మీటర్ల మేర మట్టి, రాళ్లను వేస్తూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాంట్రాక్టర్ల నిర్వాకం వల్ల పంట భూములు తీవ్రంగా దెబ్బతిని రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ఊట్కూరు, పేరపళ్ళ రిజర్వాయర్ల కోసం భూములు కోల్పోయిన వారికి కూడా నష్టపరిహారం చెల్లించలేదని పేర్కొన్నారు. భూములు కోల్పోయినందున వేరే చోట వ్యవసాయ భూములు కొనుగోలు చేయడానికి అధికారులు ముందస్తు అనుమతులు (అడ్వాన్సులు) ఇచ్చి, ప్రభుత్వం నుంచి రావాల్సిన సొమ్మును మాత్రం విడుదల చేయకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని తెలిపారు.

**ప్రధాన డిమాండ్లు పరిహారం చెల్లింపు**

ఊట్కూరు, పేరపళ్ళ రిజర్వాయర్ల కోసం భూములు ఇచ్చిన రైతులకు వెంటనే పరిహారం అందించాలి. బోర్ బావులు, పైప్‌లైన్లు, చెట్లు ఇతర నిర్మాణాలు కోల్పోయిన వారికి తక్షణమే నష్టపరిహారం చెల్లించాలి. ప్రభుత్వం సేకరించిన భూమి కంటే అదనంగా ఆక్రమించుకుంటున్న కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి. బాధ్యతారహితంగా వ్యవహరిస్తూ రైతులను నిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఇట్టి కార్యక్రమంలోమక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల నిర్వాసితుల సంఘం గౌరవ అధ్యక్షులు జి. వెంకటామిరెడ్డి, ఉపాధ్యక్షులు ధర్మరాజు గౌడ్, ముఖ్య సలహాదారు ఎం. గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన అభివృద్ధి పనులను కూల్చివేస్తారా

### నేను చేసిన అభివృద్ధి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచింది: మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

**ఖమ్మం, ఆగస్టు 02(నినాదం ):**





ఖమ్మం నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యేగా, అనంతరం మంత్రిగా పనిచేసిన కాలంలో చేపట్టిన అభివృద్ధి పనులు, నిర్మించిన ప్రజా ఉపయోగకర నిర్మాణాలను కూల్చివేయాలనే ప్రయత్నం జరుగుతోందా అని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఉద్దేశించి మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ప్రశ్నించారు. ఆదివారం రఘునాథపాలెం మండలం పాపటపల్లి గ్రామంలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఖమ్మం అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాల ఆనవాళ్లను చెరిపివేయాలనే ప్రయత్నం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేస్తున్నారని పువ్వాడ ఆరోపించారు. అయితే ప్రజల గుండెల్లో నిలిచిపోయిన అభివృద్ధి చరిత్రను ఎవరూ చెరిపివేయలేరని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఖమ్మం నగర అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ మున్నేరు చెక్‌డ్యాం, సమీకృత జిల్లా కలెక్టరేట్, పోలీస్ కమిషనరేట్ కార్యాలయం, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం, ఐటీ హబ్, గోళ్లపాడు ఛానల్, ఆధునిక బస్‌స్టాండ్‌తో పాటు అనేక మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసిందని గుర్తు చేశారు. ఇటువంటి అభివృద్ధి కట్టడాలను కూడా కూల్చివేసారా? అని పువ్వాడ ప్రశ్నించారు. అమలు చేయలేని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తీవ్రంగా నిరాశపరిచిందని విమర్శించారు. రైతు రుణమాఫీ పూర్తిగా అమలు చేశామని చెబుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, ఖమ్మం నియోజకవర్గంలోని ఏ గ్రామంలో వంద శాతం రుణమాఫీ జరిగిందో ప్రజలకు వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, యువత, మహిళలు, ఉద్యోగులు, కార్మికులు సహా అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో విఫలమైందని ఆరోపించారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం తెలంగాణలో ప్రజావ్యతిరేక పాలన సాగిస్తోందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి దేశంలో ఆదర్శ రాష్ట్రంగా నిలిచిందని, ఆ పాలన విలువ ఇప్పుడు ప్రజలకు మరింత స్పష్టంగా అర్థమవుతోందని అన్నారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలపై బలంగా పోరాడుతున్న బీఆర్ఎస్‌కు ప్రజల ఆదరణ రోజురోజుకూ పెరుగుతోందని పేర్కొన్నారు. ఖమ్మం నియోజకవర్గంలో పరిపాలన అస్తవ్యస్తంగా మారిందని, పారిశుద్ధ్య నిర్వహణ పూర్తిగా దెబ్బతిని అనేక ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. చెత్త సకాలంలో తొలగించకపోవడంతో దుర్వాసనలు వెదజల్లుతున్నాయని విమర్శించారు. రైతులు విద్యుత్ కోతలతో ఇబ్బందులు పడుతుండగా, ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీస సౌకర్యాలు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వైద్య సేవలను మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు.ఖమ్మం నగరంలో తుమ్మల పాలనలో అవినీతి, అక్రమాలపై వార్తలు వెలువడుతున్నాయని పేర్కొంటూ, ప్రభుత్వం వాటిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రోడ్లపై ఏర్పడిన గుంతలను కూడా పూడ్చలేని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని విమర్శించారు.ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించిన ప్రతిపక్ష నాయకులపై వ్యక్తిగత దూషణలకు దిగడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ప్రజా సమస్యలకు సమాధానం చెప్పాల్సింది పోయి వ్యక్తిగత విమర్శలకు పాల్పడటం అధికార పార్టీ అసహనానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో అధికారం శాశ్వతం కాదని, ప్రజలే అంతిమ నిర్ణేతలని, తగిన సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పిన్ని కోటేశ్వర రావు, సైదులు, మండల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు

# డేటా ఆధారిత పాలనకు ప్రాధాన్యం

## డేటా ఆధారిత నిర్ణయాలపై సమీక్ష .... అధికారులకు దిశానిర్దేశం చేసిన సిఎం చంద్రబాబు

**అమరావతి,ఆగస్టు 3 (నినాదం):**
అన్ని శాఖల్లో డేటా ఆధారిత పాలనకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆర్‌టీజీఎస్‌లో డేటా ఆధారిత నిర్ణయాలపై సీఎం చంద్రబాబు సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. డేటా డ్రివెన్ మేకింగ్ డెసిషన్స్‌పై అధికారులకు సీఎం మార్గనిర్దేశర చేశారు. సీఎం సమీక్షకు ఏపీ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్, ఐటీ, ఆర్‌టీజీఎస్, వ్యవసాయం, మున్సిపల్, సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. రియల్ టైమ్ గవర్నెన్స్ వ్యవస పనితీరుపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఆర్‌టీజీ ద్వారా పాలన మరింత సమర్థవంతంగా, సులభంగా ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ నిర్ణయాలతో డేటా వినియోగాన్ని పెంచాలని ఆదేశించారు. ఆయా శాఖల



వారీగా డేటా సమన్వయంపై అధికారులతో సీఎం చంద్రబాబు చర్చించారు. ఇకపోతే కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి సకాలంలో పన్నుల వాటా కేటాయిస్తుం

దని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. కేంద్ర సహకారంతో ఏపీలో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగు

తున్నాయని పేర్కొన్నారు. అదనపు పన్నుల వాటా కేటాయింపుపై ప్రధానమంత్రి నరేంద్రమోదీకి, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. సాధారణంగా ప్రతి నెలా 10వ తేదీన విడుదలయ్యే పన్నుల వాటాతో పాటు అదనంగా రూ.4,597 కోట్ల పన్నుల వాటా కేటాయించారని వెల్లడించారు. రాష్ట్ర పన్నుల వాటాను కేంద్రప్రభుత్వం సకాలంలో కేటాయించడంతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలకు మరింత బలం చేకూరుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. అదనపు పన్నుల వాటా విడుదలతో ఏపీలో అభివృద్ధి కార్యక్రమాల అమలు మరింత వేగవంతం అవుతున్నాయని ఉద్ఘాటించారు. కేంద్రప్రభుత్వం ఏపీ అభివృద్ధికి నిరంతరం అందిస్తున్న సహకారం రాష్ట్ర పురోగతికి ఎంతగానో దోహదపడుతోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

శ్రీరామ్ అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ (SARPL)
SHRIRAM Asset Reconstruction
www.shriramarc.com, ఫోన్ నెం. 1800 120 2389, customercare@shriramarc.com
స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి/ల కొరకు) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 8 (1) క్రింద

| క్ర. సం. | | | డిమాండ్ నోటీసు తేది & మొత్తం | సెక్యూర్డ్ ఆస్తి వివరణ (స్థిరాస్తి) |
|---|---|---|---|---|
| 1 | NHL00300025233 SARCT Trust 13 | బత్తల శ్రీనువాసులు, బత్తల వెంకటేశ్వరమ్మ & మల్లెల వెంకట రమణ | 21-08-2025 & రూ. 523327/- | అన్నమయ్య జిల్లా-516504 ... |

తేది: 04-08-2026

# క్రెడిట్ లేని వ్యక్తి వైఎస్ జగన్

## ఆయన క్రెడిట్ అంతా కత్తులూ..కటార్లే

### విమర్శలు గుప్పించిన మంత్రి సంధ్యారాణి

**అమరావతి,ఆగస్టు 3 (నినాదం):**
వైకాపాలోని కొందరు నేతలు ప్రజలకు నీతులు చెబుతున్నారని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఎద్దేవా చేశారు. నేరాలు చేసిన నేతలు ఎక్కడున్నా తీసుకొచ్చి శిక్షిస్తామన్నారు. తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. భోగాపురం విమానాశ్రయంపై వైకాపా నేతల వ్యాఖ్యలు సరికాదన్నారు. మేం చేసిన పనులను జగన్ క్రెడిట్ చోరీ చేస్తున్నారు. ఆయనకు క్రెడిటే లేదు.. చోరీ ఎక్కడిది. క్రెడిట్ అనే పదం జగన్‌కు వర్తించదు. ఆయన క్రెడిట్ అంటే.. నాలుగు కత్తులు, నాలుగు గొడ్డళ్లు. హత్యలు చేసినవాళ్లని వెనకేసుకుని రావడం, బూతులు మాట్లాడిన వాళ్లకు మంత్రి పదవులు ఇవ్వడమే ఆయనకు తెలుసు. శస్త్రచికిత్స చేయించుకున్న సొంత చెల్లినే పరామర్శించలేదు. నేరాలు చేసి జైళ్లలో ఉన్నవారిని మాత్రం జగన్ పరామర్శిస్తున్నారని సంధ్యారాణి విమర్శించారు. ఇదిలావుంటే జగన్ మోహన్‌రెడ్డితో పాటు ఆ పార్టీ నాయకులంతా భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కి సంబంధించి క్రెడిట్ చోరీ చేస్తున్నారని ఎమ్మెల్యే



గంటా శ్రీనివాసరావు విమర్శించారు. విశాఖపట్నంలో, ఆంధ్రప్రదేశ్‌లో ఏదైనా మంచి ఇన్వెస్ట్‌మెంట్, పేరువచ్చే కార్యక్రమం జరిగితే.. వెంటనే వైకాపా పార్టీ ట్వీట్ చేయడం, జగన్‌వె ాహన రెడ్డి మాట్లాడటమో గానీ చేస్తారని అన్నారు. అది కూడా మాదే. మేము తెచ్చిందే, మా ఖాతాలోకే అనే కొత్త సంప్రదాయాన్ని తీసుకొస్తున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఘనత చంద్రబాబుదే అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా భోగాపురం నిర్మాణం పూర్తి వివరాలు వెల్లడించారు.

# ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టు

## బులిటెన్ విడుదల చేసిన శాసనసభ కార్యదర్శి

**కర్నూలు,ఆగస్టు 3 (నినాదం):**
కర్నూలు జిల్లా ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి అరెస్టు వ్యవహారంపై ఏపీ శాసనసభ కార్యదర్శి జనరల్ కార్యాలయం బులిటెన్ విడుదల చేసింది. శాసనసభ సభ్యులందరికీ సమాచారం అందిస్తూ జారీ చేసిన ఈ బులిటెన్‌లో ఎమ్మెల్యే అరెస్టుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. బులిటెన్ ప్రకారం.. ఆగస్టు 2వ తేదీ తెల్లవారుజామున 3 గంటలకు కర్నూలు జిల్లా చిప్పగిరిలోని ఎమ్మెల్యే నివాసంలో విరూపాక్షిని పోలీసులు అరెస్టు చేశారు. ఎమ్మెల్యేను ఆలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అరెస్టు చేసినట్లు బులెటిన్‌లో వెల్లడించారు. చిప్పగిరి పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నంబర్ 37/2026 కేసులో అరెస్టు అయినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. అలాగే చిప్పగిరి పోలీస్ స్టేషన్‌లోనే నమోదైన మరో క్రైమ్ నంబర్ 38/2026 కేసులోనూ ఎమ్మెల్యే ఏ 1గా ఉన్నట్లు అసెంబ్లీ బులెటిన్‌లో పేర్కొన్నారు. ఈ కేసులో బీఎన్ఎస్ సెక్షన్లతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కూడా కేసులు నమోదు చేసినట్లు ఎమ్మెల్యేలకు సమాచారం ఇచ్చారు. శాసనసభ్యుడి అరెస్టు జరిగిన నేపథ్యంలో సభా నిబంధనల ప్రకారం




సభ్యులందరికీ వివరాలు తెలియజేస్తూ అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ఈ బులెటిన్ జారీ చేశారు. శనివారం నాడు చిప్పగిరి మండలం నేమకల్లు, సంగాల గ్రామాలకు చెందిన టీడీపీ కార్యకర్తలపై వందలాది మంది అనుచరులతో ఎమ్మెల్యే విరూపాక్షి దాడి చేశారు. పలువురు టీడీపీ కార్యకర్తల ఇళ్లపైకి వెళ్లి ఆడ, మగ అనే తేడా లేకుండా తీవ్రంగా గాయపరిచారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే విరూపాక్షి సహా 34 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వీరిలో 16 మందిని అరెస్టు చేయగా.. ఆలూరు కోర్టు రిమాండ్ విధించింది.

## ఎపిలో పలు జిల్లాలకు

# భారీ వర్ష హెచ్చరిక

**అమరావతి,ఆగస్టు 3 (నినాదం):**
ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో పిడుగుపాటుతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే విజయనగరం, విశాఖపట్నం, అల్లూరిసీతారామరాజు, అనకాపల్లి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఆరెంజ్ అలర్ట్ జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వానలు పడతాయని వెల్లడించారు. అరకు, చింతపల్లె, నర్సీపట్నంలో పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపారు. యలమంచిలి, అనకాపల్లి, విశాఖపట్నం పరిసరాల్లో పిడుగులు పడే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. శ్రీకాకుళం, మన్యం, కాకినాడకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. అలాగే, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలకు ఎల్లో అలర్ట్ హెచ్చరికలు చేశారు. ఏలూరు, చిత్తూరు, కర్నూలు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు పడే సూచనలు ఉన్నాయని వెల్లడించారు. ఎల్లో అలర్ట్ జిల్లాల్లో చెదురుమదురుగా పిడుగులతో కూడిన వానలు కురుస్తాయని తెలిపారు. ఉరుములు, పిడుగులు పడే సమయంలో ప్రజలు చెట్ల కింద



నిలబడవద్దని సూచించారు. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు విజ్ఞప్తి చేశారు.

# ఎపి రైతులకు ప్రభుత్వం శుభవార్త

## ఖరీఫ్ పంటల బీమా గడువు పొడిగింపు

**అమరావతి,ఆగస్టు 3 (నినాదం):**
రైతులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఖరీఫ్ పంటల బీమా గడువును పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. ఖరీఫ్ పంటలకు బీమా నమోదు గడువును మరో 15 రోజులు పొడిగించినట్లు స్పష్టం చేసింది. జులై 31వ తేదీతో ముగియాల్సిన గడువుకు మరో 15 రోజులపాటు అవకాశం కల్పించినట్లు వెల్లడించింది. ప్రకృతి వైపరీత్యాలు, వరదలు, వర్షాభావం వల్ల పంట నష్టాలకు బీమా రక్షణ కల్పిస్తున్నట్లు ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది. రూ.1 ప్రీమియంతో అన్నదాతలకు పంటల బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు ఏపీ సర్కార్ వివరించింది. ఇప్పటికి కూడా నమోదు చేసుకోని రైతులు వెంటనే బీమా



నమోదు చేసుకోవాలని సూచించింది. సాగు చేసిన ప్రతి ఎకరానికి బీమా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేసింది. బ్యాంకులు, సీఎస్సీ కేంద్రాలు, రైతు సేవా కేంద్రాలు, జెఐఎఖ మొబైల్ యాప్‌ల ద్వారా నమోదు చేసుకోవచ్చని ఏపీ ప్రభుత్వం పేర్కొంది.

# టీటీడీ ఆసుపత్రుల్లో మందుల కొనుగోళ్లలో భారీ అవినీతి

**లోకేశ్‌పై భూమన కరుణాకర్ రెడ్డి తీవ్ర ఆరోపణలు**

**ఏపీలో అవినీతి తీవ్ర స్థాయికి చేరిందన్న హుూమన**

**టీటీడీని కూడా వదలకుండా పీడిస్తున్నారని ఆరోపణ**

**ఎల్1 టెండర్ల పేరుతో అక్రమాలకు తెరలేపారన్న భూమన**

**తిరుపతి ఆగస్టు 3 (నినాదం):**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అవినీతి తీవ్ర స్థాయికి చేరుకుందని వైసీపీ నేత, టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి మండిపడ్డారు. ఈ అవినీతిలో మంత్రి నారా లోకేశ్ పాత్ర స్పష్టంగా ఉందని ఆరోపించారు. తిరుపతిలోని ప్రసిద్ధ స్విమ్స్, బర్డ్స్ ఆసుపత్రుల్లో ప్రాణరక్షక మందులు, వైద్య పరికరాల కొనుగోళ్లలో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని విమర్శించారు. పవిత్రమైన ధార్మిక సంస్థ అయిన టీటీడీని కూడా వదిలిపెట్టకుండా ఇష్టమొచ్చినట్లు పట్టి పీడిస్తున్నారని ధ్వజమెత్తారు. శస్త్ర చికిత్సలకు అవసరమైన పరికరాల నుంచి పెద్ద పెద్ద యంత్రాల టెండర్ల వరకు తీవ్రస్థాయిలో గోల్‌మాల్ జరుగుతోందని విమర్శించారు. ఎల్ 1 టెండర్ల పేరుతో అక్రమాలకు తెరలేపారని, కంపెనీలతో ముందే లోపాయికారీ ఒప్పందాలు కుదుర్చుకుని, తక్కువ ధరకు లభించే పరికరాలను టీటీడీకి ఎక్కువ ధరకు



అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. మంత్రి నారా లోకేశ్ అమలు చేస్తున్న 'రెడ్ బుక్' రాజ్యాంగం వల్లే రాష్ట్రంలో హింస, అవినీతి కరాళ నృత్యం చేస్తున్నాయని భూమన విమర్శించారు. ప్రాణరక్షక మందుల కొనుగోళ్ల వెనుక ఉన్న ఈ దిగజారుడు కుట్రపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

# రాయలసీమ వనరులు తీవ్రంగా దోపిడీకి గురయ్యాయి: పీవీఎన్ మాధవ్

**రైజింగ్ రాయలసీమ కార్యక్రమంలో పాల్గొన్న మాధవ్**

**కర్నూలు,ఆగస్టు 3 (నినాదం):**
కర్నూలు రాయలసీమ విశ్వవిద్యాలయంలో సమర్థ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'రైజింగ్ రాయలసీమ' కార్యక్రమంలో బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సీమ ప్రాంత స్థితిగతులు, ఎదుర్కొంటున్న సవాళ్లు మరియు భవిష్యత్ కార్యాచరణపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి రాయలసీమ ప్రాంతం తీవ్ర వెనుకబాటుతనానికి గురైందని, ఇక్కడి ప్రాకృతిక, మానవ వనరులు దోపిడీకి గురయ్యాయని అన్నారు. ఈ ప్రాంతం నుంచి ఎందరో ముఖ్యమంత్రులు ప్రాతినిధ్యం వహించినప్పటికీ.. రాయలసీమ అభివృద్ధిలో ఎందుకు వెనుకబడిపోయిందో అర్థం కాని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వెనుకబాటుతనాన్ని అధిగమించేందుకు నాయకులు, మేధావులు ఒకే తాటిపైకి



వచ్చి సీమ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రచించాలని పిలుపునిచ్చారు. సీమ పురోగతి కోసం ఆయన 'ప్రజలు, పాడిపంటలు, పరిశ్రమలు, పర్యాటకం, పర్యావరణం' విధానాన్ని సూచించారు. వచ్చే 20 ఏళ్లలో రాయలసీమను ఏ విధంగా అభివృద్ధి చేయాలనే దానిపై సమగ్ర డాక్యుమెంటరీని రూపొందించడమే కాకుండా, దాన్ని ఆచరణలో సాధించి తీరాలని అన్నారు.

# కడప ఎయిర్‌పోర్ట్ లంచం కేసు: మాజీ అధికారికి మూడేళ్ల కఠిన కారాగారం

**కడప ఆగస్టు 3 (నినాదం):**
కడప ఎయిర్‌పోర్ట్‌లో తొమ్మిదేళ్ల క్రితం నమోదైన లంచం కేసులో కర్నూలులోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం సోమవారం కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న ఎయిర్‌పోర్ట్ మాజీ అధికారికి మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 50,000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది. వివరాల్లోకి వెళితే, కడప ఎయిర్‌పోర్ట్‌లో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (ఎయిర్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్)గా, తాత్కాలిక ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్‌గా పనిచేసిన ముకుందగిరి రంగాచారి శ్రీనివాసన్, ఓ కాంట్రాక్టర్‌ను లంచం డిమాండ్ చేశారు. ఆ కాంట్రాక్టర్‌కు రావాల్సిన పెండింగ్ బిల్లులను త్వరగా ప్రాసెస్ చేసేందుకు, అతని సంస్థను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టకుండా ఉండేందుకు రూ. 50,000 లంచం ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి.

# కోర్టులో లొంగిపోయిన తమ్మినేని కుమారుడు.. బెయిల్ మంజూరు

**భూకబ్జా కేసులో కోర్టులో లొంగిపోయిన తమ్మినేని కుమారుడు చిరంజీవి నాగ్**

**ఆరోగ్య కారణాలను పరిగణనలోకి తీసుకుని బెయిల్ మంజూరు చేసిన శ్రీకాకుళం కోర్టు**

**ఈ కేసులో ఏ5గా చిరంజీవి, ఏ6గా తమ్మినేని సీతారాం, ఏ7గా ఆయన భార్య వాణిశ్రీ**

**ఈ నెల 10వ తేదీన విచారణకు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశం**

**శ్రీకాకుళం, ఆగస్టు 3 (నినాదం):**
శ్రీకాకుళం జిల్లా చాపరం భూకబ్జా కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ స్పీకర్, వైసీపీ సీనియర్ నేత తమ్మినేని సీతారాం కుమారుడు వెంకట చిరంజీవి నాగ్ సోమవారం శ్రీకాకుళం కోర్టులో లొంగిపోయారు. విచారణ సందర్భంగా ఆయనకు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. భూకబ్జా ఆరోపణలకు సంబంధించిన కేసులో చిరంజీవి నాగ్‌ను ఏ5 (5వ నిందితుడు)గా చేర్చారు. ఈ క్రమంలో సోమవారం ఆయన కోర్టు ఎదుట హాజరయ్యారు. విచారణ సమయంలో, తన ఆరోగ్య పరిస్థితిని చిరంజీవి నాగ్ కోర్టుకు వివరించారు. ఆయన వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం, షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. అనంతరం, ఈ నెల 10వ తేదీన జరిగే తదుపరి విచారణకు తప్పనిసరిగా హాజరు కావాలని చిరంజీవి నాగ్‌ను కోర్టు ఆదేశిం



చింది. ఇదే కేసులో చిరంజీవి నాగ్ తండ్రి తమ్మినేని సీతారాం ఏ6 (6వ నిందితుడు)గా, ఆయన తల్లి వాణిశ్రీ ఏ7 (7వ నిందితురాలు)గా ఉన్నారు. ఒకే కేసులో మాజీ స్పీకర్ కుటుంబ సభ్యులు ముగ్గురూ నిందితులుగా ఉండటం గమనార్హం.

# ఉరవకొండలో వైకాపా ఆందోళనతో ఉద్రిక్తం

**మాజీ ఎమ్మెల్యేను అరెస్ట్ చేసిన పోలీసులు**

**అనంతపురం, ఆగస్టు 3 (నినాదం):**
అనంతపురం జిలా ఉరవకొండలో వైకాపా నేతల ఆందోళనలతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నియోజకవర్గంలో దౌర్జన్యాలు, భూ ఆక్రమణలు పెరిగాయంటూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట వైకాపా మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డి ధర్నాకు పిలుపునిచ్చారు. ఈ ధర్నాకు పోలీసులు అనుమతి నిరాకరించారు. అయిన్పు ఉరవకొండలోని వైకాపా కార్యాలయం వద్ద పోలీసులు అరెస్టు చేయడానికి ప్రయత్నించారు. అయితే.. వైకాపా శ్రేణులు మూకుమ్మడిగా పోలీసులను అడ్డుకున్నారు. పోలీసులు విశ్వేశ్వర్ రెడ్డిని వాహనం ఎక్కించగానే ఆ పార్టీ శ్రేణులు ఆక్సిజన్ సిలిండర్లు, రాళ్లను రోడ్డుకు అడ్డంగా వేసి గందరగోళంసృష్టించారు. ఎట్టకేలకు పోలీసులు విశ్వేశ్వర్ రెడ్డిని అరెస్టు చేసి గుంతకల్ వైపు తరలించారు. దీంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉరవకొండ ప్రధాన రహదారిపై బైఠాయించి వాహనదారులను, ప్రజలను అడ్డగించారు. ఉరవకొండలో ఉద్రిక్తతల నేపథ్యంలో.. శివరామిరెడ్డి కాలనీలో ఉన్న మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# 20 లక్షల మార్క్ దాటిన 'ఇంటింటికీ తెలుగు దేశం -2026'

**ఏపీలో ఎనిమిదో రోజుకు చేరిన 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం**

**సోమవారం ఒక్కరోజే 3 లక్షలకు పైగా కుటుంబాలను కలిసిన టీడీపీ శ్రేణులు**

**రెండేళ్ల పాలన విజయాలను ప్రజలకు వివరిస్తున్న నేతలు**

**క్షేత్రస్థాయిలో లభిస్తున్న ఆదరణపై నారా లోకేశ్ సంతృప్తి... కార్యకర్తలను, నాయకులకు అభినందనలు**





**అమరావతి,ఆగస్టు 3 (నినాదం):**
తెలుగుదేశం పార్టీ (టీడీపీ) ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "ఇంటింటికీ తెలుగుదేశం – 2026, 2 ఏళ్ల నమ్మకం, అభివృద్ధి–సంక్షేమం" కార్యక్రమం కీలక మైలురాయిని చేరుకుంది. పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించే లక్ష్యంతో ప్రారంభించిన ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు 20 లక్షలకు పైగా కుటుంబాలను నేరుగా కలిసినట్లు టీడీపీ ప్రకటించింది. ఎనిమిది రోజులుగా కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షలకు పైగా ఇళ్లను టీడీపీ శ్రేణులు సందర్శించాయి. దీంతో ఈ కార్యక్రమం ద్వారా చేరిన మొత్తం ఇళ్ల సంఖ్య 20.61 లక్షలకు చేరినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, ప్రజాప్రతినిధులతో పాటు అన్ని స్థాయిల నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ రెండేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమం 20 లక్షల ఇళ్ల మార్క్‌ను దాటడంపై టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోందని, ఇది కార్యక్రమంపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమని ఆయన అన్నారు. ఈ మైలురాయిని అధిగమించడంలో కీలక పాత్ర పోషించిన పార్టీ నాయకులు, కార్యకర్తలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ పాలనపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

# బాలుడి ఆరోగ్యానికి మంత్రి వాసంశెట్టి భరోసా

**అమరావతి,ఆగస్టు 3 (నినాదం):**
ఫ్యాన్‌కోనీ అనీమియాతో బాధపడుతున్న బాలుడికి అండగా ఏపీ మంత్రి వాసంశెట్టి సుభాష్ అండగా నిలిచారు. రూ.20 లక్షల బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు ఏర్పాట్లు పూర్తి చేశారు. హైదరాబాద్ బసవతారకం ఆస్పత్రిలో చరణ్ తేజ పవన్‌కు శస్త్రచికిత్స నిర్వహించనున్నారు. బోన్ మ్యారో దాత నుంచి సేకరణ పక్రియ విజయవంతమైంది. పేద కుటుంబానికి సహాయం అందించేందుకు మంత్రి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. దాతలు, సేవా సంస్థల సహకారంతో చికిత్సకు నిధులను మంత్రి సుభాశ్ సమీకరించారు. సహారా హెల్త్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ నుంచి రూ.2 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. ఈ చికిత్సలో భాగమైన వైద్యులు, ఆస్పత్రి యాజమాన్యానికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. చరణ్ తేజ పవన్ పూర్తిగా కోలుకోవాలని భగవంతుడిని మంత్రి సుభాశ్ ప్రార్థించారు.




# హామీలను మోసగిస్తున్న పాలకులు !

సంపాదకీయం


తెలంగాణలో రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తోంది. ప్రధాన సమస్యలపై ఇప్పటికీ స్పష్టత లేకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. ముఖ్యంగా ధరణి విషయంలో ఎన్నో చెప్పిన రేవంత్ రెడ్డి ఇప్పటికీ దీనిపై స్పష్టత లేదు. ఎన్ని భూములు అన్యాకాంత్రం అయ్యాయో తెలియదు. దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్య తీసుకోలేదు. దేవాదాయ భూములు తెలంగాణలో వేల ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయి. కొందరు దౌర్జన్యంగా అవి పట్టాలు చేయించుకుని, రైతుభరోసా కూడా పొందుతున్నారు. ఈ భూములను స్వాధీనం చేసుకోవడంలో గత కెసిఆర్ ప్రభుత్వం, రేవంత్ ప్రభుత్వం కూడా విఫలమయ్యింది. మంత్రి కొండా సురేఖ ఉత్సవ విగ్రహంలా తయారయ్యారన్న విమర్శలు ఉన్నాయి. ఎపిలో కూడా ఇలాంటి భూములపై చంద్రబాబు ఒక్కమాటా మాట్లాడడం లేదు. ఇకపోతే కాళేశ్వరంపై విమర్శలు తప్ప ఉన్న ప్రాజెక్టును ఉపయోగించుకునే ఆలోచన చేయడంలేదు. జర్నలిస్టుల అక్రిడి టేషన్లపై గందరగోళం జరుగు తోంది. దీనిని సజావుగా పరిష్కరించడం లేదు. కోర్టుల్లో కేసులు కూడా దాఖలు అయ్యాయి. జర్నలిస్టులు ఇంటిస్థలాలు, ఆరోగ్య కార్డులు ఊసే లేదు. ఇప్పటికే ఉమ్మడి ఎపిలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి కేటాయించిన 70 ఎకరాల భూమిని కాజేసే కుట్రలు మొద లయ్యాయి. సుప్రీంకోర్టు తీర్పును బూచిగా చూపి, వేలకోట్ల విలువ చేసే భూమిని లాగేసుకుని, జర్నలిస్టులకు మొండిచేయి చూపేందుకు రంగం సిద్ధం చేశారు. ఇందులో కొందరు జర్నలిస్టుల పాత్రకూడా ఉంది. జర్నలిస్టులకు అన్యాయం చేయడంలో టిడిపి ప్రభుత్వం, జగన్ ప్రభుత్వం కూడా ఎపిలో ఇదే తరహా పోకడలు సాగించింది. ఇక అన్నింటికన్నా పెద్ద సమస్య నిరుద్యోగ సమస్య. మొన్నటికి మొన్న ఢిల్లీలో కాక్రోచ్ జనతాపార్టీ ఆందోళనలకు మద్దతు తెలిపిన రాహుల్, రేవంత్ రెడ్డిలు తెలంగాణ నిరుద్యోగుల ఆందోళనలకు మాత్రం సమాధానం చెప్పడం లేదు. ఇక్కడా అలాంటి ఉద్యమం వస్తే తప్ప వీరు స్పందించేలా లేరు. క్యాలెండర్లు మారాయి కానీ కొలువులు మాత్రం రావడలేదని ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నిరుద్యోగులు ఆందోళన చెందుతు న్నారు. తెలంగాణలో ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలిస్తానన్న కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు దాటినా నిరుద్యోగులకు ఇచ్చిన హావిని నిలబెట్టుకోలేదు. ఇటీవలే సిఎం రేవంత్ 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పారు. అంటే ఆయన ఇచ్చిన హామీని ఆయనే నెరవేర్చలేదని చెబుతున్నారు. అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌కు రెండేండ్లు పూర్తయినా.. నోటిఫికేషన్లు విడుదల చేయలేదు. నోటిఫికేషన్లపై మాట తప్పిన సర్కార్ మీద నిరుద్యోగులు ఆగ్రహంగా ఉన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్.. రెండు లక్షల ఉద్యోగాల భర్తీ.. నాలుగువేల రూపాయల చొప్పున నిరుద్యోగ భృతి.. ఇదీ కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ. కానీ, అధికారంలోకి వచ్చిన తరువాత నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను విస్మరించింది. జాబ్ క్యాలెండర్ జాడ లేదు. నిరుద్యోగ భృతి ఊసులేదు. 'ఇదిగో మా నిబద్ధత..' అంటూ 2024 ఆగస్టు 2న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్‌ను ప్రవేశపెట్టారు. 15 రకాల నోటిఫికేషన్లు ఇస్తామని చెప్పారు. ఈ క్యాలెండర్ గడువు కూడా ముగిసింది. కానీ, అందులో పేర్కొన్న ఒక్క నోటిఫికేషన్ కూడా విడుదల కాలేదు. 2025 ఆగస్టు 2,శనివారంతో 2026 ఆగస్టు 2 కూడా గడిచిపోయింది.రెండేండ్ల గడువు పూర్తయ్యింది. అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌కు విలువ లేకుండా పోయింది. నిరుద్యోగ యువతను తమవైపు తిప్పుకొనేం దుకు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు యు త్ డిక్లరేషన్ ప్రకటించింది. దీనిని ఎన్నికల మ్యానిఫెస్టోలో సైతం పొందుపరిచింది. కానీ, డిక్లరేషన్‌లో ప్రకటించిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. ఉద్యోగాలొచ్చే వరకు యువతకు నెలకు రూ. 4వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని కూడా కాంగ్రెస్ నేతలు మరచిపోయారు. అమ్మాయిలకు ఎలక్ట్రిక్‌స్కూటీలు ఇస్తామన్న హామీని కూడా నెరవేర్చలేదు. రూ.5 లక్షల విద్యాభరోసా కార్డు, రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తామన్న హామీని పట్టించుకోలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఏటా దాదాపు 9వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్ అవుతున్నట్లు అంచనాలు ఉన్నాయి. వీరితోపాటు విద్యుత్తు సంస్థలు, పలు బోర్డులు, విభాగాల్లోనూ పెద్దఎత్తున ఉద్యోగ విరమణ పొందుతున్నారు. తాజా గణాంకాల ప్రకారం పాఠశాల విద్యాశాఖలో 14వేలకుపైగా టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని అంటున్నారు. యు నివర్సిటీల్లో 2వేలకుపైగా బోధన, మరో 2,800 బోధనేతర పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గురుకులాల్లో ఆరువేలు, ఆర్టీసీలో 3దువేలకు పైగా, పోలీసుశాఖలో 17వేలకుపైగా ఖాళీలున్నాయి. ఎక్సైజ్ శాఖలో వెయ్యి, అంగన్‌వాడీల్లో 15వేలకుపైగా, మైనారిటీ సంక్షేమ శాఖలో 3 వేలకుపైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇలా పలు శాఖల్లో పెద్దఎత్తున ఖాళీలున్నా సర్కార్ నోటిఫికేషన్లు విడుదల చేయడంలేదన్న ఆందోళన నిరుద్యోగుల్లో ఉంది. మరోవైపు రాష్ట్రంలో రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉండటం గమనార్హం.3 లక్షల మంది రెగ్యులర్ ఉద్యోగులుంటే అంతే స్థాయిలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. దీనికి గత కెసిఆర్ ప్రభుత్వం ప్రధాన దోషిగా ప్రకటించాలి. ఇంటికో ఉద్యోగం అంటూ మోసం చేసి, అలా అనలేదని బుకాయించారు. లక్షల ఉద్యోగాలు ఇచ్చామని చెట్టు మీద ఆకులతో ఇస్తార్లు కుట్టినట్లు లెక్కలు చెప్పారు. ఏతావాతా ఎవరు అధికారంలోకి వచ్చినా తమ స్వప్రయోజనాలు తప్ప ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని తేల్చారు. అలు కెసిఆర్, రేవంత్, చంద్రబాబు, జగన్ ఎవరైనా ప్రజలు మాటలతో బురిడీ కొట్టించడంలో ఆరితేరారు.

# దేశంలో గృహహింస... పూర్వాపరాలు




భారతదేశంలో స్త్రీ పురుషుల మధ్య అసమానతలు ఈ మధ్యన మన భారత సమాజంలో కొట్టొచ్చినట్టు కనపడుతున్నాయి. దీనివల్ల సమాజంలో పురుషుల ప్రాబల్యం పెరగడానికి వివిధ స్థాయిలలో స్త్రీల పట్ల హింసకు దారి తీసింది. స్త్రీల పట్ల ఇంట్లో జరిగే హింస వివిధ రూపాలలో భార్యను కొట్టడం వధువులను తగలబెట్టడం వరకట్న చావులు ఆర్థిక లాభాల కోసం వేధించడం అన్నీ కలిపి గృహహింసగా పరిగణించబడతాయి. డొమెస్టిక్ వైలెన్స్‌కు వ్యతిరేకంగా ఎన్నో చట్టాలు ఉన్నాయి. భారతీయ శిక్ష స్మృతిలోని 498A, 34వ సెక్షన్లు ప్రొటెక్షన్ ఆఫ్ హ్యూమన్ ఫ్రం డొమెస్టిక్ వైలెన్సీ యాక్ట్ (2005) మొదలైన చట్టాలు గృహహింసను శిక్షిస్తాయి. అయితే ఈ చట్టాల అమలు జాప్యం ఫలితంగా కావలసిన విధంగా స్త్రీలకు రక్షణ దొరకడం లేదు. క్రైమ్ బ్యూరో రిపోర్ట్: నేషనల్ క్రైమ్ బ్యూరో రిపోర్ట్ 2013 వ సంవత్సరంలో భారత దేశంలో 1,18,866 గృహహింస కేసులో నమోదయ్యాయి. ఈ కేసులలో కేవలం 32.3% కేసుల్లో మాత్రమే దోషులకు శిక్ష పడింది. స్త్రీలపై యాసిడ్ దాడులు స్త్రీల గౌరవాన్ని హరించే సైబర్ నేరాలు స్త్రీలపై అత్యాచారాలు జరపడం భారతీయ సమాజంలో నిత్యం సంభవించే విషయాలు అయిపోయాయి. ఈ సంఘటనలు మానవ హక్కుల స్వభావానికి తీవ్రమైన విఘాతాలు కలిగిస్తున్నాయి.

కారణాలు: సమాజంలో పురుషుల అధికారం ప్రాబల్యం ఈ మధ్యకాలంలో ఎక్కువయింది. ముఖ్యంగా స్త్రీలపై పురుషుల ప్రాబల్యాన్ని ఎక్కువగా ఈ పురుష ప్రాబల్యం వివిధ రూపాలుగా ఏర్పరచుకొని సమాజంలో స్త్రీలను తక్కువ వారుగా చేయడం వల్ల గృహహింస ఎక్కువగా అవుతుంది. భారతీయ సమాజంలో పితృస్వామ్య భావన ఎక్కువగా నాటుకొని పోయి ఉంది. ముఖ్యంగా మతం మత ఆచరణాలు కూడా ఈ పురుషాధిక్య సమాజంలో ఎక్కువగావడం వల్ల కుటుంబ వ్యవస్థ క్రమానుగతశ్రేణి రూపాంతరం చెంది తద్వారా స్త్రీలకు అతి తక్కువ అంతస్తు ఇవ్వడం వల్ల స్త్రీల అంతస్తు హక్కులు స్వేచ్ఛ అలవాట్లు వస్త్రధారణ విధానాలు ఆహార అలవాట్లు జీవనశీలులు, జీవనోపాధి నమూనాలు మొదలైనవన్నీ పురుషులే నిర్ణయించడం వల్ల స్త్రీల హక్కులకు భంగం ఏర్పడి గృహ హింసకు అవి కారణభూతులయ్యాయి.





ప్రస్తుత స్థితి: భారతదేశంలో 52% స్త్రీలు తమ జీవిత కాలంలో కనీసం ఒక్కసారైనా శారీరక లేదా మానసిక హింసకు గురయ్యారని హ్యూమన్ డెవలప్మెంట్ రిపోర్ట్ అఫ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ (2007) తెలిపింది. ఉమెన్ డెవలప్మెంట్ స్టడీస్ చేసిన అధ్యయనంలో సగటున ప్రతి ఐదు గంటలకు స్త్రీలు ఇంట్లో క్రూరత్వానికి లోనవుతున్నారని తేలింది. ద నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ రీసెర్చ్ అండ్ వుమెన్ నివేదికలలో భారతదేశంలో ఐదింట ఒక వంతు వివాహిత స్త్రీ గృహహింసకు లోనవుతుందని పేర్కొన్నారు. డొమెస్టిక్ వైలెన్స్ నివేదికలు: నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో ఆఫ్ ఇండియా ప్రకారం స్త్రీల పట్ల ఎన్నో నేరాలు ప్రతి 15 నిమిషాలకు ఒక అత్యాచారం, ప్రతి మూడు నిమిషాలకు స్త్రీల పట్ల 77 నిమిషాలకు ఒక వరకట్న చావు ప్రతి 29 నిమిషాలకు ప్రతి 53 నిమిషాలకు ఒక లైంగిక వేధింపు కేసులు వరకట్నపు చావులు, పరువు హత్యలు జరుగుతున్నాయని పేర్కొన్నాయి.

ప్రభుత్వ చర్యలు: స్త్రీ సంక్షేమం మానవాభివృద్ధిని మెరుగుపరచడానికి ఒక శక్తివంతమైన సాధనం స్త్రీల సాధికారికత. భారత ప్రభుత్వం డొమెస్టిక్ వైలెన్సుల ను నివారించడానికి ఎన్నో కార్యక్రమాలను చేపట్టింది. మొట్టమొదటిసారిగా స్త్రీలను సాధికారికతవైపు మళ్ళించగలిగితే ఈ గృహహింస తగ్గుతుందని తెలిపింది. స్త్రీలు సాధికారలైతే పిల్లల అభివృద్ధి కుటుంబ సంక్షేమం మెరుగుపడుతుంది. మానవాభివృద్ధిలో జెండర్ వ్యత్యాసాలు స్త్రీల సాధికారికతోనే తగ్గుతాయి. సమాజంలో మార్పు వచ్చినప్పుడు తద్వారా కుటుంబాలలో విద్య తదితర అంశాలు వృద్ధి చెందినప్పుడు సమాజంలో తద్వారా కుటుంబాలలో స్త్రీల పట్ల గౌరవభావం పెరిగి గృహహింస పెరగకుండా విద్యతో నే ఈ సామాజిక సమస్యను నిర్మూలించవచ్చునని మేధావుల ఉవాచ.

**పందిరి: శ్రీనివాసులు. ఎంఏ (జాగ్రఫీ), బీఈడీ, ఎంసీజే (జర్నలిజం) పిజిడిసిజే (జర్నలిజం) ఉస్మానియా యూనివర్సిటీ.**

## మానవతకు చిరునామా.. మృదు కవిత్వానికి ప్రతిరూపం: కరుణశ్రీ



**ఆగస్టు 4...కరుణామయ కవితా కిరీటి కరుణశ్రీ జయంతి**

తెలుగు కవిత్వ జగత్తులో భావుకతకు, కరుణకు, ప్రకృతి సౌందర్యారాధనకు, మానవతా విలువలకు అమర చిరునామాగా నిలిచిన మహాకవి జంధ్యాల పాపయ్య శాస్త్రి "కరుణశ్రీ". ఆధునిక తెలుగు సాహిత్యంలో పద్య కవిత్వాన్ని అత్యంత సుబోధకం చేస్తూ, కరుణ రసాన్ని ప్రధాన వస్తువుగా మలచి సమస్త పాఠక లోకాన్ని ద్రవీభవింప జేసిన అసామాన్య సాహిత్య మూర్తి ఆయన. కేవలం పాండిత్య ప్రకర్షకు మాత్రమే పరిమితం కాకుండా, కవిత్వాన్ని మానవీయ విలువల వ్యాప్తికి, జీవకరుణకు, ఆధ్యాత్మిక పరిమళానికి, సమాజంలో సమరసతను నింపడానికి ఒక శక్తివంతమైన సాధనంగా మలిచిన చిరస్మరణీయుడు. ఆయన కలంపేరు 'కరుణశ్రీ' అనేది ఆయన కావ్య వస్తువుకూ, సంస్కారవంతమైన వ్యక్తిత్వానికీ పరిపూర్ణ ప్రతీకగా భాసిల్లింది. దయ, శమము, దమము, ప్రేమ, అహింస, జాతీయ చైతన్యం, భారతీయ సంస్కృతి పట్ల అగాధమైన గౌరవం వంటి విశిష్టమైన నైతిక విలువలను ఆయన తన ప్రతి కవితా పంక్తిలోను ప్రతిఫలింపజేశారు. అందుకే ప్రాచీనాధునిక తెలుగు సాహితీ స్రవంతిలో కరుణశ్రీ ఒక ప్రత్యేక సువర్ణ అధ్యాయంగా నిలిచిపోయారు.

జంధ్యాల పాపయ్య శాస్త్రి 1912 ఆగస్టు 4న గుంటూరు జిల్లా పల్లపాడు గ్రామంలో జన్మించారు (కొప్పర్రు గ్రామంలో ప్రాథమిక వికాసం పొంది, పిడుగురాళ్ళ సరిహద్దుల్లో విద్యాభ్యాసం కొనసాగించారు). ఆయన తల్లి మహాలక్ష్మమ్మ, తండ్రి పరమేశ్వర శాస్త్రి. సంప్రదాయ సంస్కారాలు, భాషాభిమానం నిండిన వాతావరణంలో పెరిగిన పాపయ్య శాస్త్రి చిన్ననాటి నుంచే సంస్కృతాంధ్ర భాషల్లో, వేద పురాణాలలో, ఉపనిషత్తులలో విశేష ప్రావీణ్యం సంపాదించారు. గుంటూరు ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో సుదీర్ఘకాలం తెలుగు అధ్యాపకునిగా సేవాలందించారు. ఉపాధ్యాయుడిగా వందలాది మంది విద్యార్థులలో నైతిక విలువల విత్తనాలు నాటుతూనే, మరోవైపు కవితా యజ్ఞాన్ని నిరంతరాయంగా సాగించి విశాలమైన పాండిత్యాన్ని, ప్రజాదరణను పొందారు.

కరుణశ్రీ కవిత్వ ప్రస్థానంలో 'ఉదయశ్రీ', 'విజయశ్రీ', 'కరుణశ్రీ', 'అరుణశ్రీ', 'శాంతిశ్రీ' వంటి కావ్యాలు మహోన్నత మైలురాళ్ళుగా నిలిచాయి. వీటిలో 1945లో వెలువడిన 'ఉదయశ్రీ' ఖండకావ్య సంపుటి తెలుగు పద్య చరిత్రలోనే ఒక అపూర్వ విప్లవాత్మక ఘట్టం. ఈ ఒక్క గ్రంథమే వందకు పైగా పునర్ముద్రణలు పొంది లక్షలాది ప్రతులు అమ్ముడుపోవడం తెలుగు సాహిత్య విపణిలో అత్యంత అరుదైన వర్తమాన గణాంకం. అందులోని "పుష్ప విలాపము" కవిత ప్రతి తెలుగువారి గుండెల్లోనూ, పాఠశాలల పాఠ్యాంశాలలోనూ చెరగని ముద్ర వేసింది. మానవుడు తన స్వార్థం కోసం, దేవుడి పూజ పేరిట పూలను కోసి నలిపివేసే క్రమంలో ఆ పూల ఆవేదనను కవి ఆవిష్కరించిన తీరు సాటిలేనిది. "నేను కోరక ముందే రాలిపోవు నన్ను పీఠంపై ఉంచకండి" అని పుష్పం ఆక్రోశించే ఘట్టం చదివిన ఏ హృదయమైనా ద్రవించక మానదు. ప్రకృతిలోని ప్రతి జీవికి స్వేచ్ఛగా జీవించే హక్కు ఉందని చాటడమే ఈ కవిత అంతరార్థం.

కరుణశ్రీ కవిత్వాన్ని లోతుగా పరిశీలిస్తే అందులో ప్రధానంగా మూడు మహోన్నత భావధారలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. మొదటిది 'బౌద్ధ కరుణ'. గౌతమ బుద్ధుని అహింసా సిద్ధాంతం, మైత్రి, జీవకరుణ ఆయనను తీవ్రంగా ప్రభావితం చేశాయి. 'అమ్రపాలి', 'అనాథపిండిక' వంటి రచనల్లో బౌద్ధ తత్వపు విశిష్టతను అచ్చతెలుగు పద్యాల్లో మధురంగా మలచారు. ద్వేషాన్ని ద్వేషంతో కాక ప్రేమతోనే జయించగలమని ఆయన చాటారు. రెండవది 'ప్రకృతి ఆరాధన'. ప్రకృతి కరుణశ్రీ కవిత్వానికి జీవనాడి. పూల వికసనం, పక్షుల కిలకిలారావాలు, వర్షపు చినుకులు, నదీ ప్రవాహాలు, చంద్రుని వెన్నెల ఆయన కలానికి సజీవ రూపాలుగా మారాయి. ప్రకృతి కేవలం ఆస్వాదించే వస్తువు కాదని, మానవాళికి నిస్వార్థ సేవను నేర్పే పరమ గురువు అని భావించారు. మూడవది 'జాతీయ చైతన్యం'. 'విజయశ్రీ' కావ్యంలో కురుక్షేత్ర సంగ్రామాన్ని వర్ణిస్తూనే, ధర్మాధర్మాల పోరాటంలో నైతిక విజయాన్నే కావ్య వస్తువుగా స్వీకరించారు. భారతీయ సంస్కృతి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరిస్తూ జాతీయతకు మానవతను జోడించిన అరుదైన కవిగా నిలిచారు.

కరుణశ్రీ సమకాలీనులైన విశ్వనాథ సత్యనారాయణ ప్రౌఢత్వం, దేవులపల్లి కృష్ణశాస్త్రి భావకవిత్వ మృదుత్వం, దాశరథి, సి. నారాయణరెడ్డి ఆధునిక శైలి—వీటన్నింటి మధ్య తనదైన ఒక ప్రత్యేకమైన బాటను వేసుకున్నారు. సంస్కృత సమాస భూయిష్ఠమైన పద్యాలకు భిన్నంగా, సామాన్య పాఠకుడికి సైతం సూటిగా హృదయాన్ని తాకే సులభమైన పదజాలాన్ని, లలితమైన శబ్దాలంకారాలను ఉపయోగించడం ఆయన శైలిలోని మహత్తర గుణం. అందుకే ఆయన పద్యాలు పండిత సభల నుంచి పామరుల నోళ్ళ వరకు మారుమోగాయి.

1980 జూన్ 22న కరుణశ్రీ భౌతిక దేహాన్ని విడిచినప్పటికీ, ఆయన అందించిన కావ్య సుగంధాలు తెలుగు నేలన నిత్యనూతనంగా వెలుగుతున్నాయి. పర్యావరణ వినాశనం, మానవ సంబంధాల క్షీణత, హింస పెరిగిపోతున్న నేటి సమాజానికి కరుణశ్రీ బోధించిన 'జీవకరుణ', 'ప్రకృతి ప్రేమ', 'సమానత్వం' ఎంతో అవసరం. తెలుగు భాష ఉన్నంత కాలం, మానవత్వం విలువైనంతకాలం కరుణశ్రీ పేరు చిరస్థాయిగా వెలుగుతూనే ఉంటుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# గ్యాంగ్‌స్టర్ యాక్టర్.. విన్సెంట్ ఇకలేరు



**'ది సోప్రానోస్'లో 'బిగ్ పుస్సీ' పాత్రతో ప్రపంచవ్యాప్త గుర్తింపు... మాఫియా, నేర నేపథ్య పాత్రలకు ప్రత్యేక ముద్ర వేసిన హాలీవుడ్ నటుడు కన్నుమూత**

మాఫియా, గ్యాంగ్‌స్టర్ పాత్రలకు జీవం పోసిన ప్రముఖ హాలీవుడ్ నటుడు విన్సెంట్ పాస్టర్ ఇకలేరు. తెరపై నేర ప్రపంచ పాత్రలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయన 80 ఏళ్ల వయసులో కన్నుమూశారు. ముఖ్యంగా హెచ్‌బీఓ రూపొందించిన ప్రముఖ నేర నేపథ్య ధారావాహిక ★'ది సోప్రానోస్'★ లో 'సాల్వటోర్ బిగ్ పుస్సీ బోన్‌పెన్సియెరో' పాత్ర ఆయనకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చింది.

తన నటనతో కేవలం గ్యాంగ్‌స్టర్ పాత్రలకు మాత్రమే కాకుండా... ఆ పాత్రల వెనుక ఉన్న భావోద్వేగాలు, సంఘర్షణలను కూడా ప్రేక్షకులకు చేరువ చేసిన నటుడిగా విన్సెంట్ పాస్టర్ పేరు పొందారు. తెరపై కఠినమైన మాఫియా వ్యక్తిగా కనిపించిన ఆయన, నిజ జీవితంలో మాత్రం స్నేహపూర్వక స్వభావం కలిగిన వ్యక్తిగా సహచరుల అభిమానాన్ని పొందారు.

బ్రాంక్స్ నుంచి వెండితెర వరకు...

1946 జూలై 14న అమెరికాలోని న్యూయార్క్ నగరంలోని బ్రాంక్స్ ప్రాంతంలో ఇటాలియన్-అమెరికన్ కుటుంబంలో విన్సెంట్ పాస్టర్ జన్మించారు. చిన్నతనం న్యూ రోషెల్ ప్రాంతంలో గడిచింది. సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన ఆయన జీవితంలో అనేక ఒడిదుడుకులను ఎదుర్కొని నటుడిగా ఎదిగారు.

యువకుడిగా అమెరికా నౌకాదళంలో సేవలందించిన విన్సెంట్, ఆ తర్వాత నటనపై ఆసక్తితో పేస్ విశ్వవిద్యాలయంలో నాటక విద్యను అభ్యసించారు. అయితే సినీ రంగంలోకి ఆయన ప్రయాణం ఆలస్యంగానే ప్రారంభమైంది. దాదాపు మూడు దశాబ్దాల పాటు క్లబ్ వ్యాపార రంగంలో కొనసాగిన తర్వాత, 40 ఏళ్ల వయసులో నటన వైపు అడుగులు వేశారు.

ఆలస్యంగా వచ్చిన అవకాశం... అద్భుతమైన విజయం

1988లో 'బ్లాక్ రోజెస్' చిత్రంతో వెండితెరకు పరిచయమైన విన్సెంట్ పాస్టర్, మొదట చిన్న పాత్రలతో తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. అయితే ఆయన ప్రత్యేకమైన నటనా శైలి, న్యూయార్క్ యాస, సహజమైన హావభావాలు దర్శకులను ఆకట్టుకున్నాయి.

1990లో ప్రముఖ దర్శకుడు మార్టిన్ స్కోర్సెసి రూపొందించిన 'గుడ్‌ఫెల్లాస్' చిత్రంలో నటించారు. ఆ తర్వాత 'కార్లిటోస్ వే', 'గాట్టి' వంటి నేర నేపథ్య చిత్రాల్లో కనిపించి మాఫియా పాత్రలకు చిరునామాగా మారారు.

'ది సోప్రానోస్'... జీవితాన్ని మార్చిన పాత్ర

విన్సెంట్ పాస్టర్ సినీ జీవితంలో అత్యంత కీలకమైన మలుపు 'ది సోప్రానోస్' ధారావాహికతో వచ్చింది. హెచ్‌బీఓ రూపొందించిన ఈ నేర నేపథ్య ధారావాహికలో ఆయన పోషించిన 'సాల్వటోర్ బిగ్ పుస్సీ బోన్‌పెన్సియెరో' పాత్ర ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేసింది.

మాఫియా కుటుంబంలో కీలక సభ్యుడిగా, టోనీ సోప్రానోకు అత్యంత సన్నిహితుడిగా కనిపించే ఈ పాత్రలో విన్సెంట్ అద్భుతమైన నటనను ప్రదర్శించారు. స్నేహం, నమ్మకం, నేర ప్రపంచ ఒత్తిళ్లు, వ్యక్తిగత సంఘర్షణలు... ఇలా ఒక గ్యాంగ్‌స్టర్ జీవితంలోని అనేక కోణాలను ఆయన సహజంగా చూపించారు.

సాధారణంగా మాఫియా పాత్రలను భయంకరమైన వ్యక్తులుగా మాత్రమే చూపిస్తారు. కానీ విన్సెంట్ పాస్టర్ మాత్రం ఆ పాత్రల్లోని మానవీయ కోణాలను కూడా తెరపై ఆవిష్కరించారు. అందుకే 'బిగ్ పుస్సీ' పాత్ర ఆయన కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలిచిపోయింది.

మాఫియా సినిమాలకు ప్రత్యేక గుర్తింపు

విన్సెంట్ పాస్టర్ పేరు వినగానే మాఫియా, నేర ప్రపంచ కథలు గుర్తుకు రావడానికి కారణం ఆయన ఎంచుకున్న పాత్రలే. గంభీరమైన శరీర భాష, ప్రత్యేకమైన మాటతీరు, సహజ నటనతో నేర ప్రపంచ పాత్రలకు ఆయన కొత్త రూపాన్ని ఇచ్చారు.

'గుడ్‌ఫెల్లాస్', 'కార్లిటోస్ వే', 'గాట్టి' వంటి చిత్రాలతో పాటు అనేక నేర నేపథ్య చిత్రాల్లో నటించారు. మాఫియా కుటుంబాల కథలను ఆధారంగా చేసుకున్న పలు చిత్రాలు, ధారావాహికల్లో ఆయన కనిపించారు.

సుమారు 150కి పైగా సినిమాలు, టెలివిజన్ కార్యక్రమాల్లో నటించిన విన్సెంట్ పాస్టర్, కేవలం ఒకే తరహా పాత్రలకు పరిమితం కాలేదు. హాస్యం, కుటుంబ కథలు, నాటకీయ పాత్రలు వంటి విభిన్న రంగాల్లోనూ తన ప్రతిభను చూపించారు.

నటనకు లభించిన గౌరవం

'ది సోప్రానోస్'లో చేసిన నటనకు విన్సెంట్ పాస్టర్‌కు మంచి ప్రశంసలు లభించాయి. ఆ ధారావాహిక నటీనటుల బృందం అందుకున్న స్క్రీన్ యాక్టర్స్ గిల్డ్ అవార్డు ఆయన కెరీర్‌లో ఒక ముఖ్యమైన గుర్తింపుగా నిలిచింది.

పాత్ర చిన్నదైనా, దానికి తనదైన ప్రత్యేకతను తీసుకురావడం విన్సెంట్ పాస్టర్ ప్రత్యేకత. కొన్ని నిమిషాల పాటు కనిపించినా ప్రేక్షకుల జ్ఞాపకాల్లో నిలిచిపోయేలా నటించడం ఆయన ప్రతిభకు నిదర్శనం.

తెర వెనుక విన్సెంట్... స్నేహపూర్వక వ్యక్తిత్వం

తెరపై కఠినమైన మాఫియా వ్యక్తిగా కనిపించిన విన్సెంట్ పాస్టర్ నిజ జీవితంలో మాత్రం ఎంతో స్నేహపూర్వకంగా ఉండేవారని సహచరులు చెబుతారు. యువ నటులను ప్రోత్సహించడం, కొత్త ప్రతిభను ప్రోత్సహించడం ఆయనకు ఇష్టమైన విషయాల్లో ఒకటి.

నటనతో పాటు రేడియో కార్యక్రమాలు, పాడ్‌కాస్ట్‌ల ద్వారా కూడా అభిమానులతో అనుబంధాన్ని కొనసాగించారు. తన అనుభవాలను, సినీ ప్రయాణంలోని ఆసక్తికర విషయాలను అభిమానులతో పంచుకునేవారు. న్యూయార్క్ సంస్కృతి, అక్కడి జీవన విధానం ఆయన వ్యక్తిత్వంలో స్పష్టంగా కనిపించేది.

కుటుంబం... సాధారణ జీవితానికే ప్రాధాన్యం

విన్సెంట్ పాస్టర్ వ్యక్తిగత జీవితంలో ఎంతో సాధారణంగా ఉండేవారు. ఆయన నాన్సీ బర్క్‌ను వివాహం చేసుకున్నారు. కొంతకాలం తర్వాత వీరిద్దరూ విడిపోయారు. ఈ దంపతులకు రెనీ అనే కుమార్తె ఉంది.

సినీ రంగంలో ఎంత పేరు వచ్చినా, తన మూలాలను ఆయన మరచిపోలేదు. బ్రాంక్స్‌లో జన్మించిన ఆయనకు న్యూయార్క్ నగరంతో ఉన్న అనుబంధం జీవితాంతం కొనసాగింది. అక్కడి ప్రజలు, సంస్కృతి, వాతావరణం తన నటనా ప్రయాణంపై ఎంతో ప్రభావం చూపాయని పలు సందర్భాల్లో వెల్లడించారు.

మాఫియా పాత్రల వెనుక ఓ విలక్షణ నటుడు

విన్సెంట్ పాస్టర్‌ను ప్రేక్షకులు ఎక్కువగా గ్యాంగ్‌స్టర్ పాత్రలతో గుర్తుపెట్టుకున్నప్పటికీ, ఆయన నటనా పరిధి అంతకంటే విస్తృతమైనది. ఒక నేరస్థుడి పాత్రలోనూ మానవీయ భావాలను చూపించడం ఆయన ప్రత్యేకత.

మాఫియా కథల్లో కనిపించే ద్రోహం, స్నేహం, కుటుంబ బంధాలు, భయాలు వంటి అంశాలను తన నటన ద్వారా ప్రేక్షకులకు చేరువ చేశారు. అందుకే ఆయన చేసిన పాత్రలు కేవలం ప్రతినాయక పాత్రలుగా కాకుండా కథలో కీలకమైన భాగాలుగా నిలిచాయి.

హాలీవుడ్‌కు తీరని లోటు

విన్సెంట్ పాస్టర్ మరణం హాలీవుడ్ చిత్ర పరిశ్రమకు తీరని లోటుగా మారింది. ముఖ్యంగా మాఫియా, నేర నేపథ్య చిత్రాలను ఇష్టపడే అభిమానులకు ఆయన మరణం విషాదాన్ని మిగిల్చింది.

హీరో పాత్రలు చేయకపోయినా... తన ప్రత్యేకమైన నటనతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న అరుదైన నటుల్లో విన్సెంట్ పాస్టర్ ఒకరు. ఒక పాత్రతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందడం ఎంత గొప్ప విషయమో ఆయన ప్రయాణం చెబుతుంది.

గ్యాంగ్‌స్టర్ పాత్రలకు కొత్త అర్థం చెప్పిన విన్సెంట్ పాస్టర్ ఇక వెండితెరపై కనిపించరు. కానీ 'ది సోప్రానోస్'లోని 'బిగ్ పుస్సీ' పాత్రతో పాటు ఆయన పోషించిన అనేక పాత్రలు సినీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి.

ఆలస్యంగా వచ్చిన అవకాశాన్ని తన ప్రతిభతో విజయంగా మార్చుకున్న ఈ మహానటుడు... హాలీవుడ్ అభిమానుల హృదయాల్లో ఎప్పటికీ గుర్తుండిపోతారు.

శ్రీశైలం దూడం
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, జగిత్యాల
మొబైల్: 9133947176



# ఈయేడు కుంభవృష్టి వర్షాలు తప్పవు

**వర్షాలతో ప్రాణనష్టం కూడా ఎక్కువే**
**రంగం భవిష్యవాణిలో మాతంగి వెల్లడి**

**హైదరాబాద్,ఆగస్టు3(నినాదం):** సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో మాతంగి స్వర్ణలత భవిష్యవాణి(రంగం) వినిపించారు. మీరెవరూ నేను చెప్పింది ఏదీ ఆచరించడం లేదంటూ మాతంగి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడకు నేను సంతోషంగా రాలేదు.. క్రోధంతో వచ్చానని అన్నారు. మీ ప్రశ్నలకు ఎందుకు సమాధానం చెప్పాలని నిలదీశారు. నా విగ్రహం ప్రతిష్ట చేస్తానని మాట ఇచ్చి జరిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఆపద వచ్చినా.. ప్రమాదం వచ్చినా కాపాడుతున్నానని మాతంగి స్వర్ణలత తెలిపారు. కానీ మీరు చేసే చర్యలే నాకు ఆగ్రహం తెప్పిస్తుందని అన్నారు. వావివరసలు లేకుండా ఘోరాలు జరుగుతున్నాయని.. అలాంటి వారిని వదిలిపెట్టనని అన్నారు. వారిని పాదాల కింద నలిపేస్తానని అన్నారు. ఈ ఏడాది ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాతంగి భవిష్యవాణిలో చెప్పారు.ఈ ఏడాది కుంభవర్షాలు ఉన్నాయని తెలిపారు. అగ్నిప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయని చెప్పారు. ఈ ఏడాది ప్రాణనష్టం భారీగా జరుగుతుందని అన్నారు. కాబట్టి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కొంతమంది కళ్లు నెత్తికెక్కి ప్రవర్తిస్తున్నారని మాతంగి స్వర్ణలత ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి ప్రవర్తన తనకు సంతోషం కలిగించడం లేదని తెలిపారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర చివరి ఘట్టానికి చేరుకుంది. ఈ ఉత్సవాల్లో భాగంగా రంగం భవిష్యవాణిని మాతంగి స్వర్ణలత వినిపించారు. తాను సంతోషంగా లేనని.. క్రోధంతో వచ్చానని భవిష్యవాణిలో చెప్పారు. ఈ ఏడాది కుంభవృష్టి ఉంది. వర్షాల్లో ప్రజలు కొట్టుకుపోయే పరిస్థితి ఉంది. రంగం భవిష్యవాణితో ఈ బోనాల జాతర ముగియనుంది. ఈ నేపథ్యంలో భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. రంగం అనంతరం అమ్మవారిని అంబారీపై ఊరేగించనున్నారు.

# 'ఫారెస్ట్'లో చేపల చెరువు..!

- అక్రమ చేపల చెరువుపై అధికారుల మౌనం ఎందుకు?
- సర్వే నం.122లో ఎకరాల అటవీ భూమిలో చేపల చెరువుల నిర్వహణ
- స్థానిక రాజకీయ నాయకుల అండదండలతోనే అక్రమాలు
- పట్టాల కోసం దరఖాస్తులు... మరోవైపు చెరువుల నిర్వహణపై విమర్శలు
- ఉన్నతస్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్




**లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 3 (నినాదం):** **ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే గిరిజన కుటుంబాలకు అటవీ భూములే ప్రధాన జీవనాధారం. వారు సాగు చేసి పంటలు పండించుకుని జీవనోపాధి పొందాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం అటవీ హక్కుల చట్టం కింద అర్హులకు భూములపై హక్కులను కల్పిస్తోంది. అయితే లక్ష్మీదేవిపల్లి మండలంలో కొందరు వ్యక్తులు ఆ చట్టం ఉద్దేశానికి విరుద్ధంగా అటవీ భూములను చేపల చెరువులుగా మార్చి వాణిజ్య కార్యకలాపాలకు వినియోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.**

స్థానికుల ఆరోపణల ప్రకారం, అనుమతులు లేకుండానే చేపల చెరువులు ఏర్పాటు చేసి వాణిజ్యపరంగా లాభాలు పొందుతున్నప్పటికీ సంబంధిత అధికారులు సమయానికి చర్యలు తీసుకోకపోవడంతో అక్రమాలు కొనసాగుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే అటవీ హక్కుల చట్టం అసలు లక్ష్యం దెబ్బతింటుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, చేపల చెరువులు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారే అదే భూములకు అటవీ హక్కుల చట్టం కింద పట్టాలు మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. దీనిపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ నిర్వహించి, అటవీ భూముల వినియోగం చట్టబద్ధంగా జరుగుతోందా లేదా అన్న విషయాన్ని ఉన్నతాధికారులు తేల్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమాలు జరిగినట్లు తేలితే సంబంధిత వ్యక్తులతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

**– సర్వే నం. 122లో సుమారు 10 ఎకరాల అటవీ భూమిలో చేపల చెరువుల నిర్వహణ**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలంలో అటవీ హక్కుల చట్టానికి విరుద్ధంగా అటవీ భూమిలో చేపల చెరువులు ఏర్పాటు చేసి వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. మండల పరిధిలోని సర్వే నంబర్ 122లో సుమారు 10 నుంచి 20 ఎకరాల అటవీ భూమిని అనుమతులు లేకుండానే చేపల చెరువులుగా మార్చి వ్యాపారం కొనసాగిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం... అటవీ హక్కుల చట్టం ప్రకారం అటవీ భూమిని సాగు చేసుకుని జీవనాధారాన్ని పొందేందుకు మాత్రమే వినియోగించాలి. అయితే ఇక్కడ సాగు పేరుతో భూమిని చేపల చెరువులుగా మార్చి పూర్తిస్థాయి కమర్షియల్ వ్యాపారం నిర్వహిస్తున్నారని వారు అంటున్నారు. ఈ వ్యవహారానికి స్థానిక రాజకీయ నాయకుల అండదండలు కూడా ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**– అక్రమ చేపల చెరువుపై అధికారుల మౌనం ఎందుకు?**

ఇంత పెద్ద ఎత్తున అటవీ భూమిలో మార్పులు చోటుచేసుకున్నప్పటికీ సంబంధిత అటవీ శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. చెరువుల తవ్వకం, నీటి నిల్వ, చేపల పెంపకం వంటి కార్యకలాపాలు బహిరంగంగానే జరుగుతున్నప్పటికీ అధికారులు ఎందుకు స్పందించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.


**పట్టాల కోసం దరఖాస్తులు... మరోవైపు కమర్షియల్ కార్యకలాపాలు**

ఈ భూమికి సంబంధించి కొందరు వ్యక్తులు అటవీ హక్కుల చట్టం కింద పట్టాల కోసం దరఖాస్తులు కూడా చేసుకున్నట్లు సమాచారం. అయితే దరఖాస్తులు పరిశీలనలో ఉండగానే అదే భూమిలో చేపల చెరువులు నిర్వహించడం ఎంతవరకు చట్టబద్ధమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీనిపై అధికారులు స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

**ఉన్నతస్థాయి విచారణ జరపాలి...**


సర్వే నంబర్ 122లో జరుగుతున్న భూవినియోగ మార్పులు, చేపల చెరువుల ఏర్పాటు, సంబంధిత అనుమతులు, అటవీ హక్కుల చట్టం అమలుపై ఉన్నతాధికారులు స్వతంత్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం అర్హులైన అటవీ నివాసితులకు జీవనాధారం కోసం భూమిని సాగు చేసుకునే హక్కులు కల్పించబడతాయి. అయితే ఆ భూమిని అనుమతులు లేకుండా వాణిజ్య అవసరాలకు మార్చడం లేదా కమర్షియల్ వ్యాపారాల కోసం వినియోగించడం చట్టపరంగా వివాదాస్పద అంశంగా పరిగణించబడుతుంది. ఈ నేపథ్యంలో లక్ష్మీదేవిపల్లి మండలంలోని ఈ వ్యవహారంపై సంబంధిత శాఖలు సమగ్ర విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ వ్యవహారంపై చాతకొండ సెక్షన్ అటవీ అధికారి శ్రీనివాస్ వివరణ కోరగా... "సర్వే నంబర్ 122లో అటవీ భూమిలో చేపల చెరువులు ఏర్పాటు చేసిన వారి వివరాలను గుర్తించి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తేలితే వారిపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటాం. ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపడతాం" అని తెలిపారు.

# గుండెకో వేగం - వేగాన్ని బట్టి ఆరోగ్యం



హార్ట్ రేట్ ఎక్కువగా ఉన్నప్పుడు రక్తనాళాల గోడలపై ఒత్తిడి పెరుగుతుంది. ఇది భవిష్యత్తులో అధిక రక్తపోటు, ధమనుల్లో కొవ్వు పేరుకుపోవడానికి దారితీయవచ్చు. ఎక్కువగా ఉండటం అనేది శరీరంలో నిరంతర ఒత్తిడి లేదా వాపు ఉందనడానికి సంకేతం కావచ్చు. ఇది టైప్-2 మధుమేహం, ఇతర మెటబాలిక్ సమస్యలకు కూడా లింక్ అయి ఉంటుంది. 'రెస్టింగ్ హార్ట్ రేట్' అంటే ఏంటి, గుండె వేగంగా కొట్టుకుంటే ఏమవుతుంది, పాటించాల్సిన జాగ్రత్తల గురించి పూర్తి సమాచారాన్ని డాక్టర్ జగదీష్ మదిరెడ్డి అందించారు. శరీరం పూర్తి విశ్రాంతిలో ఉన్నప్పుడు గుండె నిమిషానికి కొట్టుకునే సంఖ్యనే 'రెస్టింగ్ హార్ట్ రేట్' అంటారు. ఇది కొలవడం చాలా సులభమే అయినప్పటికీ, మన గుండె ఆరోగ్యం గురించి ముఖ్యమైన ఆధారాల్ని అందిస్తుంది. ఒకే ఒక్కసారి కొలిచిన రీడింగ్ ఆధారంగా ఎలాంటి వ్యాధిని నిర్ధారించలేము. కానీ, మీ గుండె వేగం ఎల్లప్పుడూ ఎక్కువగా ఉన్నా లేదా చాలా తక్కువగా ఉన్నా, అది శరీరంలోని ఏవైనా అంతర్గత సమస్యలకు సంకేతం కావచ్చు. కాబట్టి దీనిని విస్మరించకూడదు. మీ రెస్టింగ్ హార్ట్ రేట్ ఎక్కువగా ఉంటే (ఉదాహరణకు నిమిషానికి 80--90 పైబడి), ప్రతి నిమిషానికి మీ గుండె ఎక్కువ సార్లు కొట్టుకోవాల్సి వస్తుంది. దీనివల్ల కాలక్రమేణా గుండె కండరాలు తీవ్ర ఒత్తిడికి గురై, బలహీనపడే అవకాశం ఉంటుంది. 'రెస్టింగ్ హార్ట్ రేట్' గురించి పూర్తి సమాచారాన్ని డాక్టర్ జగదీష్ మదిరెడ్డి (కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్, యశోద హాస్పిటల్స్, హైదరాబాద్.) అందించారు.

## అందంగా, యవ్వనంగా
# కనిపించడం కోసం



**వయసు పెరుగుతున్నా అందంగా, యూత్‌ఫుల్‌గా ఫుల్‌గా కనిపించాలని ప్రతి ఒక్కరికీ ఉంటుంది. అందుకోసం రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. అయితే అందంగా, ఏజ్‌లెస్‌గా కనిపించాలంటే బొటాక్స్, ఫిల్లర్స్ ట్రీట్మెంట్ తప్పనిసరి అనుకునే రోజులు క్రమంగా మారుతున్నాయి. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా బ్యూటీ నిపుణులు సహజమైన అందాన్ని కాపాడే స్కిన్‌కేర్ పద్ధతులకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. చర్మ నాణ్యతను మెరుగుపరచడం, కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచడం, చర్మ సహజ కాంతిని ఎక్కువకాలం నిలబెట్టడం వంటి న్యూ ట్రెండ్ ట్రీట్మెంట్స్ అందుబాటులోకి వస్తున్నాయి.**

వయసు పెరిగే కొద్దీ ముఖంపై ముడతలు, సన్నని గీతలు, చర్మం బిగుతు తగ్గడం సహజం. ఇలాంటి ఏజింగ్ లక్షణాలను తగ్గించుకోవడానికి, నిత్య యవ్వనంగా కనిపించడానికి చాలామంది బొటాక్స్, డెర్మల్ ఫిల్లర్స్ వంటి కాస్మెటిక్ ట్రీట్మెంట్స్‌ను కనిపిస్తోంది. అయితే ఇప్పుడు బ్యూటీ ప్రపంచంలో కొత్త ట్రెండ్ కనిపిస్తోంది. కేవలం చర్మంపైన ముడతలు, గీతలు దాచడం కంటే కూడా, చర్మం లోపలి నుంచి ఆరోగ్యంగా మార్చి సహజమైన కాంతిని తీసుకురావడంపై సౌందర్య ప్రియులు ఎక్కువ ఇంట్రెస్ట్ చూపుతున్నారు. చర్మం నేచురల్ లుక్‌ను కాపాడుకుంటూనే యంగ్‌గా కనిపించాలని కోరుకునే వారి సంఖ్య పెరుగుతోంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం ఆధునిక స్కిన్‌కేర్ ఇప్పుడు 'స్కిన్ లాంగెవిటీ', 'కొల్లాజెన్ బూస్టింగ్', 'రీజెనరేటివ్ ట్రీట్‌మెంట్స్' వైపు అడుగులు వేస్తోంది. ప్రస్తుతం బ్యూటీ ట్రీట్మెంట్స్‌లో ఎక్కువమంది దేనివైపు మొగ్గు చూపుతున్నారో ఈ స్టోరీలో వివరంగా తెలుసుకునే ప్రయత్నం చేద్దాం..

**స్కిన్ బూస్టర్స్**

ప్రస్తుతం ఎక్కువ మంది స్కిన్ బూస్టర్స్ ట్రీట్మెంట్‌ను ఎంచుకుంటున్నారు. బొటాక్స్ ట్రీట్మెంట్ కండరాలను సడలించి, ఫిల్లర్లు చర్మాన్ని నిండుదనాన్ని పునరుద్ధరించినప్పటికీ.. ఈ రిజల్ట్స్ తాత్కాలికం. అయితే స్కిన్ బూస్టర్స్ ఇవి చర్మానికి లోతుగా తేమను అందించి, పొడిబారిన చర్మాన్ని మృదువుగా మారుస్తాయి. ఈ ట్రీట్మెంట్ వల్ల ముఖానికి సహజమైన మెరుపు రావడంతో పాటు చర్మం స్మూత్‌గా కనిపిస్తుంది. చర్మం నాణ్యతను మెరుగుపరచడమే దీని లక్ష్యం. పెప్టైడ్లు, హైలురోనిక్ యాసిడ్, యాంటీఆక్సిడెంట్లు చర్మ ఆకృతి, తేమ, స్థితిస్థాపకతకు సహాయపడతాయి.

**కొల్లాజెన్ పెంచే ట్రీట్మెంట్స్**

చర్మ సంరక్షణలో, చర్మాన్ని యవ్వనంగా ఉంచడంలో కొల్లాజెన్ కీలక పాత్ర పోషిస్తుందని The American Journal of Medicina అధ్యయనం పేర్కొంది. అయితే వయసు పెరిగే కొద్దీ మన శరీరంలో కొల్లాజెన్ ఉత్పత్తి తగ్గుతుంది. దీంతో చర్మం బిగుతు కోల్పోయి, ముడతలు, గీతలు ఏర్పడతాయి. దీంతో ముఖం మీద వృద్ధాప్య ఛాయలు స్పష్టంగా కనిపిస్తాయి. ఇప్పుడు నిపుణులు కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రోత్సహించే బయోస్టిమ్యులేటర్ ట్రీట్మెంట్స్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇవి మీ చర్మానికి ఇన్‌స్టెంట్ రిజల్ట్స్ కంటే నేచురల్ లుక్‌ను తీసుకురావడానికి సహాయపడ తాయి.

**నాన్-సర్జికల్ టెక్నాలజీలు**

సర్జరీ, ఎక్కువ ఇంజెక్షన్ల అవసరం లేకుండా చర్మాన్ని బిగుతుగా మార్చేందుకు రేడియో ఫ్రీక్వెన్సీ, మైక్రోనీడ్లింగ్, లేజర్ థెరపీలు ఆదరణ పొందుతున్నాయి. ఇవి చర్మ పునరుద్ధరణ ప్రక్రియను యాక్టివేట్ చేస్తాయి. చర్మంపై సన్నని గీతలు, ముడతలను తొలగించి చర్మాన్ని బిగుతుగా మారుస్తాయి. చర్మ ఆకృతిని మెరుగురుస్తాయి. అయితే వీటిని అర్హత కలిగిన డెర్మటాలజిస్ట్‌ల పర్యవేక్షణలో మాత్రమే చేయించుకో వాలి. సొంత నిర్ణయాలు తీసుకోకూడదు.

**స్కిన్‌కేర్ ప్రొడక్ట్స్**

ఈ మధ్యకాలంలో పెప్టైడ్స్, విటమిన్ ఇ, ఎక్టోయిన్, కోఎంజైమ్-10 వంటి పదార్థాలు ఉన్న స్కిన్‌కేర్ ఉత్పత్తులకు ఆదరణ పెరుగుతుంది. ఇవి చర్మ రక్షణ పొరను బలపరిచి, యాంటీఆక్సిడెంట్ రక్షణ ఇస్తాయి. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. అయితే "బొటాక్స్ ఇన్ ఏ బాటిల్" వంటి ప్రకటనలను పూర్తిగా నమ్మకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం ఏ క్రీమ్ లేదా సీరమ్ కూడా బొటాక్స్ ఎఫెక్ట్‌ను భర్తీ చేయలేవు.

# లోన్ తీసుకున్నవారికి గుడ్‌న్యూస్




**మరోసారి వడ్డీ రేట్ల పెంపు లేదు!**

**ఎంపీసీ భేటీ షురూ..**

**బ్యాంకుల్లో హోమ్ లోన్, వెహికల్ లోన్, పర్సనల్ లోన్స్ వంటివి తీసుకున్న వారికి మరోసారి శుభవార్త అందనుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్య పరపతి విధాన కమిటీ సమావేశంలో ఆగస్టు 3వ తేదీ సోమవారం ప్రారంభమైంది. ఈసారి సైతం కీలక పాలసీ రేట్లను యథాతథంగా కొనసాగించే అవకాశం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులు, ద్రవ్యోల్బణం వంటి అంశాలకు అనుగుణంగా ఈ నిర్ణయాలు ఉంటాయని చెబుతున్నారు. మరి ఆ వివరాలు తెలుసుకుందాం.**

దేశంలోని కోట్లాది మంది రుణ గ్రహీతలకు శుభవార్త. బ్యాంకుల్లో తీసుకునే వివిధ రుణాల వడ్డీ రేట్ల పెంపు ఇప్పట్లో లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. రుణ గ్రహీతలు, బ్యాంకింగ్ రంగం, స్టాక్ మార్కెట్ వర్గాలు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్య పరపతి విధాన కమిటీ సమీక్ష మూడు రోజుల సమావేశాలు ఆగస్టు 3వ తేదీన ప్రారంభమయ్యాయి. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల కమిటీ ఆర్థిక వ్యవస్థలోని హెచ్చుతగ్గులు, ద్రవ్యోల్బణంపై సమగ్రంగా చర్చించనుంది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల్లో హెచ్చుతగ్గులు, రిటైల్ ద్రవ్యోల్బణ సవాళ్లు కొనసాగుతున్న నేపథ్యంలో ఈసారి కూడా ఆర్‌బీఐ రెపో రేటును యథాతథంగా కొనసాగించే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని ఆర్థిక నిపుణులు భావిస్తు న్నారు. అదే జరిగితే రుణాలు తీసుకున్న వారికి మరికొన్నాళ్ల పాటు ఊరట లభించనుంది. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల ప్రభావాన్ని అంచనా వేసేందుకు జూన్ 2026 నెలలో జరిగిన ఎంపీసీ సమావేశంలో వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పులు చేయలేదు. రెపో రేటును 5. 25 శాతం వద్దే స్థిరంగా కొనసాగిస్తున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించింది. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగి దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలకు రెక్కలు వచ్చిన క్రమంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి రిటైల్ ద్రవ్యోల్బణ అంచనాలను సవరించింది. ముందుగా అనుకున్న 4. 6 శాతం నుంచి 5. 1 శాతానికి సవరించింది. అలాగే జీడీపీ వృద్ధి అంచనాలను 6. 9 శాతం నుంచి 6. 6 శాతానికి మార్చింది. ఈ క్రమంలో ఈ ఆగస్టులో జరుగుతున్న భేటీకి ప్రాధాన్యం సంతరించుకుంది. గ్లోబల్ మార్కెట్లో ముడి చమురు ధరల్లో కనిపిస్తున్న అస్థిరత రాబోయే రోజుల్లో దేశీయ ద్రవ్యోల్బణాన్ని పెంచే ప్రమాదం ఉంది. ఆహార పదార్థాల ధరల హెచ్చుతగ్గుల వల్ల ద్రవ్యోల్బణాన్ని ఆర్‌బీఐ నిర్దేశించుకున్న 4 శాతం లక్ష్యానికి లోబడి ఉంచడం ప్రధాన సవాలుగా మారింది. దేశీయ ఆర్థిక వ్యవస్థ స్థిరమైన వృద్ధి సాధిస్తున్నప్పటికీ, గ్లోబల్ మార్కెట్ మందగమనం వల్ల జాగ్రత్తగా అడుగులు వేయాల్సిన పరిస్థితి ఉంది. ఆర్‌బీఐ బెంచ్ మార్క్ రేట్లను మార్చకుండా యథాతథంగా కొనసాగిస్తే బ్యాంకులు తమ హోమ్ లోన్, కార్ లోన్, పర్సనల్ లోన్ వడ్డీ రేట్లను ఇప్పుడే పెంచవు. దీంతో ఈఎంఐల భారం పెరిగే అవకాశం ఉండదు. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై లభించే వడ్డీ రేట్లు ప్రస్తుతం ఉన్న గరిష్ఠ స్థాయిల్లోనే మరికొంత కాలం స్థిరంగా కొనసాగే అవకాశం ఉంది.

మూడు రోజుల సమావేశంలో భాగంగా ఆగస్టు 5వ తేదీన ఎంపీసీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించనున్నారు. వడ్డీ రేట్లలో మార్పు లేకపోయినా, రాబోయే త్రైమాసికాలకు సంబంధించిన ఆర్‌బీఐ వ్యక్తపరిచే ఆర్థిక దృక్పథం మార్కెట్లకు అత్యంత కీలకం కానుంది. ఈ క్రమంలో రుణాలు తీసుకున్న వారితో పాటు స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లు సైతం ఆర్‌బీఐ నిర్ణయాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు.




## పెళ్లిళ్ల సీజన్‌తో
# బంగారానికి మళ్లీ ఫుల్ డిమాండ్



అధిక మాసం ముగియడం, బంగారం ధరలు గరిష్ఠ స్థాయిల నుంచి తగ్గడంతో దేశంలో బంగారు ఆభరణాల కొనుగోళ్లు మళ్లీ పుంజుకుంటున్నాయి. పెళ్లిళ్లు, పండగల సీజన్‌తో జువెల్లరీ షోరూంలలో రద్దీ పెరిగినా, అధిక ధరలు, దిగుమతి సుంకాల ప్రభావం ఇంకా కొనసాగుతోందని విశ్లేషకులు హెచ్చరిస్తు న్నారు. ఈ ఏడాది తొలి అర్ధ భాగంలో బంగారం ధరలు భారీగా పెరగడం, దిగుమతి సుంకాల పెంపు, అధిక మాసం ప్రభావంతో దేశీయంగా బంగారు ఆభరణాల కొనుగోళ్లు గణనీయంగా తగ్గాయి. అయితే జూన్ 15తో అధిక మాసం ముగియడం, పశ్చిమాసియా ఉద్రిక్తతలు తగ్గడంతో బంగారం ధరలు కొంత తగ్గుముఖం పట్టడంతో మళ్లీ వినియోగదారులు జువెల్లరీ షోరూంలకు క్యూ కడుతున్నారు. జోయాలుక్కాస్ గ్రూప్ ఛైర్మన్ డాక్టర్ జోయ్ అలుక్కాస్ ప్రకారం- అధిక మాసం కారణంగా సాధారణంగానే ఆభరణాల కొనుగోళ్లు తగ్గుతాయి. ఈసారి దానికి తోడు బంగారం ధరలు కూడా గరిష్ఠ స్థాయిలకు చేరడం, దిగుమతి సుంకాలు పెరగడంతో డిమాండ్ మరింత బలహీనపడింది. ఢిల్లీలోని స్వస్తిక్ జువెల్స్ వంటి సంస్థలు కూడా ఆ కాలంలో షోరూంలకు వచ్చే వినియోగదారుల సంఖ్య దాదాపు 30 శాతం తగ్గిందని తెలిపాయి. అయితే ప్రస్తుతం మాత్రం పరిస్థితి క్రమంగా మారుతోంది. జూన్ 16 నుంచి ప్రారంభమైన వివాహాల సీజన్, ఆగస్ట్ 15 వరకు కొనసాగే శుభ ముహూర్తాలు, త్వరలో ప్రారంభమయ్యే పండగల సీజన్ కారణంగా బంగారం కొనుగోళ్లు మళ్లీ పెరుగుతున్నాయి. ధనత్రయోదశి కోసం ఇప్పటి నుంచే అడ్వాన్స్ బుకింగ్‌లు కూడా ప్రారంభమైనట్లు వ్యాపారులు చెబుతున్నారు.

**పాత బంగారం ఎక్స్ఛేంజ్**

అయితే ఇక్కడ వినియోగదారుల కొనుగోలు ధోరణిలో మార్పు కనిపిస్తోంది. గతంలో భారీగా కొత్త బంగారం కొనుగోలు చేసిన వారు ఇప్పుడు పాత బంగారాన్ని ఇచ్చి కొత్త నగలు తీసుకునే మార్గాన్ని ఎక్కువగా ఎంచుకుంటున్నారు. దిగుమతి సుంకాల పెంపు తర్వాత పాత బంగారం ఎక్స్ఛేంజ్ లావాదేవీలు 10 శాతం నుంచి 20 శాతం వరకు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. కొన్ని జువెల్లరీ దుకాణాల్లో మొత్తం అమ్మకాల్లో దాదాపు 70 శాతం వరకు పాత బంగారం మార్పిడి ద్వారానే జరుగుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ప్రస్తుతం ఎక్కువ మంది వినియోగదారులు రూ. 60 వేల నుంచి 80 వేల ధరల మధ్య ఉండే నగల్ని ఎంచుకుంటున్నారు. డిజైన్‌తో పాటుగా పెట్టుబడి విలువ కూడా ఉండే ఆభరణాలపై ఆసక్తి పెరిగినట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే మార్కెట్ పూర్తిగా కోలుకుందని చెప్పేందుకు సమయం ఉందని నిపుణులు అంటున్నారు. ఐబీజేఏ ప్రకారం పశ్చిమాసియాలో పరిస్థితులు పూర్తిగా సాధారణ స్థితికి రావడం, బంగారం ధరల్లో స్థిరత్వం ఏర్పడితేనే డిమాండ్ పూర్తిగా పుంజుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. 1.41 లక్షల నుంచి రూ. 1.46 లక్షల మధ్య ఉండగా, గతేడాది ఇదే సమయంలో రూ. 1.05 లక్షల నుంచి రూ. 1.07 లక్షల మధ్య ఉండేది.

# 50 శాతం పడిపోయిన స్టాక్



**ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ రంగానికి చెందిన ప్రముఖ కంపెనీ నర్మదా ఆగ్రోబేస్ లిమిటెడ్ స్టాక్ ఇవాళ ఏకంగా 50 శాతం మేర పడిపోయి ట్రేడింగ్ చేస్తోంది. క్రితం ముగింపు ధర రూ.33 పైన ఉండగా ఇవాళ రూ.16 స్థాయిలో ట్రేడవుతుండడంతో చాలా మంది ఇన్వెస్టర్లు ఆందోళన చెందుతున్నారు. అయితే, అందుకు ఓ ప్రధాన కారణం ఉంది. కంపెనీ చేపట్టిన్న కార్పొరేట్ యాక్షన్ కారణంగా ఈ స్టాక్ ధర భారీగా తగ్గింది. మరి ఆ వివరాలు ఇప్పుడే మనం తెలుసుకుందాం.**

స్మాల్ క్యాప్ కేటగిరీ, ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ రంగానికి చెందిన ప్రముఖ కంపెనీ నర్మదా ఆగ్రోబేస్ లిమిటెడ్ స్టాక్ ఈరోజు ఊహించని విధంగా ట్రేడింగ్ అవుతోంది. క్రితం సెషన్ ముగింపు ధరతో పోలిస్తే 50 శాతం మేర పడిపోయి ట్రేడవుతోంది. జులై 30వ తేదీ ట్రేడింగ్‌లో ఈ స్టాక్ రూ. 33. 50 స్థాయిలో ఉండగా ఈరోజు రూ. 16. 50 స్థాయిలో ట్రేడింగ్ నిర్వహిస్తోంది. దీంతో చాలా మంది ఇన్వెస్టర్లు ఈ స్టాక్ మరింత పడిపోతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. అయితే, ఈ స్టాక్ ధర 50 శాతం మేర తగ్గేందుకు కంపెనీ చేపట్టిన కార్పొరేట్ యాక్షన్ కారణం. నర్మదా ఆగ్రోబేస్ లిమిటెడ్ కంపెనీ బోర్డు ఇటీవలే 1:2 నిష్పత్తిలో స్టాక్ స్ప్లిట్ చేపట్టాలని నిర్ణయించింది. ఇందుకు రికార్డ్ తేదీని జులై 31, 2026గా నిర్ణయించింది. దీని ప్రకారమే ఈ షేర్లు ఎక్స్ స్ప్లిట్ ట్రేడింగ్ నిర్వహించాయి. అందుకే ఈ స్టాక్ ధర స్టాక్ స్ప్లిట్ ప్రకారం సగానికి తగ్గింది. 1 షేరు కాస్త 2 షేర్లుగా మారింది. అందుకు అనుగుణంగా ఈ స్టాక్ ధరను 50 శాతం తగ్గించారని ఇన్వెస్టర్లు గుర్తుంచుకోవాలి. ఆగస్టు 3వ తేదీన సైతం ఈస్టాక్ మరింత పడిపోయింది.

# ఒక్కో రైతు ఖాతాలోకి రూ.2 వేలు



పీఎం కిసాన్ పథకం కింద రైతులకు ఇచ్చే 24వ విడత రూ. 2000 సాయం 2026 అక్టోబరులో విడుదలయ్యే అవకాశం ఉంది. అయితే ఈసారి డబ్బులు పొందాలంటే ఇ- కేవైసీ పూర్తి చేయడం అనేది తప్పనిసరి. అర్హులు ఎవరు, బెనిఫిషియరీ స్టేటస్ ఎలా చెక్ చేసుకోవాలి? ఇ- కేవైసీ ఎలా పూర్తి చేయాలి? ఎవరికి డబ్బులు రాకపోవచ్చు. పూర్తి వివరాల గురించి మనం ఇప్పుడు తెలుసుకుందాం.

**పీఎం కిసాన్ 24వ విడత నిధులు**

రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అద్భుత పథకాల్లో ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన గురించి ప్రధానంగా తెలుసుకోవాలి. ఈ స్కీమ్ కింద అర్హులైన రైతు కుటుంబాలకు ఏడాదికి రూ. 6 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తోంది. దీనిని ఒకేసారి కాకుండా 3 విడతల్లో ప్రతి 4 నెలలకు ఓసారి రూ. 2 వేల చొప్పున అందిస్తుంటుంది. ఎలాంటి మధ్యవర్తితో సంబంధం లేకుండా ఇక్కడ నేరుగా కేంద్రం రైతుల ఆధార్ లింక్డ్ బ్యాంక్ అకౌంట్లోనే డబ్బులు జమ చేస్తుంది. ఇప్పటివరకు 23 విడతల్లో రైతులకు కేంద్రం పీఎం కిసాన్ డబ్బులు అందించింది. చివరిసారిగా 23వ విడత నిధుల్ని 2026, జూన్ 20న కేంద్రం విడుదల చేసింది. ఇప్పుడు 24వ విడత నిధుల్ని అక్టోబరులో విడుదల చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే అధికారిక తేదీని మాత్రం ఇంకా ప్రకటించలేదు.

**బెనిఫిషియరీ స్టేటస్ ఎలా చెక్ చేసుకోవాలి?**

పీఎం కిసాన్ అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లి బెనిఫిషియరీ స్టేటస్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. అనంతరం ఆధార్ నంబర్ లేదా బ్యాంక్ అకౌంట్ నంబర్ ఎంటర్ చేసి గెట్ డేటాపై క్లిక్ చేస్తే లబ్ధిదా రుడి వివరాలు, పేమెంట్ స్టేటస్ కనిపిస్తాయి.

**ఇ- కేవైసీ తప్పనిసరి**

పీఎం కిసాన్ స్కీమ్ బెనిఫిట్స్ అసలైన రైతులకే చేరేలా కేంద్ర ప్రభుత్వం ఇ- కేవైసీని తప్పనిసరి చేసింది. ప్రస్తుతం 3 పద్ధతుల్లో కేవైసీ పూర్తి చేసేందుకు వీలుంటుంది. ఓటీపీ ఆధారిత ఇ-కేవైసీని పీఎం కిసాన్ అధికారిక పోర్టల్ ద్వారా చేయొచ్చు. బయోమెట్రిక్ బేస్డ్ ఇ- కేవైసీని కామన్ సర్వీస్ సెంటర్లు లేదా మీసేవా కేంద్రాల్లో చేసుకోవచ్చు. పీఎం కిసాన్ మొబైల్ యాప్ ద్వారా ఫేస్ అథెంటికేషన్‌తో ఇ- కేవైసీ పూర్తి చేయొచ్చు. కొన్ని సందర్భాల్లో ప్రభుత్వం పీఎం కిసాన్ చెల్లింపుల్ని తాత్కాలికంగా నిలిపివేస్తుంది. 2019 ఫిబ్రవరి 1 తర్వాత భూమి కొనుగోలు చేసిన వారు, అలాగే ఒకే కుటుంబంలో భార్య, భర్త లేదా ఇతర కుటుంబ సభ్యులు ప్రయోజనాల్ని పొందుతున్నట్లు గుర్తించిన కేసుల్లో డబ్బులు రావు.

## ప్రజావాణి దరఖాస్తులను జాప్యం లేకుండా పరిష్కరించండి


జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఆదేశం



మేడ్చల్ కలెక్టరేట్, ఆగస్టు 3 (నినాదం): ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి (128) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని అదనపు కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



వికారాబాద్, ఆగస్టు 3 (నినాదం): ప్రభుత్వం ప్రజల సమస్యలను త్వరిత గతిన పరిష్కరించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ హాలు లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వినతులు, ఫిర్యాదులను సమస్యలను అధికారులకు విన్నవించారు. ఈ వేదికలో 110 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. పెన్షన్, భూ సమస్యలు, గ్రామ పంచాయతీ, ఇందిరమ్మ ఇండ్లు, గురుకులాలు, సంబంధిత శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల నుండి అందిన వినతులను స్వీకరించి, వాటిని సంబంధిత శాఖలకు పంపిస్తూ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రజల సమస్యలను పెండింగ్ ఉంచకుండా పారదర్శకంగా, వేగవంతంగా పరిష్కరించాలని, ప్రతి వినతిని పరిశీలించి అర్హత మేరకు చర్యలు తీసుకోవాలని, శాఖల వారీగా పెండింగ్ ఉన్న వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటరావు, ట్రైని కలెక్టర్ సచిన్ బన్సాల్ గుట్టుర్, ఆర్ డి ఓ, డి ఆర్ డి ఓ శ్రీనివాస్, జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

కలెక్టరేట్ ప్రజావాణిలో 48 వినతులు స్వీకరణ

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 03 (నినాదం): ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదు, వినతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్దిష్ట రిమార్కులతో సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండుతో కలిసి ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో అందిన ప్రతి వినతిని వాస్తవ పరిస్థితుల ఆధారంగా క్షుణ్ణంగా పరిశీలించి, స్పష్టమైన నివేదికలు, నిర్దిష్ట రిమార్కులతో నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. నేటి ప్రజావాణిలో జిల్లావ్యాప్తంగా మొత్తం 67 ఫిర్యాదులు, వినతులు అందాయని తెలిపారు. వీటిలో కలెక్టరేట్‌లో 48, సంగారెడ్డి డివిజన్‌లో 8, జహీరాబాద్ డివిజన్‌లో 7, నారాయణఖేడ్ డివిజన్‌లో 4 వినతులు అందగా, ఆందోల్ డివిజన్‌లో ఎలాంటి ఫిర్యాదులు నమోదు కాలేదని పేర్కొన్నారు. అందిన వినతులు ప్రధానంగా రెవెన్యూ, హౌసింగ్, పెన్షన్లు, ఈజీఎస్ (పంచాయతీరాజ్), పంచాయతీరాజ్, నీటిపారుదల, కాలుష్య నియంత్రణ మండలి, కార్మిక, విద్య, ఆర్టీసీ, ఉపాధి కల్పన, మహిళా మరియు శిశు సంక్షేమం, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖలకు సంబంధించినవని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంగారెడ్డి ఆర్డీఓ, కలెక్టరేట్ విభాగాల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధే ధ్యేయం.. ప్రజా సేవే లక్ష్యం

రెండు కోట్ల సీసీ రోడ్ల పనులు ప్రారంభించిన కూన శ్రీశైలం గౌడ్



కుత్బుల్లాపూర్, ఆగస్టు 3 (నినాదం): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం సర్కిల్, మహదేవపురం డివిజన్‌లోని బతుకమ్మ బండ ప్రాంతంలో రూ. 80 లక్షల వ్యయంతో, అలాగే జగద్గిరిగుట్టలో రూ. 1.20 కోట్ల వ్యయంతో మంజూరైన మొత్తం 2 కోట్ల విలువైన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కుత్బుల్లాపూర్ మొట్టమొదటి ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక ప్రజలు వాసులు రోడ్ల సౌకర్యం లేకపోవడంతో ప్రతి వర్షాకాలంలో వర్షపు నీరు ఇళ్లలోకి చేరి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. గత 10 సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గంలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు జరగలేదని ఆయన విమర్శించారు. ప్రస్తుతం గెలిచిన ఎమ్మెల్యే ఎమ్మెల్యే ఆర్భాటం చేస్తూ సోషల్ మీడియాలో యాక్టింగ్ చేయడం తప్ప అభివృద్ధిపై దృష్టి సారించకుండా ఎంతసేపు ప్రభుత్వం వద్ద నిధులు లేవంటూ ప్రభుత్వాన్ని బద్నాం చేస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రజల అవసరాలను అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంలో సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రి శ్రీధర్ బాబుకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఉచిత విద్యుత్, ఉచిత బస్సు, సన్న బియ్యం, పంట పథకాలు ప్రభుత్వం అమలు పరుస్తుందని తెలిపారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి మరింత అభివృద్ధికి దోహదపడాలని స్థానికులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ తో పాటు స్థానిక నాయకులు బుచ్చిరెడ్డి, కౌశిక్, పూలమ్మ ప్రసాద్, నరేందర్ రెడ్డి, జమీల్ పాషా, పరమేశ్వర్ వంతులు, సంగయ్య, మహేష్ రెడ్డి, రాములు, జబ్బార్, రసూల్, ముక్తార్ ఖాన్ సలీం, తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- అన్ని శాఖల సమన్వయంతో వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్







సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 03 (నినాదం): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జాతీయ స్ఫూర్తిని ప్రతిబింబించేలా, పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఆగస్టు 15న పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే జిల్లా స్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు. వేదిక, అతిథుల సిటింగ్, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, తదితర అంశాల్లో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించేలా సమగ్ర ప్రగతి నివేదికను సిద్ధం చేయాలని జిల్లా ప్రణాళికాధికారికి కలెక్టర్ ఆదేశించారు. ప్రోటోకాల్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ ప్రజాప్రతినిధులు, విశిష్ట అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. జాతీయ భావనను పెంపొందించేలా విద్యార్థులతో దేశభక్తిని చాటే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని విద్యాశాఖ, సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రశంసా పత్రాల బహూకరణ కోసం శాఖల వారీగా ఉత్తమ ఉద్యోగుల వివరాలతో కూడిన ప్రతిపాదనలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బోనాల పండుగ సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి

జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ శంకర్ సింగ్‌కు వినతిపత్రం అందజేత



కుత్బుల్లాపూర్, ఆగస్టు 3 (నినాదం): రానున్న బోనాల పండుగ సందర్భంగా జీడిమెట్ల సర్కిల్ 286, 287 డివిజన్లలోని దేవాలయాల వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించి ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వి. నరేందర్ రెడ్డి ప్రజావాణి కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ శంకర్ సింగ్ కు వినతిపత్రం సమర్పించారు. ప్రజావాణి సందర్భంగా వి. నరేందర్ రెడ్డి చేసిన ప్రధాన డిమాండ్లలో దేవాలయాల పరిసరాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలి. చెత్త పేరుకుపోకుండా ప్రత్యేక పారిశుద్ధ్య సిబ్బందిని నియమించాలి, భక్తులకు స్వచ్ఛ మైన తాగునీటి సౌకర్యం కల్పించాలి, అన్ని వీధి దీపాలు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు చేయాలి. డ్రైనేజీలను పూర్తిగా శుభ్రపరిచి బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయాలి. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ఏర్పాట్లు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని వివరించారు. ఈ సందర్భంగా వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. పండుగ సందర్భంగా వేలాది మంది భక్తులు దేవాలయాలను సందర్శించే నేపథ్యంలో అధికారులు ముందస్తు ప్రణాళికతో పనిచేసి పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ వెలుగులు, డ్రైనేజీ నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణతో పాటు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను సమర్థవంతంగా కల్పించాలని కోరారు. భక్తుల భద్రత, సౌకర్యాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ వినతి పత్రం సమర్పించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆటో బలరాం, రామచంద్ర రెడ్డి, రామ్మోహన్, వెంకటేష్ బాబు తదితరులు పాల్గొని, బోనాల పండుగ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు తక్షణమే ప్రత్యేక చర్యలు చేపట్టి అన్ని సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రతి శిశువుకు తొలి ఆహారం తల్లిపాలే

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తల్లిపాల ప్రాధాన్యతను ప్రతి కుటుంబం గుర్తించాలి

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 3 (నినాదం): శిశువు ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తల్లిపాలు అత్యంత విలువైన పోషకాహారమని, పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు పట్టించడం ద్వారా అనేక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించే పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శిశువు పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలను శిశువుకు తప్పనిసరిగా అందించాలని తెలిపారు. అవి శిశువుకు సహజ రోగనిరోధక శక్తిని పెంపొందించి, ఆరోగ్యకరమైన ఎదుగుదలకు బలమైన పునాది వేస్తాయని అన్నారు. తల్లి-శిశువు మధ్య బంధం మరింత బలపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జ్యోతి, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి లలిత కుమారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితా దేవి, జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, ఆర్డీఓ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## యుజిడి పనులు ప్రారంభించిన కొలను హనుమంత రెడ్డి



కుత్బుల్లాపూర్, ఆగస్టు 3 (నినాదం): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ గ్రామం, 296వ డివిజన్‌లో ఉన్న డ్రైనేజీ, మౌలిక సదుపాయాల సమస్యలను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి రాగా, ఆయన ప్రత్యేక చొరవతో సీఎంఏ నిధుల నుంచి రూ. 70 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో దుండిగల్ గ్రామంలో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యు జి డి) అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు జక్కుల మల్లేష్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు అవారం యుత్యం రెడ్డి, మాజీ సర్పంచ్ కావలి గణేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆకుల ప్రేమ్ కుమార్ పటేల్, కావలి శశి కుమార్, ఆకుల మధు, చిన్న ముత్యం రెడ్డి, చిక్కులి రెడ్డి, ఉదయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ కరాటే పోటీల్లో దుబ్బాక విద్యార్థుల సత్తా

- రెండు స్వర్ణాలు, ఆరు రజతాలు, మూడు కాంస్య పతకాలతో మెరిసిన విద్యార్థులు



దుబ్బాక, ఆగస్టు 3 (నినాదం): అంతర్జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్‌లో సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణానికి చెందిన విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి రెండు స్వర్ణ, ఆరు రజత, మూడు కాంస్య పతకాలు సాధించి జిల్లా ఖ్యాతిని అంతర్జాతీయ వేదికపై చాటారు. ఈ విషయాన్ని యువ స్పోర్ట్స్ కరాటే అకాడమీ తెలంగాణ వ్యవస్థాపకులు, కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్ తెలిపారు. హైదరాబాద్‌లోని ఎల్బీనగర్, వనస్థలిపురం లక్ష్మీ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన రెండో అంతర్జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్‌లో భారత్, భూటాన్, నేపాల్, శ్రీలంక, మలేషియా సహా సుమారు 30 దేశాలకు చెందిన 3,000 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో దుబ్బాకకు చెందిన తొమ్మిది మంది విద్యార్థులు పలు విభాగాల్లో పతకాలు సాధించి ప్రతిభ చాటారు. లచ్చపేట ఆదర్శ పాఠశాలకు చెందిన హర్షవర్ధన్ కట విభాగంలో స్వర్ణ పతకం, కుమిటే విభాగంలో రజత పతకం సాధించగా, సరస్వతి గ్లోబల్ స్కూల్‌కు చెందిన రిత్విక స్వర్ణ పతకం, శర్విత రజత పతకం గెలుచుకున్నారు. మాస్టర్ మైండ్ స్కూల్ విద్యార్థులు రిషి, అఖిల్, సర్వజ్ఞ రజత పతకాలు, ప్రణవి, సాత్విక్ కాంస్య పతకాలు సాధించారు. గాయత్రి వివేకానంద విద్యాలయానికి చెందిన మనస్విని కట విభాగంలో రజతం, కుమిటే విభాగంలో కాంస్య పతకం గెలుచుకోగా, దిశా స్కూల్ విద్యార్థి ఆరాధ్ రజత పతకం సాధించాడు. విజేతలను ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ బుచ్చిబాబు, సరస్వతి గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, మాస్టర్ మైండ్ స్కూల్ ప్రిన్సిపాల్ హరిబాబు, దిశా స్కూల్ ప్రిన్సిపాల్ కమలాకర్, యాదగిరి, గాయత్రి వివేకానంద విద్యాలయం ప్రిన్సిపాల్ భాస్కర్ రెడ్డి, యువ స్పోర్ట్స్ కరాటే అకాడమీ తెలంగాణ ఫౌండర్ అండ్ డైరెక్టర్ బురాని శ్రీకాంత్, రేంజికి షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఇండియా వ్యవస్థాపకులు మాస్టర్ నగేష్, జనరల్ సెక్రటరీ నవీన్ కుమార్, షైరోయ్ షోటోకాన్ కరాటే అకాడమీ ఫౌండర్ సురేందర్ సుబ్బు, కిక్కర్స్ అకాడమీ ఫౌండర్ నాగరాజు, షీ టీమ్ లక్ష్మీ సాహిత్యం తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా బురాని శ్రీకాంత్ మాట్లాడుతూ, దుబ్బాక విద్యార్థులు అంతర్జాతీయ వేదికపై సాధించిన విజయం ప్రతి ఒక్కరికీ గర్వకారణమని, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయి పోటీల్లో రాణించేందుకు అకాడమీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

## రాంపల్లి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి సీతక్క

స్వాగతం పలికిన నాగారం కాంగ్రెస్ నాయకులు



కీసర, జూలై 3, (నినాదం): ఘట్కేసర్ సర్కిల్, నాగారం డివిజన్ పరిధిలోని రాంపల్లిలో నిర్వహించిన మహంకాళి బోనాల మహోత్సవాల్లో తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు అనిల్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కందాడి అంజిరెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క కి, అనిల్ రెడ్డికి, కందాడి అంజిరెడ్డికి నాగారం డివిజన్ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ మైపాల్ రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఇందిరా శోభన్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు సంధ్యా రెడ్డి, నాగారం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భూపయ్య యాదవ్, మాజీ ఎంపీటీసీ కిరణ్‌జ్యోతి, ప్రవీణ్ కుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షులు పంగా సంతోష్, ఓం ప్రకాష్ గౌడ్, పొట్ల శ్రీకాంత్, పొట్ల వెర్నేష్, పొట్ల విష్ణు, పంగా శ్రీహరి, రవి గారు తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేర్ హాస్పిటల్స్ సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బాలా
- మలక్‌పేట్‌లో అత్యాధునిక మెడికల్ ఐసీయూ ప్రారంభించిన కేర్ హాస్పిటల్స్



ఎల్బీనగర్, ఆగస్టు 3, (నినాదం): తెలంగాణ ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో పెట్టుకుని కేర్ హాస్పిటల్స్ నిరంతరం ఆధునిక వైద్య మౌలిక సదుపాయాలపై పెట్టుబడులు పెట్టడం అభినందనీయం అని మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బాలా అన్నారు. సోమవారం మలక్‌పేట్ కేర్ హాస్పిటల్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అత్యాధునిక మెడికల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌ను ఎమ్మెల్యే బాలా ముఖ్య అతిథిగా హాజరై ఆస్టర్ డీఎం క్వాలిటీ కేర్ లిమిటెడ్ సీఈఓ డా. పవన్ కుమార్, రీజనల్ సీఈఓ నీలేష్ గుప్తా, కేర్ హాస్పిటల్స్, మలక్‌పేట్ సీఓఓ ప్రవీణ్ కుమార్ ఎడ్ల, అజంపుర కార్పొరేటర్ షేక్ మొహియుద్దీన్ అబ్రార్, మెడికల్ సూపరింటెండెంట్ డా. శ్రీధర్, డాక్టర్ వజ్రప్ప రాజేంద్ర, సీనియర్ కన్సల్టెంట్, హెచ్ఓడీ – క్రిటికల్ కేర్, సీనియర్ వైద్యులు, ఆస్పత్రి సిబ్బందితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బాలా మాట్లాడుతూ, "వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాలకు నాణ్యమైన వైద్య మౌలిక సదుపాయాలు ఎంతో అవసరం. కేర్ హాస్పిటల్స్, మలక్‌పేట్‌లో ప్రారంభమైన ఈ అత్యాధునిక ఎంఐసీయూ అత్యవసర, క్రిటికల్ కేర్ సేవలను మరింత బలోపేతం చేస్తుంది. ఇంటెన్సివ్ కేర్‌లో అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉండటం ప్రాణాలను కాపాడే విషయంలో కీలకంగా మారుతున్నాయి. రాబోయే రోజుల్లో కూడా రోగులకు తక్షణ వైద్యం ఇంకా మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ముందుకు సాగాలని సూచించారు. అనంతరం డీఎం క్వాలిటీ కేర్ లిమిటెడ్ సీఈఓ డా. పవన్ కుమార్, రీజనల్ సీఈఓ నీలేష్ గుప్తా, కేర్ హాస్పిటల్స్, మలక్‌పేట్ సీఓఓ ప్రవీణ్ కుమార్ ఎడ్లలు మాట్లాడుతూ రోగులకు తక్షణ చికిత్స, నిరంతర పర్యవేక్షణ, వివిధ విభాగాల వైద్యుల సమన్వయంతో చికిత్స అందించేందుకు ఈ ఎంఐసీయూను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రతి నిమిషం ఎంతో కీలకమని వైద్యులు పేర్కొన్నారు. 24 గంటల పాటు సేవలందించేలా ఏర్పాటు చేసిన ఈ ఎంఐసీయూలో అత్యాధునిక పేషెంట్ మానిటరింగ్ వ్యవస్థలు, లైఫ్ సపోర్ట్ పరికరాలు, ఆధునిక క్రిటికల్ కేర్ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. అనుభవజ్ఞులైన ఇంటెన్సివిస్టులు, స్పెషలిస్ట్ వైద్యులు, శిక్షణ పొందిన క్రిటికల్ కేర్ నర్సులు, బహుళ విభాగాల వైద్య బృందం కలిసి క్లిష్టమైన అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేలా ఈ యూనిట్‌ను రూపొందించారు. కేర్ హాస్పిటల్స్ నెట్‌వర్క్‌లో క్రిటికల్ కేర్ సేవలను మరింత బలోపేతం చేసే వ్యూహంలో భాగంగానే ఈ ఆధునిక ఎంఐసీయూను ఏర్పాటు చేసినట్లు ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది. ఆధునిక సాంకేతికత, వైద్య మౌలిక సదుపాయాలు, నిపుణులైన వైద్య బృందంతో అత్యవసర, క్లిష్ట వైద్య సేవలను మరింత సమర్థవంతంగా అందిస్తూ, ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను చేరువ చేయడంలో కేర్ హాస్పిటల్స్ తన నిబద్ధతను కొనసాగిస్తోందని తెలిపారు.

## మతిస్థిమితం లేని యువకుడు అదృశ్యం



జవహర్ నగర్, ఆగస్టు 3 (నినాదం): మతిస్థిమితం లేని యువకుడు అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్ఓ సైదులు తెలిపిన కథనం ప్రకారం... జవహర్ నగర్ అంబేద్కర్ నగర్‌లో రమావాత్, ధనలక్ష్మి దంపతులు పిల్లలతో కలిసి నివసిస్తున్నారు. రమావాత్ కుమారుడు అఖిల్ (24) చిన్న నాటి నుంచే బుద్ధిమాంద్యంతో పెరిగినాడు. ఈ క్రమంలో జూలై 26న అఖిల్ ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్ళి ఇంత వరకు తిరిగి రాలేదు. దీంతో అతని ఆచూకీ కోసం చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికిన సమాచారం లభించలేదు. ఈ మేరకు కుటుంబసభ్యులు జవహర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## పటాన్‌చెరు, గాంధారి ఆసుపత్రుల సమస్యలను పరిష్కరించాలి

- ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రికి వినతిపత్రం అందజేత



పటాన్చెరు, ఆగస్టు 03 (నినాదం): సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు ఆసుపత్రి ప్రారంభంతో పాటు, కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని గాంధారి ఆసుపత్రి అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి, వైద్య రంగానికి సంబంధించిన పలు కీలక అంశాలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల ప్రజల ఆరోగ్య అవసరాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో నూతనంగా నిర్మించిన ఆసుపత్రిని తక్షణమే ప్రారంభించి స్థానిక ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తేవాలని కోరారు. అలాగే కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని గాంధారి ఆసుపత్రికి శాశ్వత ప్రాతిపదికన నూతన భవన నిర్మాణం చేపట్టడంతో పాటు, రోగుల రద్దీకి తగ్గట్టుగా డాక్టర్లు, పారామెడికల్ సిబ్బందిని నియమించాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 104 ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను సానుకూలంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్సీ లేవనెత్తిన ప్రతి అంశాన్ని మంత్రి సానుకూలంగా పరిశీలించారని, త్వరలోనే సంబంధిత అధికారులతో సమీక్షించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు అంజిరెడ్డి తెలిపారు.

భూభారతి ఫీల్డ్ టెక్నికల్ సిబ్బంది

## తొలగింపు ప్రతిపాదన విరమించాలి

18 మంది సిబ్బందికి విధుల కొనసాగింపు
15 నెలల పెండింగ్ వేతనాల విడుదల కోరుతూ ప్రభుత్వానికి విజ్ఞప్తి



**కరీంనగర్, ఆగస్టు 3(నినాదం):** కరీంనగర్ జిల్లాలోని వివిధ తహసీల్దార్ కార్యాలయాల్లో 2018 నుంచి సేవలందిస్తున్న భూభారతి క్షేత్ర సాంకేతిక సిబ్బంది తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో పనిచేస్తున్న 18 మంది సిబ్బందిలో ఏడుగురిని విధుల నుంచి తొలగించే ప్రతిపాదనపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. గత ఎనిమిదేళ్లుగా భూ రికార్డుల నవీకరణ, రిజిస్ట్రేషన్ ప్రక్రియలు, తహసీల్దార్ కార్యాలయాల్లో సాంకేతిక సేవలు అందిస్తూ అనుభవాన్ని సంపాదించిన తమను పక్కనపెట్టి, ఆ బాధ్యతలు జూనియర్ అసిస్టెంట్లకు అప్పగించేందుకు శిక్షణ ఇస్తున్నారని వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. ఉద్యోగాల తొలగింపు అమలైతే తమ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. అలాగే గత 15 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. గత ఎనిమిదేళ్లుగా భూ సేవల్లో కీలక పాత్ర పోషిస్తున్న తమను విధుల నుంచి తొలగించే నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని, 18 మంది క్షేత్ర సాంకేతిక సిబ్బందిని యథావిధిగా కొనసాగిస్తూ, పెండింగ్ వేతనాలను చెల్లించాలని తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి, జిల్లా యంత్రాంగాన్ని సిబ్బంది విజ్ఞప్తి చేశారు.

# అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల ఉక్కుపాదం

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు
అనుమానిత వ్యక్తులపై ప్రత్యేక నిఘా
హుజురాబాద్ ఏసీపీ వనంశెట్టి మాధవి
మానేరు పరివాహక ప్రాంతాల గ్రామాల్లో కార్డన్ సెర్చ్





**జమ్మికుంట, ఆగస్టు 3 (నినాదం):** జమ్మికుంట మండలంలోని మానేరు పరివాహక ప్రాంతాలైన విలాసాగర్ వావిలాల గండ్రపల్లి గ్రామాలలో సోమవారం ఉదయం హుజురాబాద్ సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కరీంనగర్ సీపీ గౌస్ ఆలం ఆదేశాల మేరకు హుజురాబాద్ ఏసీపీ మాధవి ఆధ్వర్యంలో జమ్మికుంట మండలంలోని విలాసాగర్ వావిలాల గండ్రపల్లి గ్రామాలలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. మండలంలోని వావిలాల, గండ్రపల్లి విలాసాగర్ గ్రామాలలో డివిజన్ స్థాయి పోలీసులతో పాటు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రత్యేక పోలీస్ బలగాలతో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం సోమవారం ఉదయం వేళ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మూడు గ్రామాలలో ఉన్న అక్రమ ఇసుక నిలువలను పరిశీలించడం తోపాటు అనుమతి లేని 29 ద్విచక్ర వాహనాలను పట్టుకొని జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాధవి మాట్లాడుతూ గ్రామాలలో అక్రమ ఇసుక నిల్వలు ఉంచినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని విలాసాగర్ గ్రామంలో అక్రమ ఇసుక నిలువలు ఎక్కువగా ఉన్నాయని, పలుమార్లు కేసులు చేసి జరిమానాలు విధించినప్పటికీ మార్పు రావడంలేదని ఇకనుండి రెండుసార్లు కేసులు అయినట్లయితే ట్రాక్టర్లను ఇవ్వడం జరగదని ఆమె పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామాలను కొత్త వ్యక్తుల సంచారం ఉన్నట్లయితే వెంటనే పోలీసులకు సమాచారాన్ని అందించాలని శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు పోలీస్ శాఖకు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట పట్టణ సిఐ రామకృష్ణ గౌడ్ హుజురాబాద్ సిఐ కరుణాకర్ తో పాటు సబ్ డివిజన్ పరిధిలోని పలువురు ఎస్ఐలు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాశ్మీర్‌గడ్డలో కమ్యూనిటీ హాల్

## నిర్మాణానికి మరో ముందడుగు

స్లాబ్ నిర్మాణ పనులను ప్రారంభించిన డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు



**కరీంనగర్, ఆగస్టు 3(నినాదం):** కరీంనగర్‌లోని కాశ్మీర్‌గడ్డలో నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హాల్ స్లాబ్ పనులను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో కమ్యూనిటీ హాల్ లేకపోవడంతో స్థానికులు శుభకార్యాలు, సామాజిక కార్యక్రమాల నిర్వహణలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తయితే ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ప్రజలకు సౌకర్యవంతమైన వేదిక అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఓం ప్రకాష్, గట్టు స్వామి, ఖాలీద్‌తో పాటు స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రుల ఆశయాలు సాకారం చేయాలి

వోపా సేవలు అభినందనీయం: మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్





**జమ్మికుంట, ఆగస్టు 3 (నినాదం):** విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చడం తోపాటు వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ అన్నారు. జమ్మికుంట పట్టణ పరిధిలోని స్థానిక వినాయక గార్డెన్స్ లో విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ వోపా హుజురాబాద్ నియోజకవర్గం సభ అధ్యక్షులు కట్ట నాగభూషణ చారి ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ ఎస్ఎస్సి, ఇంటర్ విద్యార్థినీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించారు. ఇంటర్మీడియట్ లో ప్రతిభ కనబరిచిన ఏడుగురు విద్యార్థులతో పాటు పదో తరగతి లో ప్రతిభ కనబరిచిన 17 మంది విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేశారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ, విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. ఇప్పుడు కష్టపడి చదువుకుంటే భవిష్యత్తు బాగుంటుందని ఉన్నతమైన విద్యను అభ్యసించిన విద్యార్థులు భవిష్యత్తులో అగ్రస్థానంలో నిలబడతారని చదువుకు మించిన ఆస్తి లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొని పురస్కారాలు అందించిన అనంతరం రాష్ట్ర వోపా కన్వీనర్ వేములవాడ ద్రోణా చారి, కో కన్వీనర్ కట్ట విష్ణువర్ధన్ తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ ప్రాథమిక సహకార సంఘాల అభివృద్ధి రాష్ట్ర కోశాధికారి కాసుల కిరణ్ కుమార్, జిల్లా అధ్యక్షులు గద్దె సత్యనారాయణ, మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్, 28వ వార్డు కౌన్సిలర్ ఒగ్గు రమేష్, 8వ వార్డు కౌన్సిలర్ సురేష్ ఉపాధ్యక్షులు వ్యాఖ్యాత మామిడోజు సదానంద చారి మాట్లాడుతూ వోపా విశ్వబ్రాహ్మణ విద్యార్థిని విద్యార్థులకు గుర్తించి పురస్కారాలు అందించడం మంచి శుభ సూచకం ఇలా చిన్న కుటుంబాల నుండి ఆణిముత్యాలను వెలికి తీసి ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సహించి వారు వచ్చే తరానికి దిక్సూచిగా నిలిచేందుకు ప్రోత్సహించి ముందుకు సాగేలా చేయడం ఆనందించదగ్గ విషయం అన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లల చదువులు గుర్తించి ఉన్నత చదువులు చదువుకునేలా ప్రోత్సహించగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు డాక్టర్ విజయగిరి తులసిదాస్, ఉపాధ్యక్షులు తాటికొండ భద్రాచారి, కోశాధికారి రంగు ప్రశాంత్ జూపాక శ్రీనివాస్ ఉమ్మడి సురాచారి, కటుకోజ్వల సదానందం, శ్రీరామోజు మహేంద్ర చారి తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచొద్దు

నిర్ణీత గడువులో పరిష్కారమే అధికారుల లక్ష్యం కావాలి:
అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి



**కరీంనగర్, ఆగస్టు 3(నినాదం):** ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభామందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, రెవెన్యూ విభాగాధి కారి షర్మిల, జిల్లా రెవెన్యూ అధికారి స్వామితో కలిసి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 212 దరఖాస్తులు అందగా, అత్యధికంగా కరీంనగర్ రెవెన్యూ విభాగాధికారి కార్యాలయానికి 66, గృహ నిర్మాణ శాఖకు 44 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణి దరఖాస్తులతో పాటు న్యాయస్థానాలకు సంబంధించిన కేసులను కూడా అనవసరంగా పెండింగ్‌లో ఉంచకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. ప్రజలకు సత్వర న్యాయం అందేలా ప్రతి శాఖ బాధ్యతాయుతంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు.

## కట్టరాంపూర్ ప్రధాన రహదారికి మరమ్మతులు

వర్షాలతో దెబ్బతిన్న రోడ్డును సవరించి ప్రజలకు ఉపశమనం: కార్పొరేటర్ ఆకుల నర్మదా నర్సన్న



**కరీంనగర్, ఆగస్టు 3(నినాదం):** కట్టరాంపూర్ ప్రధాన రహదారి ఇటీవల కురిసిన వర్షాల కారణంగా గుంతలమయంగా మారి ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో 11వ డివిజన్ కార్పొరేటర్ ఆకుల నర్మదా-నర్సన్న చొరవతో రహదారికి మరమ్మతులు చేపట్టించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఆకుల నర్మదా--నర్సన్న మాట్లాడుతూ, డివిజన్‌లో ప్రజలకు సంబంధించిన ఏ సమస్యనైనా తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. 11వ డివిజన్ సమగ్ర అభివృద్ధే తమ లక్ష్యమని, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

# జమ్మికుంటలో వెలమ కులస్తుల ఆత్మీయ సమ్మేళనం

నూతనంగా ఎన్నికైన వెలమ ప్రజాప్రతినిధులకు ఘన సన్మానం



**జమ్మికుంట ఆగస్టు 3 (నినాదం):** జమ్మికుంట పట్టణంలోని వినాయక గార్డెన్స్‌లో సోమవారం మండలంలోని వెలమ కులస్తుల ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో వెలమ సామాజిక వర్గానికి చెందిన ప్రముఖులు, యువకులు, ప్రజాప్రతినిధులు హాజరై పరస్పరం ఆత్మీయంగా కలుసుకున్నారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్‌గా విజయం సాధించి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడిగా ఎన్నికైన మడికొండ సురేందర్‌రావు, పోల్సాని వేణురావు, పోల్నేని వేణురావులను ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. మడికొండ సురేందర్ రావు మాట్లాడుతూ సమాజ అభివృద్ధి, యువతలో ఐక్యత, విద్య, ఉపాధి అవకాశాల పెంపు, సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వెలమ కులస్తుల మధ్య పరస్పర సహకారం మరింత బలోపేతం కావడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలను తరచూ నిర్వహించాలని అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు

## వెంటనే విడుదల చేయాలి

అన్ని వర్గాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని
ప్రభుత్వానికి ప్రజా సంఘాల జేఏసీ డిమాండ్
ప్రజా సంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు



**కరీంనగర్, ఆగస్టు 3(నినాదం):** రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమ లు చేసి, పెండింగ్‌లో ఉన్న రూ. 10 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని ప్రజా సంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్‌లో ప్రజా సంఘాల నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలలో జాప్యం కారణంగా కళాశాలలు విద్యార్థులకు ధ్రువపత్రాలు ఇవ్వక పోవడంతో వారు ఉన్నత విద్య, ఉద్యోగ దరఖాస్తుల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గతంలో అమలు చేసిన విధానంలోనే ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులు విడుదల చేయాలని, మెస్ చార్జీలను పెం చాలని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడి వెంటనే చర్యలు తీసుకోవాలని, లేకపోతే ప్రజల ఆగ్రహాన్ని ఎదు ర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో అందెం రమణారెడ్డి, దడిగల వెంకటేశ్వర్‌రావు, ల్యాగల వీరారెడ్డి, అంచూరి సదానందం, విక్రమ్ సింహారావు తదితర నాయకులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

వాకర్ల సంక్షేమం, మెరుగైన సౌకర్యాలే ప్రధాన లక్ష్యమని నూతన కమిటీ సంకల్పం



**కరీంనగర్, ఆగస్టు3(నినాదం):** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ బలోపేతం, వాకర్ల ఆరోగ్య చైతన్యం పెంపు, స్టేడియంలో మెరుగైన సౌకర్యాల కల్పన కోసం సమిష్టిగా కృషి చేయాలని నూతన కార్యవర్గ సభ్యులు నిర్ణయించారు. నూతన అధ్యక్షుడిగా కేంసారం, ప్రధాన కార్యదర్శిగా పూసాల సంపత్, కోశాధికారిగా వోల్లాల శ్రీనివాస్ గౌడ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా దాసరి అశోక్, కుమార్ మహర్షి, సంపత్, కర్ర సత్యం, పెద్ది శ్రీనివాస్, మిరియాల శ్రీధర్ రెడ్డి, తోట శ్రీనివాస్ ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా నాగవెల్లి ప్రతాప్ రెడ్డి, పొన్నం రాజు గౌడ్, తోడుపునూరి శ్రీనివాస్ ఎన్నిక కాగా, గౌరవాధ్యక్షులుగా కన్నం శ్రీనివాస్, చాడ రవీందర్ రెడ్డి నియమితులయ్యారు. గౌరవ సలహాదారులుగా తిరుపురం సత్తయ్య, పెంచాల కిషన్ రావు, తోట శ్రీనివాస్, మిర్యాల శ్రీధర్ రెడ్డి, తోడుపునూరి శ్రీనివాస్, గుంటపల్లి స్వామి, జంగళ్లపల్లి కుమార్, నిర్వహణ కార్యదర్శులుగా చెన్నడి రవీందర్ రెడ్డి, బురగోని శ్రీనివాస్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

## అల్ఫోర్స్ ఈ-టెక్నోలో ఎన్సీసీ క్యాడెట్లతో హరితహారం

చెట్ల పెంపకమే పర్యావరణ పరిరక్షణకు, దేశాభివృద్ధికి బాట: అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి




**కరీంనగర్, ఆగస్టు3(నినాదం):** అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో జాతీయ విద్యార్థి దళం (ఎన్సీసీ) క్యాడెట్ల ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించి పెద్ద చెట్లుగా తీర్చిదిద్దడం ప్రతి క్యాడెట్ ప్రాథమిక బాధ్యత అని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు. చెట్లు మానవాళికి అమూల్యమైన వరమని, వాటి పెంపకం ద్వారా కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని పేర్కొన్నారు. క్రమశిక్షణ, సేవాభావం, సామాజిక బాధ్యతలకు ప్రతీకలైన ఎన్సీసీ క్యాడెట్లు హరితహారం విజయవంతం చేయడంతో పాటు ప్రతి ఒక్కరిలో చెట్ల పెంపకంపై అవగాహన కల్పించాలని సూచించారు. హరితమే మన బలం. పర్యావరణమే మన సంపద" అనే నినాదంతో ప్రకృతి పరిరక్షణ కూడా దేశసేవలో భాగమేనని తెలిపారు. చెట్ల పెంపకం వల్ల సహజ వనరులు పెరిగి అభివృద్ధికి దోహదపడుతుందని, ప్రతి ఒక్కరూ మొక్కలను సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఎన్సీసీ అనుబంధ అధికారి సందీప్ సింగ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శాకాంబరి అవతారంలో వాసవి మాత

ప్రత్యేక పూజలు నిర్వహించిన మహిళలు... ఆషాడం ప్రత్యేకత గోరింటాకు ఉత్సవం



**జమ్మికుంట, ఆగస్టు 3 (నినాదం):** జమ్మికుంట పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో సోమవారం శాకంబరి ఉత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. అన్ని రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించగా భక్తులకు శాఖాంబరి అవతారంలో వాసవి మాత దర్శనమిచ్చారు. ఆషాడ మాసం పురస్కరించుకొని జమ్మికుంట పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారిని శాకాంబరిగా అలంకరించగా వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఆషాడ మాసం సందర్భంగా అమ్మవారు శాంత స్వరూపిని రూపంలో శాఖంబరిగా ఉంటుందని భావించిన భక్తులు మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ పండితులు వెంకటనారాయణ ఆధ్వర్యంలో వాసవి మాతను శాఖంబరిగా అలంకరింపజేసిన అనంతరం గోరింటాకు ఉత్సవాన్ని మహిళలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ అమ్మవారు శాంతస్వరూపిణిగా శాఖంబరిగా అవతారంలో ఉండడం ఇక్కడి ప్రాంత ప్రజలతో పాటు ప్రతి ఒక్కరు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని కోరుకోవడం తోపాటు ప్రత్యేక పూజలు నిర్వ హించినట్లు పేర్కొన్నారు. ఆషాడ మాసం లో మహిళలు గోరింటాకు పెట్టుకునే ఆనవాయితీని కొనసాగిస్తూ వందలాది మంది మహిళలు ఆలయంలో గోరింటాకు వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన పలువురు మహిళాలు ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.



స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్మెంట్

## వెంటనే విడుదల చేయాలి

బిజెపి ఆధ్వర్యంలో సిఎం దిష్టిబొమ్మ దహనం



**జమ్మికుంట, ఆగస్టు 3 (నినాదం):** జమ్మికుంట బిజెపి పార్టీ, యువ మోర్చ ఆధ్వర్యంలో ఫీజుల బకాయి బిజెపి లడాయి కార్యక్రమాన్ని బిజెపి పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు, యువ మోర్చ అధ్యక్షులు తుర్పాటి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్య అతిథిగా యువ మోర్చ జిల్లా అధ్యక్షులు సంగ నరేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నరెడ్ల ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు, ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జమ్మికుంట ప్రభుత్వ ప్రైవేటు కళాశాలల్లో విద్యార్థులతో స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వం నిధులు అందించక చాలా మంది విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారని మండిపడ్డారు. పెండింగ్ లో ఉన్న 15 వేల కోట్ల రూపాయల స్కాలర్‌షిప్ నిధులను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ విద్యార్థులను ఇడియట్ అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనడం సిగ్గు చేటు అని వెంటనే విద్యార్థులకు సిఎం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ జమ్మికుంట గాంధీ చౌరస్తాలో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈకార్యక్రమంలో ఆకుల రాజేందర్, శీలం శ్రీనివాస్, కైలాసకోటి గణేష్, రాచపల్లి ప్రశాంత్, అదువాల శ్రీధర్, శ్రీవర్తి ప్రవీణ్, గట్టు సాయిరాం, ప్రణీత్, పసునూటి శివ, పనికారి రమేష్, పొడెటి అనిల్, సిరియాల విజయ్, కొలకాని అరవింద్, చందా సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలి

– గర్భిణీలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి: కందుగుల ఉపసర్పంచ్ మండ సతీష్



**హుజురాబాద్, ఆగస్టు 3 (నినాదం):** తల్లిపాల ప్రాముఖ్యతను గర్భిణీలు, బాలింతలకు అవగాహన కల్పించాలని కందుగుల ఉపసర్పంచ్ మండ సతీష్ అన్నారు. సోమవారం మండలంలోని కందుగుల గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తల్లి పాలు బిడ్డకు ఎంతో మేలు చేస్తాయని, పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలన్నారు. కనీసం ఆరు నెలలు బిడ్డకు తల్లిపాలు పట్టించే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిపాల వల్ల చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యవంతులుగా ఎదుగుతారన్నారు. తల్లి పాలలో అనేక పోషకాలు, ఎంజైములు, హార్మోన్లు సమపాళ్లలో లభిస్తాయని తెలియజేశారు. 8 నెలలు నిండిన తర్వాత అదనపు ఆహారం అందిస్తూ 2 సంవత్సరాల వరకు తల్లి పాలు పట్టించాలన్నారు. చిన్నారులకు పోషక ఆహారాలను అందించాలని సూచించారు. అదే విధంగా బాలింతలు పసిపిల్లలకు పాలు ఇచ్చే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

**గర్భిణీలు పోషకాహారం తీసుకోవాలి..**
గర్భిణులు ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటించాలని, జంక్‌ఫుడ్ తీసుకోవద్దన్నారు. తృణధాన్యాలైన కొర్రలు, సజ్జలను ఆహారంలో భాగం చేసుకోవాలన్నారు. సజ్జలు తినడం వల్ల రక్తంలో హిమోగ్లోబిన్ పెరుగుతుందని తెలిపారు. అనంతరం చిన్నారులకు అన్న ప్రాశన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముప్పు మహేష్, పంచాయతీ కార్యదర్శి మధుకర్, అంగన్వాడి టీచర్ లు రజిత, పద్మ, ఏఎన్ఎం సైదాబాన్, ఆశా వర్కర్స్ సరూప, స్వప్న, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలే శిశువుకు తొలి టీకా..

ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు బాట
ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో అవగాహన కార్యక్రమం..
గర్భిణీలు, బాలింతలకు కీలక సూచనలు



**కమాన్ పూర్ ఆగస్టు 3 (నినాదం):** పెద్దపల్లి జిల్లా పెంచికల్‌పేట్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పల్లె మాధవి-నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, శిశువు జన్మించిన గంటలోపే తల్లిపాలు పట్టించడం అత్యంత ముఖ్యమని, పుట్టిన తొలి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం ద్వారా చిన్నారులకు సంపూర్ణ పోషకాహారం అందడంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. తల్లిపాలు శిశువు శారీరక, మానసిక ఎదుగుదలకు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతపై విస్తృత అవగాహనఅంగన్వాడీ సిబ్బంది గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల అవసరం, సమతుల్య పోషకాహారం, తల్లి-శిశు ఆరోగ్య సంరక్షణ, శుభ్రత పాటించాల్సిన విధానాల పై అవగాహన కల్పించారు. తల్లిపాలే శిశువుకు తొలి రోగనిరోధక రక్షణ అని వివరించారు. ప్రతి శిశువుకు తల్లిపాలు అందించాలని ప్రతిజ్ఞకార్యక్రమంలో పాల్గొన్న తల్లులు తల్లిపాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను తెలుసుకుని, ప్రతి శిశువుకు తప్పనిసరిగా తల్లిపాలు అందించేందుకు సంకల్పం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు కౌసల్య, ఈశ్వరి, ఏఎన్ఎం మేటిల్డ, ఆశా కార్యకర్తలు కల్యాణి, సుమలత, గ్రామ మహిళలు, గర్భిణీలు, బాలింతలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రకటనలకే పరిమితమైన ప్రీ ప్రైమరీ పాఠశాలలు !

**ఆంగ్ల మాధ్యమ ఆశలతో అడ్మిషన్లు... సిబ్బంది లేక అనిశ్చితి**

**మంగపేట మండలంలో పేద విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకం**






**ములుగు ప్రతినిధి, ఆగస్టు 03 (నినాదం):** ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచే ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్య అందిస్తామని ప్రభుత్వం గొప్పగా ప్రకటించింది. కానీ మంగపేట మండలంలో ఆ ప్రకటనలు కాగితాలకే పరిమితమయ్యాయి. తరగతి గదులు లేవు, ఆయాలు లేరు, బోధకులు లేరు.

**4 పాఠశాలలు ఎంపిక... ఒక్కటీ ప్రారంభం కాలేదు..**

మంగపేట మండలంలో ప్రభుత్వం 4 పాఠశాలలను ప్రీ ప్రైమరీ పాఠశాలలుగా ఎంపిక చేసింది. అందులో కొత్త మల్లూరు మండల పరిషత్ ఉన్నత పాఠశాల కూడా ఉంది. ప్రైవేట్ పాఠశాలలకు ఫీజులు కట్టలేని నిరుపేద కుటుంబాలు ప్రభుత్వ స్కూల్‌లోనే పిల్లలకు మంచి చదువు వస్తుందన్న ఆశతో నర్సరీ, ఎల్.కె.జి, యు.కె.జి తరగతుల్లో అడ్మిషన్లు చేయించారు. కానీ విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా ఒక్క పాఠశాలలో కూడా ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభం కాలేదు. పిల్లలను కూర్చోబెట్టడానికి ప్రత్యేక తరగతి గదులు, బొమ్మలు, ఆట వస్తువులు, పుస్తకాలు ఏమీ అందుబాటులో లేవు.

**సిబ్బంది కొరతతో సతమతం..**

ప్రీ ప్రైమరీ తరగతులకు ప్రభుత్వం ఆయాలు, బోధకులను నియమిస్తామని చెప్పింది. కానీ ఇప్పటివరకు ఒక్కరిని కూడా నియమించలేదు. ఉన్న ఉపాధ్యాయులపైనే అదనపు భారం పడుతోంది. ఫలితంగా సాధారణ తరగతుల బోధన కూడా దెబ్బతింటోందని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పేదల ఆశలు ఆవిరి**

"ప్రైవేట్ స్కూల్‌కు నెలకు 1500 నుంచి 2000 రూపాయల ఫీజు కట్టలేము. ప్రభుత్వ స్కూల్‌లో ఇంగ్లీష్ మీడియం ఉచితంగా వస్తుందని ఆశపడి పిల్లలను చేర్పించాం. ఇప్పుడు స్కూల్‌కు వచ్చినా కూర్చోబెట్టే వారు లేరు, చెప్పే వారు లేరు" అని కొత్త మల్లూరు గ్రామానికి చెందిన ఓ తల్లి కన్నీటి పర్యంతమైంది. "ఇంగ్లీష్ మీడియం చదువు మా పిల్లలకు అందని ద్రాక్షేనా" అని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.

**నాణ్యమైన విద్య నినాదం ఏమైంది?**

ప్రభుత్వం "బడిబాట" కార్యక్రమంలో భాగంగా ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. కానీ మౌలిక సదుపాయాలు, సిబ్బంది లేకుండా పథకాలు ప్రకటించడం వల్ల పేద విద్యార్థులే నష్టపోతున్నారని విద్యావేత్తలు అభిప్రాయ పడుతున్నారు. గ్రామాల్లో ఇప్పటికే ప్రైవేట్ పాఠశాలల ప్రభావం పెరిగిపోతుంది. ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ప్రీ ప్రైమరీ తరగతులకు అవసరమైన గదులు, సామాగ్రి, ఆయాలు, బోధకులను నియమించకపోతే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య మరింత తగ్గే ప్రమాదం ఉంది.

**గ్రామస్థుల డిమాండ్**

ప్రభుత్వం వెంటనే మంగపేట మండలంలోని 4 ప్రీ ప్రైమరీ పాఠశాలలను పూర్తి స్థాయిలో ప్రారంభించి, పెండింగ్‌లో ఉన్న నియామకాలు చేపట్టాలని, పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

## శిశువులకు తొలి రక్షణ తల్లిపాలే..



- ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ రవి

**హనుమకొండ, ఆగస్టు 3, (నినాదం):** శిశువుల సంపూర్ణ ఆరోగ్యానికి, ఎదుగుదలకు తల్లిపాలే అత్యుత్తమ ఆహారమని హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి అన్నారు. ప్రతి తల్లి తన ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, శిశువులకు సమయానుకూలంగా తల్లిపాలు అందించాలని సూచించారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సోమవారం హనుమకొండ గోపాల్‌పూర్‌లోని ఎంపీపీఎస్ ప్రాంగణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన అన్నప్రాశన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగాచిన్నారులకు తన చేతుల మీదుగా అన్నప్రాశనం చేయించి ఆశీర్వదించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, శిశువు పుట్టిన వెంటనే ముర్రుపాలు (కొలస్ట్రం) తప్పనిసరిగా పట్టించాలని సూచించారు. ముర్రుపాలు శిశువుకు సహజ రోగనిరోధక శక్తిని పెంపొందించేఅమూల్యమైన ఆహారమని పేర్కొన్నారు. శిశువు జన్మించినప్పటి నుంచి మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలనే ఇవ్వాలని, ఆ తరువాత ఏడో నెల నుంచి వైద్యుల సూచనల మేరకు అనుబంధ పోషకాహారం ప్రారంభించి, రెండు సంవత్సరాల వయస్సు వరకు తల్లిపాలను కొనసాగించాలని తెలిపారు. పిల్లల తల్లులు తమ ఆరోగ్యం, పోషకాహారం, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆరోగ్యవంతమైన తల్లే ఆరోగ్యవంతమైన బిడ్డకు పునాది అని కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా గోపాల్‌పూర్ ఆరోగ్య కేంద్రం--1 పరిధిలోని చిన్నారులకు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ చేతుల మీదుగా అన్నప్రాశన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు జ్యోతి, ఝాన్సీ, పోషణ్ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ ప్రీతి, జెండర్ స్పెషలిస్ట్ స్వర్ణలత, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, సమత, ఆశా కార్యకర్తలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.


## జావెలిన్‌త్రోలో పతకాలు సాధించిన మదర్స్ ల్యాప్



**వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 3 (నినాదం):** వనపర్తి జిల్లా కేంద్రంలో అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐదవ జాతీయ జావిలిన్ త్రో డే సందర్భంగా విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా కేంద్రంలోని మదర్స్ ల్యాప్ హై స్కూల్ విద్యార్థులు వివిధ విభాగాలలో విజయాలు సాధించారు. గెలుపొందిన విద్యార్థులకు వనపర్తి టౌన్ సిఐ రత్నం అభినందించి ప్రశంస పత్రాలను అందజేశారు. విద్యార్థుల విజయం పట్ల మదర్స్ ల్యాప్ హై స్కూల్ ప్రిన్సిపల్ అబ్దుల్ ముబీన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అబ్దుల్ ముబిన్ మాట్లాడుతూ 2021 టోక్యోలో జరిగిన ఒలంపిక్స్ క్రీడల్లో భారతదేశ అథ్లెటిక్ నీరజ్ చోప్రా జావెలిన్ త్రో విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి మన దేశానికి కీర్తి సాధించారని, ఆయన బంగారు పథకం సాధించిన ఆగస్టు 7న జాతీయ జావెలిన్ త్రో డే ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నారని చెప్పారు. దేశంలోనే యువతను, చిన్నపిల్లలను అథ్లెటిక్స్, జావిలిన్ త్రో క్రీడల వైపు ఆకర్షించడానికి, ప్రతిభ చాటడానికి దేశవ్యాప్తంగా జిల్లాల పరిధిలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కార్యదర్శిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

**సమన్వయం లేకుండా స్వంత నిర్ణయాలు చేస్తున్నారని ఆరోపణ**


Citizen Copy
GOVERNMENT OF TELANGANA

**మోతె, ఆగస్టు 3 (నినాదం):** మండలంలోని ఉర్లుగొండ గ్రామ పంచాయతీ కార్యదర్శి తీరుపై గ్రామ సర్పంచ్ మొక్క వెంకటేశ్వర్లు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామ పరిపాలనలో సర్పంచ్‌తో సమన్వయం లేకుండా కార్యదర్శి స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. సర్పంచ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ కోసం పనిచేస్తున్న కార్మికులు నలుగురు తమ పనులను రోజువారీగా పంచుకుని నిర్వహించాల్సి ఉండగా, ప్రస్తుతం ముగ్గురు కార్మికులపైనే అధిక పనిభారం పడుతోందని సిబ్బంది తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. ఈ విషయంపై కార్యదర్శిని వివరణ కోరగా, సమస్యను పరిష్కరించాల్సిన చోట తనకు సహకారంగా ఒక వ్యక్తి పనిచేయాలని చెప్పడంతో వివాదం తలెత్తిందన్నారు. గ్రామ పంచాయతీ పాలనలో ప్రజాప్రతినిధి, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సి ఉండగా, కార్యదర్శి వ్యవహారశైలి అందుకు విరుద్ధంగా ఉందని సర్పంచ్ ఆరోపించారు. గ్రామ అభివృద్ధి, పారిశుధ్య పనులకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ మొక్క వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## జాతీయ కరాటే పోటీల్లో కిట్స్ విద్యార్థినికి బంగారు పతకం



**కోదాడ, ఆగస్టు 3 (నినాదం):** ఖమ్మంలో నిర్వహించిన జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో కోదాడలోని కిట్స్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని ఎం. అంజలి ప్రతిభ కనబర్చి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. కళాశాలలో బీటెక్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ (ఈఈఈ) ద్వితీయ సంవత్సరం చదువుతున్న అంజలి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి స్వర్ణ పతకం సాధించడం పట్ల కళాశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. కళాశాల చైర్మన్ నీలా సత్యనారాయణ విద్యార్థినిని అభినందిస్తూ, విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించడం గర్వకారణమన్నారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో విజయం సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెరుమాళ్లపల్లి గాంధీ, ఎలక్ట్రికల్ విభాగాధిపతి డాక్టర్ శివాజీ, ఇతర విభాగాధిపతులు, అధ్యాపకులు, కరాటే శిక్షకురాలు మాధవీలత విద్యార్థినిని అభినందించి, మరిన్ని విజయాలు సాధించాలని ఆశీర్వదించారు.

## బాలల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా నిర్ణయాత్మక జాతీయ ప్రచారం

- స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషిని అభినందించిన కేంద్రమంత్రి
- రూరల్ డెవలప్మెంట్ సొసైటీ డైరెక్టర్ చిన్నమ్మ తామస్






**వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 3 (నినాదం):** బాలల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా నిర్ణయాత్మక జాతీయ ప్రచారాన్ని ప్రారంభించినట్లు రూరల్ డెవలప్మెంట్ సొసైటీ డైరెక్టర్ చిన్నమ్మ తామస్ చెప్పారు. సోమవారం ఆమె బాలల అక్రమ రవాణాపై స్పందించారు. బాలల అక్రమ రవాణాను నిరోధించేందుకు జాతీయ ప్రచారంలో భాగంగా న్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్ లో బాలల హక్కులు, సామర్థ్యం, సమృద్ధిని నిర్ధారించడం అనే అంశాలపై నాలుగు రోజుల పాటు జాతీయ ఆలోచన సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాలల అక్రమ రవాణాపై నిర్ణయాత్మక పోరాటాన్ని ప్రకటించినట్లు ఆమె వెల్లడించారు. రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో వనపర్తి, జోగులాంబ గద్వాల, మహబూబ్ నగర్ జిల్లాల్లో బాలల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ప్రచారాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. వనపర్తి, జోగులాంబ గద్వాల, మహబూబ్ నగర్ జిల్లాలో బాల కార్మికుల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా బాలల హక్కుల సంస్థ, రూరల్ డెవలప్మెంట్ సొసైటీ పనిచేస్తున్నదని తెలిపారు. బాలల అక్రమ రవాణాను నిరోధించడానికి ప్రభుత్వం, స్థానిక యంత్రాంగం, బాల సంక్షేమ వర్గాలతో కలిసి పనిచేస్తూ జిల్లాను పిల్లలకు మరింత సురక్షితంగా మార్చడానికి తాము కట్టుబడి ఉన్నామని ఆమె స్పష్టం చేశారు. ఈ ప్రచారంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని, ప్రమాదంలో ఉన్న కుటుంబాలను గుర్తించి పిల్లలు బడిలోనే ఉండేలా, రవాణా ముఠాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రభుత్వ సంక్షేమ పథకాలతో అనుసంధానం చేస్తామన్నారు. 2030 నాటికి భారతదేశాన్ని బాలల అక్రమ రవాణా రహితంగా మార్చడానికి, బాలల హక్కులను కాపాడటానికి 250 కి పైగా స్వచ్ఛంద సంస్థలు పనిచేస్తున్నాయని చెప్పారు. దేశవ్యాప్త నెట్‌వర్క్ జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ ఆధ్వర్యంలో భారతదేశంలోని 782 జిల్లాల భాగస్వామ్య సంస్థల ప్రతినిధులు ఢిల్లీలో జరిగిన సదస్సులో పాల్గొన్నారని చెప్పారు. రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అనేది జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ యొక్క భాగస్వామ్య సంస్థ అని, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ పిల్లలపై జరిగే నేరాలకు వ్యతిరేకంగా ప్రపంచంలోనే అతిపెద్ద చట్టపరమైన జోక్య కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఆమె వెల్లడించారు. భాగస్వామ్య సంస్థల ఉమ్మడి కృషితో ఏప్రిల్ 2023, డిసెంబర్ 2025 మధ్య కాలంలో భారతదేశంలో 1,22,516 మంది పిల్లలను అక్రమ రవాణా నుండి రక్షించారని, ఇది సమన్వయంతో కూడిన చట్టపరమైన చర్యలు, సమాజ-ఆధారిత జోక్యాల ప్రభావాన్ని నిరూపిస్తోందని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ సదస్సు ప్రారంభిస్తూ ప్రశంసించారని ఆమె గుర్తు చేశారు. బాలల సంరక్షణను దేశంలోని అత్యంత సవాలుతో కూడిన బాధ్యతల్లో ఒకటిదని, దోపిడీ నుంచి పిల్లలను రక్షించడంలో స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషిని కేంద్ర మంత్రి అభినందించారని ఆమె చెప్పారు. ఒక్క చిన్నారి ప్రాణాన్ని కాపాడినా అది అత్యంత పవిత్రమైన కార్యమని, చాలా మంది చిన్న పిల్లలు అక్రమ రవాణాకు గురై మళ్లీ ఇంటికి చేరుకోలేకపోతున్నారని, ఎవరైనా వచ్చి తమను రక్షిస్తారని ఈ పిల్లలు ఎదురుచూస్తుంటారని చెప్పారు. లైంగిక దోపిడీ నుంచి వారిని రక్షించే స్వచ్ఛంద సంస్థల వాలంటీర్లు దేవదూతలతో సమానమని ఆమె అన్నారు. భారతదేశంలో పిల్లలకు అత్యంత తీవ్రమైన ముప్పులలో బాలల అక్రమ రవాణా ఒకటిగా కొనసాగుతోందని చెప్పారు. సగటున ప్రతిరోజూ ఆరుగురు పిల్లలు అక్రమ రవాణాకు గురవుతుంటే ఐదుగురు పిల్లలు బాలకార్మికులుగా మారుతున్నారనేది విషాదకరమైన నిజమని, ప్రభుత్వ గణాంకాల ప్రకారం ప్రతీ గంటకు 11 మంది పిల్లలు కనిపించకుండా పోతున్నారని, వారిలో అత్యధిక శాతం మంది అక్రమ రవాణా బాధితులుగా మారుతున్నారని ఆమె వెల్లడించారు. ఆయుధాలు, మాదకద్రవ్యాల రవాణా తర్వాత మానవ హక్కుల ఉల్లంఘనగా నిలిచే మానవ అక్రమ రవాణా ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద వ్యవస్థీకృత నేరమని, మహిళలు, పిల్లలే దీని ప్రధాన లక్ష్యంగా ఉన్నారని పేర్కొన్నారు. వాణిజ్య లైంగిక దోపిడీ, వెట్టిచాకిరీ ద్వారా అక్రమ రవాణాదారులు లాభాలు గడిస్తున్నారని, అనధికారిక రంగంలో బాలకార్మికులుగా మార్చడం అక్రమ రవాణా యొక్క అత్యంత ఘోరమైన రూపాలలో ఒకటిదని అన్నారు. అక్రమ రవాణాదారులు తరచుగా బయటి వ్యక్తులు కాదని, స్థానిక ప్రాంతాలలో తెలిసిన వ్యక్తులేనని డైరెక్టర్ చిన్నమ్మ తామస్ చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లలకు ఉద్యోగం, విద్య లేదా మెరుగైన జీవితం కల్పిస్తామని, నకిలీ వాగ్దానాలు చేసి వారిని లైంగిక దోపిడీ లేదా వెట్టిచాకిరీలోకి నెట్టివేస్తున్నారని తెలిపారు. అక్రమ రవాణాను అరికట్టడం, రక్షించబడిన పిల్లలకు చట్టపరమైన మద్దతు అందించడం, అక్రమ రవాణాదారులకు శిక్ష పడేలా చూడటంపై దృష్టి సారిస్తామన్నారు. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం సహకారంతో ముప్పు ఎదుర్కొంటున్న కుటుంబాలను గుర్తించి వారిని సామాజిక భద్రతా పథకాలతో అనుసంధానిస్తామని, దీనివల్ల పిల్లలు తమ చదువును కొనసాగించడమే కాకుండా అక్రమ రవాణాదారుల నుండి సురక్షితంగా ఉంటారని చెప్పారు. అదే సమయంలో అక్రమ రవాణా నుండి రక్షించబడిన పిల్లలకు సమగ్ర పునరావాసం లభించేలా వారు సమాజంలో తిరిగి సాధారణ జీవితం గడిపేలా మేము కృషి చేస్తామని చిన్నమ్మ తామస్ స్పష్టం చేశారు

## మిషన్ భగీరథలో కాంట్రాక్టర్ల దోపిడీపై ప్రజావాణిలో ఫిర్యాదు

- 60--80 మంది ఉండాల్సిన చోట 16 మందితోనే నిర్వహణ
- కార్మిక హక్కుల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, ఆగస్టు3 (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం కోనంపేట మిషన్ భగీరథ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్వహణలో కాంట్రాక్టర్ అక్రమాలు, కార్మికుల శ్రమదోపిడీ, అలవెన్సుల దుర్వినియోగం జరుగుతున్నాయని ఆరోపిస్తూ కుల సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా చైర్మన్ పీక కిరణ్ ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు వినతిపత్రం అందజేసింది. జులై 27న ఇదే అంశంపై ప్రజావాణిలో ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి విచారణ గానీ, చర్యలు గానీ చేపట్టలేదని పేర్కొంటూ ఈసారి రిమైండర్ లేఖ సమర్పించినట్లు పీక కిరణ్ తెలిపారు. కోనంపేట ప్లాంట్ ద్వారా మహాముత్తారం సహా ఆరు మండలాల పరిధిలోని వందలాది గ్రామాలకు తాగునీరు సరఫరా జరుగుతోందని, నిబంధనల ప్రకారం 60 నుంచి 80 మంది సిబ్బంది పనిచేయాల్సి ఉండగా ప్రస్తుతం కేవలం 16 మందితోనే ప్లాంట్ నిర్వహిస్తున్నారని ఆరోపించారు. దీంతో కార్మికులపై అధిక పనిభారం పడటమే కాకుండా ఆదివారాలు, పండుగ సెలవులు కూడా ఇవ్వడం లేదని పేర్కొన్నారు. కార్మికుల జీతాల నుంచి మెడిక్లెయిమ్, పెట్రోల్ అలవెన్సుల పేరుతో నెలకు రూ. 8 వేల నుంచి రూ. 12 వేల వరకు అక్రమంగా కోతలు విధిస్తున్నారని, లేని ఉద్యోగులను రికార్డుల్లో చూపిస్తూ బిల్లులు పొందుతున్నారని, సూపర్‌వైజర్ పోస్టుల పేరిట భారీ మొత్తంలో అక్రమ వసూళ్లు జరుగుతున్నాయని జేఏసీ ఆరోపించింది. అలాగే ఉద్యోగులకు అపాయింట్‌మెంట్ లేఖలు, ఐడీ కార్డులు, పే స్లిప్పులు కూడా ఇవ్వడం లేదని తెలిపింది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, కార్మికులకు బకాయి అలవెన్సులు, ఓవర్‌టైమ్ బకాయిలను చెల్లించాలని, ఖాళీ పోస్టులను నిబంధనల ప్రకారం భర్తీ చేయాలని జేఏసీ డిమాండ్ చేసింది. వినతిపత్రాన్ని స్వీకరించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సమస్య తీవ్రతను పరిశీలించి మిషన్ భగీరథ, కార్మిక శాఖ అధికారులతో సమగ్ర విచారణ జరిపించి, వాస్తవాల ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు జేఏసీ ప్రతినిధులు తెలిపారు.

## ప్రజావాణి ఫిర్యాదులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి

- జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్



**నల్లగొండ ప్రతినిధి ఆగస్టు 3 (నినాదం) :** ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంపై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్ర శేఖర్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో కలిసి ప్రజలవద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ తర్వాత ఎప్పటిలాగే జిల్లా అధికారులతో వివిధ అంశాల పై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చిన ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, వీటి పరిష్కారంపై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని చెప్పారు. అంతేకాక ప్రతి సోమవారం జిల్లా కేంద్రంతో పాటు, మండల, డివిజన్ స్థాయిలలో నిర్వహించే ప్రజావాణి లో వచ్చిన ఫిర్యాదులపై కూడా దృష్టి సారించి పరిష్కారం చేయాలని ఆదేశించారు. మండలాల ప్రత్యేక అధికారులు హాస్టళ్లు, ఇతర ప్రభుత్వ సంస్థలు తనిఖీ చేసిన అనంతరం నివేదికలను తప్పనిసరిగా సమర్పించాలని, కొంతమంది అధికారులు నివేదికలు సమర్పించడం లేదని, ఇకపై తప్పనిసరిగా ప్రతి ఒక్కరు నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. ఈ సంవత్సరం నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ముఖ్య అతిథి సందేశానికి ఇప్పటినుండే ఆయా శాఖల అధికారులు నోట్స్ ను తయారుచేసి ఈ నెల 7 లోగా సిపిఓ కు అందజేయాలన్నారు. దిన పత్రికలలో వచ్చే ప్రతికూల వార్తలకు జిల్లా అధికారులందరు స్పందించి వివరణలు ఇవ్వాలని, నివేదికలు తనకు ప్రభుత్వానికి పంపాలని ఆదేశించారు. కాగా ఈ సోమవారం రెవెన్యూ శాఖకు 81, ఇతర అధికారులకు 57 ఫిర్యాదులు, మొత్తం 138 వచ్చాయి. రెవెన్యూ అధనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్, జెడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- గ్రీవెన్స్ డేలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

**నల్లగొండ ప్రతినిధి ఆగస్టు 3 (నినాదం ):** జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్ పరిధుల నుంచి వచ్చిన 58 మంది బాధితులు తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రతి బాధితుడి ఫిర్యాదును స్వయంగా పరిశీలించి, వారి సమస్యలను విని, సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి చట్టపరంగా, నిష్పాక్షికంగా విచారణ జరిపి త్వరితగతిన తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూ వివాదాలు, కుటుంబ కలహాలు, మోసం, ఆర్థిక లావాదేవీలు, ఇతర వ్యక్తిగత సమస్యలకు సంబంధించిన వినతులను స్వీకరించి, ప్రతి ఫిర్యాదుపై పారదర్శకంగా విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ గారు తెలిపారు. పోలీస్ శాఖ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, బాధితులు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే పోలీస్ గ్రీవెన్స్ డేను వినియోగించుకోవాలని సూచించారు.



## సైబర్ క్రైమ్ అంశాలపై అవగాహన సదస్సు



**హనుమకొండ, జూలై 3, (నినాదం):** వరంగల్ కమిషనరేట్ పరిధిలో నీ పోలీసు అధికారులకు సైబర్ క్రైమ్ అంశాలపై ప్రత్యేక అవగాహన సోమవారం జరిగింది. వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ సూచనలతో, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్, వరంగల్ ఆధ్వర్యంలో కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్ ), వరంగల్ కళాశాలలో వరంగల్ కమిషనరేట్ పరిధిలోని స్టేషన్ హౌస్ ఆఫీసర్లు (ఎస్ హెచ్ ఓ) ఇతర పోలీసు అధికారుల కోసం ఒకరోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ శిక్షణ కార్యక్రమంలో సైబర్ నేరాల దర్యాప్తుకు సంబంధించిన వివిధ దర్యాప్తు పద్ధతులు, ఆర్థిక సైబర్ నేరాల విచారణ, డిజిటల్ సాక్ష్యాల సేకరణ, కేసుల నమోదు, దర్యాప్తు ప్రక్రియ, అలాగే వివిధ సైబర్ పోర్టల్ల వినియోగంపై సమగ్ర అవగాహన కల్పించారు. అదేవిధంగా, సైబర్ నేరాల నివారణ, "గోల్డెన్ అవర్"లో తక్షణ స్పందన, బాధితులకు సత్వర న్యాయం అందించడం, అంతర్రాష్ట్ర సమన్వయం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి సైబర్ నేరాలను దర్యాప్తు చేయడం, నేరస్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు చేపట్టే విధానాలపై అధికారులు సవివరంగా వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్, వరంగల్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎం. వెంకట రమణ, ఇన్‌స్పెక్టర్ ఎస్.కె. యాసీన్, ఇన్‌స్పెక్టర్ కె. అశోక్ కుమార్, ఎస్.ఐ. చరణ్, ఎస్.ఐ. శివకుమార్, ఏ.ఏ.ఓ. సల్మాన్, అలాగే సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సిబ్బంది వినయ్, కిషోర్, ప్రవీణ్, జహూర్, భరత్, అనూష, రాజు, దినేష్, శివకృష్ణ తదితరులు పాల్గొని వివిధ అంశాలపై శిక్షణ అందించారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా వరంగల్ కమిషనరేట్ పరిధిలోని పోలీసు అధికారులు సైబర్ నేరాల దర్యాప్తులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించే విధానాలపై తమ అవగాహనను మరింత విస్తరించుకోవడంతో పాటు, బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు అవసరమైన దర్యాప్తు నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకున్నారు. ఈ కార్యక్రమం పోలీసు శాఖలో సైబర్ నేరాల నియంత్రణ, దర్యాప్తు సామర్థ్యాల పెంపు, అంతర్‌శాఖ సమన్వయాన్ని బలోపేతం చేయడం, అలాగే ప్రజలకు మరింత నాణ్యమైన సేవలు అందించడంలో కీలక పాత్ర పోషించనుందనీ తెలియజేశారు.

## తల్లిపాలలో ఎంతో ఆరోగ్యం దాగి ఉంది

**ఎమ్మెల్సీ శంకర్ నాయక్**



**మిర్యాలగూడ ఆగష్టు 3 (నినాదం):** తల్లిపాల వారోత్సవాలలో భాగంగా తల్లి పాల ప్రాధాన్యతను ప్రతి ఒక్కరికి అవగాహనా కల్పించాలని ఎమ్మెల్సీ కె. శంకర్ నాయక్, ఆర్డిఓ ఎస్. రమణారెడ్డి, ట్రైని డిప్యూటీ కలెక్టర్ వెంకటేష్ లు కోరారు. సోమవారం స్థానిక రెవిన్యూ డివిజన్ కార్యాలయంలో ఈ నెల 7వరకు జరిగే తల్లి పాల వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడుతూ మిర్యాలగూడ ఐసిడిఎస్ అర్బన్, దామరచర్ల ప్రాజెక్టుపరిధిలోని అన్ని అంగన్వాడీల్లో ఈ మేరకు గర్భిణీలు, బాలింతలకు సంపూర్ణ అవగాహన కల్పించాలని వారు కోరారు. పిల్లలకు తల్లి పాలు ఇవ్వడంవల్లపిల్లలు,తల్లులుఆరోగ్యావంతులవుతారని వారన్నారు. వారం వరకు అవగాహన కార్యక్రమం కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి దామరచర్ల, అనుముల ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆఫీసర్లు శాంతి, విజయలక్ష్మి, మిర్యాలగూడ ప్రాజెక్టు సూపర్ వైజర్ కె. నాగమణి, అనుముల సూపర్వైజర్ ఫరీదా బెగం మాధవి తదితరులు పాల్గొన్నారు.

## లక్కవరంలో మహిళా సంఘం కార్యాలయ భవనానికి శంకుస్థాపన



**కోదాడ, ఆగస్టు 3(నినాదం):** అనంతగిరి మండలంలోని లక్కవరం గ్రామంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రూ. 10 లక్షల వ్యయంతో మహిళా సమాఖ్య సంఘం కార్యాలయ నూతన భవన నిర్మాణానికి ఏపీఎం సౌజన్యతో కలిసి సర్పంచ్ ఆళ్ల నవ్య సురేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, స్వయం ఉపాధి కార్యకలాపాలకు ఈ భవనం ఉపయోగపడుతుందని వారు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, మహిళల ఆర్థికాభివృద్ధికి, స్వయం సహాయక సంఘాల బలోపేతానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భవన నిర్మాణాన్ని నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బుర్ర పుల్లారెడ్డి, బుర్ర నరసింహారెడ్డి, షేక్ నాగుల్ మీరా, కార్యదర్శి త్రివేణి, కూరపాటి భూపతి, సంఘబంధం అధ్యక్షురాలు కూరపాటి సుగుణ, కర్నాటి లచ్చిరెడ్డి, వాక పుల్లారెడ్డి, పాలకవర్గ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, మహిళా సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి : కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ ప్రతినిధి, ఆగస్టు 03 (నినాదం):**
కలెక్టర్ మాట్లాడుతూ, భూ భారతి, ప్రజావాణి, సీఎం ప్రజావాణి, రెవెన్యూ సదస్సులు, సదాబైనామా తదితర భూ సమస్యలకు సంబంధించిన దీర్ఘకాలిక పెండింగ్ దరఖాస్తులను ప్రత్యేక దృష్టితో త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తుల వివరాలను తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అన్ని దరఖాస్తులను పూర్తి చేయాలని, పరిష్కారం కాని వాటిని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. తిరస్కరించే దరఖాస్తులకు స్పష్టమైన కారణాలను నమోదు చేయాలని, ప్రజల వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. భూముల సర్వే, రీ-సర్వే ప్రక్రియను నిబంధనల ప్రకారం వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు 'మన ఇసుక వాహనం' యాప్ ద్వారానే ఇసుక విక్రయాలు జరిగేలా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ రాకేష్, డీఆర్వో రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, ఏడీ ల్యాండ్ సర్వే రికార్డ్స్ నరసింహమూర్తి, తహసీల్దార్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఫీజుల బకాయి - బిజెపి లడాయి



**నిర్మల్ ప్రతినిధి, ఆగస్టు 03 (నినాదం):**
భారతీయ జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న సుమారు ?15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, విద్యార్థుల సమస్యలను తెలుసుకొని సంతకాల సేకరణ కార్యక్రమం నిర్మల్ జిల్లా కేంద్రంలోని పలు కళాశాల లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు నిరంజన్ రెడ్డి పాల్గొని, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా వెంటనే పెండింగ్ బకాయిలను విడుదల చేసి, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సూరజ్ నాయక్, సాత్విక్, బీజేపీ నాయకులు కందుల హరీష్, వెంకటేష్, భరత్, విజయ్, సృజన్, బంటి, చరణ్, దీక్షిత్, అనిల్, శ్రీకాంత్, మధు, ప్రణయ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


## వాహిని షాపింగ్ మాల్ ఘన ప్రారంభం

### -సినీ నటి క్రితి శెట్టి రాకతో సందడి



**మంచిర్యాల, ఆగస్టు 3 (నినాదం):**
మంచిర్యాల పట్టణంలోని ఇక్బాల్ హైమద్ నగర్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన వాహిని షాపింగ్ మాల్ సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవానికి సినీ నటి క్రితి శెట్టి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాల్‌ను ప్రారంభించారు. ప్రముఖ వ్యాపారవేత్త ఒంప్రకాశ్ జి. జాజు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించగా, పెద్ద సంఖ్యలో అభిమానులు, వ్యాపారవేత్తలు, స్థానిక ప్రజలు హాజరై సందడి చేశారు. సినీ నటి క్రితి శెట్టిని చూసేందుకు అభిమానులు భారీగా తరలివచ్చారు. ఆమె రాకతో మాల్ ప్రాంగణం సందడిగా మారింది. అభిమానులు సెల్ఫీలు, ఫోటోలు దిగేందుకు పోటీపడగా, నిర్వాహకులు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు. క్రితి శెట్టి అభిమానులకు అభివాదం చేస్తూ అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వాహిని షాపింగ్ మాల్‌లో కుటుంబ సభ్యులందరికీ అవసరమైన వస్త్రాలు ఒకే చోట అందుబాటులో ఉండటం విశేషమని పేర్కొన్నారు. మహిళల కోసం వివిధ రకాల చీరలు, డిజైనర్ కలెక్షన్లు, చిన్నారుల కోసం ఆకర్షణీయమైన దుస్తులు, పురుషుల కోసం ట్రెండీ మెన్స్‌వేర్‌తో పాటు అన్ని వయస్సుల వారికి సరిపోయే నాణ్యమైన వస్త్రాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కుటుంబ వేడుకలు, పండుగలు, శుభకార్యాల కోసం అవసరమైన వస్త్రాలను ఎంపిక చేసుకునేందుకు ఈ మాల్ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. వాహిని షాపింగ్ మాల్ నిర్వాహకులు మాట్లాడుతూ, వినియోగదారులకు నాణ్యతతో కూడిన వస్త్రాలను సరసమైన ధరల్లో అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక డిస్కౌంట్లు, ఆకర్షణీయమైన ఆఫర్లు, కొనుగోళ్లపై బహుమతులు కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆధునిక ఇంటీరియర్, విశాలమైన షాపింగ్ వాతావరణం, విభిన్న బ్రాండ్ల వస్త్రాల సమాహారం వినియోగదారులను ఆకట్టుకుంటుందని పేర్కొన్నారు. మంచిర్యాలలో షాపింగ్ రంగంలో వాహిని షాపింగ్ మాల్ మరో కొత్త ఆకర్షణగా నిలవనుందని స్థానికులు అభిప్రాయపడ్డారు. ప్రారంభమైన తొలి రోజే పెద్ద సంఖ్యలో వినియోగదారులు మాల్‌ను సందర్శించి కొనుగోళ్లు చేయడం విశేషం. ఈ కార్యక్రమంలో వాహిని షాపింగ్ మాల్ యజమాని వేముల వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, అనిల్, ప్రశాంత్, శ్రీనివాస్, విష్ణు, వేణుగోపాల్ జాజు, నవనీత్ బంగ్, శ్రీరామ్ జాజు, దేవరాజు, నాగరాజ్, నటరాజ్, నందరాజ్, కొమురవెల్లి రవితేజ, గాజుల అరుణ్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం అతిథులను ఘనంగా సత్కరించగా, మాల్ అభివృద్ధి చెందాలని శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రీ-ప్రైమరీ విద్య నాణ్యత పెంపుపై దృష్టి సారించాలి



**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, ఆగస్టు 3 (నినాదం) :**
ప్రభుత్వ ప్రీ-ప్రైమరీ పాఠశాలల్లో చిన్నారులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ సూచించారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 118 ప్రభుత్వ ప్రీ-ప్రైమరీ పాఠశాలల ఇన్స్ట్రక్టర్లకు నిర్వహిస్తున్న నాలుగు రోజుల జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చిన్నారుల జీవితంలో తొలి ఐదేళ్లు అత్యంత కీలకమని, ఈ దశలో అందించే విద్యే వారి భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలుస్తుందన్నారు. ఆటలు, పాటలు, కథలు, సంభాషణలు, సృజనాత్మక కార్యకలాపాల ద్వారా బోధనను ఆనందదాయకంగా మార్చాలని సూచించారు. ప్రతి చిన్నారిలోని ప్రత్యేక ప్రతిభను గుర్తించి సమగ్ర వికాసానికి కృషి చేయాలన్నారు. శిక్షణలో బాలల మనోవిజ్ఞానం, ఆటల ఆధారిత బోధన, భాషా వికాసం, సంఖ్యా అవగాహన, తరగతి గది నిర్వహణ, బోధన-అభ్యసన సామగ్రి వినియోగం, తల్లిదండ్రులతో సమన్వయం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

# అభివృద్ధి, పెట్టుబడులే ప్రభుత్వ లక్ష్యం

- నాణ్యతతో, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలి
- పరిశ్రమల స్థాపనకు మౌలిక సదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తుంది
- మంథని లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సుడిగాలి పర్యటన



**మంథని ఆగస్టు 3 (నినాదం):**
అభివృద్ధి పెట్టుబడులే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం మంత్రి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి మంథని పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. శివకిరణ్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన మన ఊరు--మన కోచింగ్ సెంటర్ ఉచిత కానిస్టేబుల్, ఎస్సై కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం ఎస్ఎల్బీ గార్డెన్‌లో టీ వర్క్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాఠశాల విద్యార్థుల క్రీడా పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన అనంతరం హెల్మెట్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్, ఇతర పరిశ్రమల ప్రతినిధులు, అధికారులతో పరిశ్రమల అభివృద్ధి అంశాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం కోకాకోలా బెవరేజెస్ సంస్థ సీఎస్ఆర్ కార్యక్రమం ప్రాజెక్ట్ ఫైన్ కింద చేపడుతున్న బొక్కలవాగు చెక్‌డ్యామ్ అప్‌గ్రేడేషన్, సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ సివిల్ ఆసుపత్రిలో నూతన డెవలప్‌మెంట్ కమిటీ సమావేశంలో పాల్గొని వైద్య సేవల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. రత్నాపూర్ గ్రామంలో ప్రతిపాదిత కోకాకోలా పరిశ్రమ ఏర్పాటుకు ఎంపిక చేసిన స్థలాన్ని పరిశీలించారు. మన ఊరు--మన కోచింగ్ సెంటర్ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటికే 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని, ప్రస్తుతం మరో 7 వేలకు పైగా పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ ప్రతినిధులు, ఇతర పరిశ్రమల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. పరిశ్రమలకు అవసరమైన విద్యుత్, నీరు, రహదారులు, ఇతర మౌలిక వసతులు అన్నింటినీ ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. రాష్ట్రానికి మరిన్ని నాణ్యమైన పెట్టుబడులు రావడం, స్థానిక యువతకు అధిక ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ సంస్థ తమ సీఎస్ఆర్ కార్యక్రమం ప్రాజెక్ట్ ఫైన్ కింద చేపడుతున్న బొక్కలవాగు చెక్‌డ్యామ్ అప్‌గ్రేడేషన్, సుందరీకరణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బొక్కలవాగు వద్ద గార్డెనింగ్, ఓపెన్ జిమ్ అప్‌గ్రేడేషన్, వాకింగ్ ట్రాక్, చిన్నారుల కోసం పార్కు వంటి సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా బొక్కలవాగులో పేరుకుపోయిన పూడికను తొలగించేందుకు డీ-సిల్టింగ్ పనులు కూడా చేపడుతున్నామని అన్నారు. అనంతరం మంథని ప్రభుత్వ సివిల్ ఆసుపత్రిలో నిర్వహించిన నూతన డెవలప్‌మెంట్ కమిటీ సమావేశంలో పాల్గొని ప్రభుత్వ వైద్య సేవల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన మౌలిక వసతులు, వైద్య పరికరాలు, ఇతర సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో ప్రతిపాదిత కోకాకోలా పరిశ్రమ ఏర్పాటుకు ఎంపిక చేసిన స్థలాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, సంబంధిత శాఖల అధికారులు, కంపెనీ ప్రతినిధులతో కలిసి మంత్రి పరిశీలించారు. పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన అన్ని ప్రక్రియలను వేగవంతం చేసి స్థానిక యువతకు అధిక ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆర్డీవో సురేష్, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, సయేందర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆరు వరుసల రోడ్డు ఎమ్మెల్యే ఇంటి కోసమే

**మంచిర్యాల, ఆగస్టు 3(నినాదం):** రంగపేట బ్రిడ్జి నిర్మాణాన్ని రద్దు చేసి, ఆ నిధులను ఆరు వరుసల రహదారి నిర్మాణానికి మళ్లించడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ కుమార్ ఆరోపించారు. రంగపేట (సన్‌సిటీ) కాలనీ వాసులతో కలిసి బ్రిడ్జి ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. మంచిర్యాల--అంతర్గాం బ్రిడ్జి మూడు జిల్లాల ప్రజలకు ఉపయోగపడేదని, రూ.13.50 కోట్లతో శంకుస్థాపన చేసినప్పటికీ పనులు ప్రారంభించకుండా నిధులను రహదారి విస్తరణకు మళ్లించారని విమర్శించారు. ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు వ్యక్తిగత ప్రయోజనాల కోసమే ఆరు వరుసల రోడ్డు నిర్మిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో మంజూరైన నిధులతోనే రంగపేట బ్రిడ్జిని వెంటనే నిర్మించాలని, లేదంటే పార్టీ తరఫున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.



## జిల్లాలో ఐపీఎస్ విద్యార్థుల సత్తా

- రాష్ట్ర స్థాయికి ఘనంగా ఎంపిక
- జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో మెడల్స్ వర్షం
- హనుమకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత



**సుల్తానాబాద్, ఆగస్టు 03 (నినాదం):**
పెద్దపల్లి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యం లో ఆదివారం ఎన్టీపీసీ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల వేదికగా నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సుల్తానాబాద్ పట్టణంలోని ఇండియన్ ప బ్లిక్ స్కూల్ (ఐపీఎస్) విద్యార్థులు అద్భుత ప్ర తిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. వివిధ విభాగాల్లో పోటీపడిన ఐపీఎస్ విద్యార్థులు తమ ప్రతిభతో మెడల్స్ కైవసం చేసు కుని పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. అండర్-6 బాలబాలికల విభాగంలో రేష్మిక, ఆరు హీ, మోహన్ రావు, అండర్-8 బాలుర విభాగంలో శివాన్ష్ అండర్-10 బాలుర విభాగంలో శ్రేయన్ గౌడ్, సూర్య నంద, దేవాన్ష్ తమ తమ ఈవెంట్లలో విజేతలుగా నిలిచి ఈ నెల 7న హనుమకొండలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కించుకున్నారు. ఈ సంద ర్భంగా విద్యార్థుల విజయంపై పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ హర్షం వ్యక్తం చేస్తూ విజేతలను అభినందించారు. జిల్లా స్థాయిలో చూపిన ప్రతిభను రాష్ట్ర, జాతీయ స్థాయిల్లోనూ కొనసాగించి పాఠశాలకు, సుల్తానా బాద్‌కు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు క్రమశిక్షణతో శిక్షణ అందించి ఈ విజయానికి బాటలు వేసిన పీఈటీలు సత్యం, సతీష్, జ్యోతిలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపల్ సునీత, మేనేజర్ శివతో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని విజేత విద్యార్థులను అభినందించారు.


## ఆపన్నులకు అండగా గొట్టం మల్లయ్య సేవాస్ఫూర్తి

- -జయంతి సందర్భంగా అంగన్‌వాడీ, పాఠశాలకు ఫ్యాన్లు--ట్యూబ్‌లైట్లు
- -మానసిక వికలాంగుల కేంద్రంలో అన్నదానం



**సుల్తానాబాద్, ఆగస్టు 03 (నినాదం):**
దివంగత శ్రీ గొట్టం మల్లయ్య గారి జయంతి సం దర్భంగా వారి కుటుంబ సభ్యులు భార్య గొట్టం లక్ష్మి, కుమారుడు గొట్టం మహేష్ దంపతులు, సో మవారం సుల్తానాబాద్ పట్టణంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించి సేవా స్ఫూర్తిని చాటు కున్నారు. విద్యా సంస్థలు, చిన్నారులు, దివ్యాంగు లకు ఉపయోగపడేలా చేసిన ఈ కార్యక్రమాలు స్థానికుల ప్రశంసలు అందుకున్నాయి. ఈ సంద ర్భంగా పట్టణంలోని 9వ వార్డులో ఉన్న అంగన్ వాడీ కేంద్రానికి ఒక సీలింగ్ ఫ్యాన్‌ను బహుకరిం చారు. అలాగే దర్గా వీధిలోని ఉర్దూ పాఠశాలకు రెండు సీలింగ్ ఫ్యాన్లు, రెండు ట్యూబ్‌లైట్లను అం దజేసి విద్యార్థులకు మెరుగైన వాతావరణం క ల్పించేలా సహకరించారు. అనంతరం సుల్తానా బాద్‌లోని మానసిక వికలాంగుల పునరావాస కేంద్రంలో ఒక పూట మధ్యాహ్న భోజనాన్ని ఏర్పా టు చేసి, అక్కడి దివ్యాంగులకు ప్రేమతో భోజనం వడ్డించారు. కుటుంబ సభ్యులు వారితో ఆప్యా యంగా మమేకమవుతూ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లా డుతూ, శ్రీ గొట్టం మల్లయ్య గారి సేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రతి ఏడాది సమాజానికి ఉపయోగ పడే కార్యక్రమాలు నిర్వహించడం ఆదర్శనీయ మని కొనియాడారు. విద్య, సేవ, మానవత్వానికి ప్రాధాన్యం ఇస్తూ చేపట్టిన ఈ కార్యక్రమాలు అం దరికీ స్ఫూర్తిదాయకమని అభిప్రాయపడ్డారు. ఈ సేవా కార్యక్రమాల్లో గొట్టం లక్ష్మి మల్లయ్య, సుల్తా నాబాద్ మున్సిపాలిటీ 9వ వార్డు మాజీ కౌన్సిలర్, కో-ఆప్షన్ సభ్యులు, కుటుంబ సభ్యులు, స్థానిక ప్రముఖులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## వాలీబాల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా పసెడ్ల రమేష్ ముదిరాజ్



**సుల్తానాబాద్, ఆగస్టు 03 (నినాదం):**
సుల్తానాబాద్ మండలం కనుకుల గ్రామం (మా రుతి నగర్)కు చెందిన సీనియర్ వాలీ బాల్ క్రీడా కారుడు పసెడ్ల రమేష్ ముది రాజ్ను పెద్దపల్లి జిల్లా సీనియర్ వాలీబాల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా నియమించారు. క్రీడారంగంలో ఆయన అందించిన సేవలు, వాలీబాల్ అభివృద్ధికి చేసిన కృషిని గుర్తిస్తూ ఈ బాధ్యతలను అప్పగించారు. ఈ నియామకాన్ని సీనియర్ రాష్ట్ర వాలీబాల్ అ సోసియేషన్ ప్రధాన కార్యదర్శి కన్న రమేష్, పెద్ద పల్లి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షు డు కస్తూరి లక్ష్మారెడ్డి, సభ్యుడు మైపాల్ రెడ్డిల ఆధ్వర్యంలో ప్రకటించారు. అలాగే ఉమ్మడి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఆసం పల్లి శ్రీనివాస్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు జూపల్లి తిరుమలరావు, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు పడా ల అజయ్ గౌడ్, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు విజ్ఞాన్ రావు (సీఐ), జగిత్యాల జిల్లా ప్రతినిధి బుచ్చిరెడ్డి, మహ్మద్ రసీదుల ఆదేశాల మేరకు ఈ నియామ కం జరిగినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువు రు క్రీడాకారులు, క్రీడాభిమానులు, గ్రామస్థులు ప సెడ్ల రమేష్ ముదిరాజ్‌కు అభినందనలు తెలియ జేస్తూ, జిల్లా వ్యాప్తంగా వాలీబాల్ క్రీడాభివృద్ధికి ఆయన విశేష కృషి చేయాలని ఆకాంక్షించారు.

## 8వ వార్డుకు తాగునీటి భరోసా

### రెండు హ్యాండ్‌బోర్ల ప్రారంభం



**సుల్తానాబాద్, ఆగస్టు 03 (నినాదం):**
సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని 8వ వార్డు ప్రజలకు తాగునీటి కొరత తలెత్తకుండా ముంద స్తు చర్యల్లో భాగంగా రెండు కొత్త హ్యాండ్‌బోర్లను సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ బిరుదు రాధా కృష్ణ, వైస్ చైర్‌పర్సన్ అంతటి పుష్పలత, పాలకవ ర్గ సభ్యులతో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలకు తాగు నీటి సమస్య లేకుండా మౌలిక సదుపాయాల క ల్పనకు మున్సిపల్ పాలకవర్గం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ప్రతి వార్డులో ప్రజల అవస రాలను గుర్తించి, సమస్యల పరిష్కారానికి ప్రాధా న్యత ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సి పల్ కమిషనర్ టి. రమేష్, స్థానిక కౌన్సిలర్ చిం తల రాజు, గాజుల రాజమల్లు, ఊట్ల వరప్రదీప్, ఈర్ల శేఖర్, కుమార్, తొర్రి కొండా ప్రభాకర్, కల్వల శంకరయ్య, అమెరిశెట్టి రాకేష్, సిద్ధ తిరుపతి, గా దాసు రవీందర్, చిలుక రాజేశం తదితర ప్రజా ప్ర తినిధులు పాల్గొన్నారు. అలాగే వార్డు నాయకులు, మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై హ్యాండ్‌బోర్ల ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన ఈ హ్యాండ్‌బో ర్లతో 8వ వార్డులో తాగునీటి సమస్యకు గణనీ యమైన ఉపశమనం లభిస్తుందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# హరిత మంచిర్యాలకు శ్రీకారం

## రాముని చెరువు వద్ద వన మహోత్సవం

- - మొక్క నాటి భవిష్యత్తును కాపాడుదాం
- -ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు



**మంచిర్యాల, ఆగస్టు 3 (నినాదం):**
పచ్చని ప్రకృతిని భావితరాలకు అందించాలనే సంకల్పంతో మంచిర్యాలలో హరిత ఉద్యమానికి మరో అడుగు పడింది. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 52వ డివిజన్ రాముని చెరువు వద్ద సోమవారం నిర్వహించిన వన మహోత్సవం కార్యక్ర మం ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘా లు, స్థానిక ప్రజల భాగస్వామ్యంతో ఉత్సాహభరితంగా సాగింది. మున్సిపల్ కమిషనర్ అన్వేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంచిర్యాల శాసనసభ్యులు శ్రీ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, జిల్లా కలెక్టర్ శ్రీ కుమార్ దీపక్ కలిసి మొక్కలు నాటి హరిత సందేశాన్ని ప్రజలకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ, అభివృద్ధి ఎంత ముఖ్యమో పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. పెరుగుతున్న కాలుష్యం, మారుతున్న వాతావరణ పరిస్థితులను ఎదుర్కోవాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. మొక్కలు నాటడం ఒక రోజు కార్యక్రమం మాత్రమే కాదని, వాటిని చెట్లుగా పెంచే వం-కు బాధ్యతగా చూసుకోవడమే నిజమైన వన మహోత్సవమని అన్నారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, వన మహోత్సవం ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాకుండా ప్రజల ఉద్యమంగా మారాలని ఆకాంక్షించారు. ప్రతి ఇంటి ముందు, ప్రతి విద్యాసంస్థలో, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో మొక్కలు నాటే సంస్కృతి పెంపొందితే మంచిర్యాల జిల్లా మరింత పచ్చదనంతో కళకళలాడుతుందని పేర్కొన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించేందుకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాముని చెరువు పరిసరాల్లో పచ్చదనాన్ని పెంపొందించే లక్ష్యంతో వివిధ రకాల నీడనిచ్చే, పర్యావరణానికి ఉపయోగపడే మొక్కలను నాటారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళా సంఘాల సభ్యులు, యువత, స్థానికులు కూడా మొక్కలు నాటి వాటి సంరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా హరితహారం, పర్యావరణ పరిరక్షణ, నీటి వనరుల సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య--మహేష్, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, కార్పొరేటర్ తూముల నరేష్, పలువురు కార్పొరేటర్లు, మహిళా సంఘాల సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# పాతికేళ్ల ప్రస్థానం..
# మచ్చలేని 'పింగిళి' ప్రజాజీవితం

## అజాతశత్రువుగా ప్రజల మనసుల్లో స్థానం
## కార్మిక–కర్షక సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రస్థానం



**జమ్మికుంట, ఆగస్టు 3 (నినాదం):** రాజకీయాల్లో అవినీతి ఆరోపణలు సహజంగా మారిన ఈ కాలంలో, పాతికేళ్లకు పైగా ప్రజాజీవితంలో పలు కీలక పదవులు నిర్వహించినప్పటికీ నిజాయితీ, నిబద్ధతలకు మారుపేరుగా నిలిచిన నాయకుడు కరీంనగర్ డీసీసీబీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగిళి రమేశ్. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా, కార్మిక–కర్షకుల అభ్యున్నతినే ధ్యేయంగా సాగిన ఆయన రాజకీయ ప్రస్థానం అన్ని వర్గాల ప్రజల ఆదరణను సంపాదించింది. ఆయన జన్మదినం సందర్భంగా ప్రత్యేక కథనం.

**సామాన్యుడి నుంచి ప్రజానాయకుడిగా**

దివంగత మాజీ మంత్రి ముద్దసాని దామోదర్‌రెడ్డి ఆశీస్సులతో రాజకీయాల్లో అడుగుపెట్టిన పింగిళి రమేశ్, నీతి–నిజాయితీలనే ఆయుధాలుగా చేసుకుని ప్రజా జీవితంలో ఎదిగారు. చేపట్టిన ప్రతి పదవిని బాధ్యతగా నిర్వర్తిస్తూ, పదవికే గౌరవం తీసుకొచ్చే నాయకుడిగా గుర్తింపు పొందారు. మాటల్లోనే కాదు, చేతల్లోనూ ప్రజాసేవను నిరూపించుకుంటూ ముందుకు సాగుతున్నారు.

**కార్మిక ఉద్యమాలతో విడదీయరాని అనుబంధం**

జమ్మికుంటలో ప్రతి ఏడాది నిర్వహించే మేడే వేడుకలను జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రత్యేకంగా నిలబెట్టిన నాయకుల్లో పింగిళి రమేశ్ ఒకరు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి గాంధీచౌక్ వరకు ఎరుపు జెండాలతో జరిగే భారీ కార్మిక ర్యాలీలకు ఆయన నాయకత్వం వహిస్తుంటారు. హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా, జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, హుజూరాబాద్ ఆర్టీసీ డిపో ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడిగా సేవలందించిన ఆయన, కార్మికుల సమస్యల్లో అండగా నిలిచి ప్రత్యేక గుర్తింపు పొందారు. అదే సమయంలో అవినీతికి తావివ్వకుండా వ్యవహరించడం వల్ల వ్యాపార వర్గాల విశ్వాసాన్ని సంపాదించారు.



**సహకార రంగంలో ప్రత్యేక ముద్ర**

ఇల్లందకుంట సింగిల్ విండో చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన పింగిళి రమేశ్, సహకార రంగంలోనూ తనదైన ముద్ర వేశారు. అనంతరం కేడీసీసీబీ జిల్లా డైరెక్టర్‌గా, ప్రస్తుతం వైస్ చైర్మన్‌గా కొనసాగుతూ రైతులకు సహకార వ్యవస్థను మరింత చేరువ చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఉన్న సమయంలో పత్తి కొనుగోళ్లలో 'తరుగు' లేకుండా కొనుగోలు జరిగే విధానాన్ని అమలు చేయడం తన రాజకీయ జీవితంలో అత్యంత సంతృప్తినిచ్చిన నిర్ణయమని ఆయన పేర్కొంటారు. ఆ నిర్ణయంతో రైతులకు నేటికీ కోట్ల రూపాయల మేర ప్రయోజనం కలుగుతోందని చెబుతారు.

**సేవలోనూ ముందుండే దంపతులు**

పింగిళి రమేశ్ సేవా కార్యక్రమాల్లోనూ చురుకుగా ఉంటారు. ఆయన సతీమణి, విలాసాగర్ మాజీ సర్పంచ్ రమాదేవి పదవీకాలంలో 'బంగారు తల్లి' పేరుతో ఆడపిల్లల విద్య, ఇతర అవసరాల కోసం పలువురికి ఆర్థిక సహాయం అందించారు. గ్రామసేవకుడిగా పనిచేసిన తన తండ్రి సేవా స్ఫూర్తినే ప్రజా జీవితంలో కొనసాగిస్తున్నట్లు రమేశ్ చెబుతుంటారు.

**శ్రమజీవుల కష్టం తెలిసిన నాయకుడు**

2001 ఆగస్టు 20న విలాసాగర్ గ్రామ సర్పంచ్‌గా ప్రజాప్రతినిధి జీవితాన్ని ప్రారంభించిన పింగిళి రమేశ్, అనంతరం పలు ప్రజాప్రతినిధి, పార్టీ పదవుల్లో సేవలందించారు. శ్రమజీవుల సమస్యలను దగ్గరగా తెలుసుకున్న నాయకుడిగా కార్మికులు, రైతులు, వ్యాపార వర్గాలతో సమానంగా మమేకమయ్యారు. 2010లో గులాబీ పార్టీలో చేరిన ఆయన, పార్టీ అగ్రనేతలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు.

**అందరివాడిగా 'అజాతశత్రువు'**

పాతికేళ్లకు పైగా ప్రజా జీవితంలో కొనసాగుతున్నప్పటికీ అవినీతి మచ్చ అంటకుండా ప్రజాసేవనే మార్గంగా ఎంచుకోవడం పింగిళి రమేశ్ ప్రత్యేకతగా నిలిచింది. రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల ఆదరణ పొందిన ఆయనను అనుచరులు 'అజాతశత్రువు', 'శ్రామిక మిత్రుడు', 'ప్రజల ఆత్మబంధువు'గా అభివర్ణిస్తారు.

**'ప్రజల రుణం తీర్చుకోవడమే నా లక్ష్యం'**

ఇన్నేళ్లుగా తనను ఆదరించిన ప్రజలను ఎప్పటికీ మరవబోనని పింగిళి రమేశ్ అంటున్నారు. ముఖ్యంగా తనను తొలి సారి సర్పంచ్‌గా గెలిపించిన విలాసాగర్ గ్రామ ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని చెబుతున్నారు. కార్మికులు, రైతులు, వ్యాపార వర్గాలు అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలుపుతూ, భవిష్యత్తులోనూ వారి సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు.



# బోనాల చెక్కుల పంపిణీ

## ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా అందజేత



**మల్కాజిగిరి, ఆగస్టు 3 (నినాదం)**
మల్కాజిగిరి వాణి నగర్ లోని విజయ గణపతి దేవాలయం లో సోమవారం మల్కాజిగిరి నియోజకవర్గం బోనాల పండుగ చెక్కులను ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి లు పాల్గొని నియోజకవర్గం లోని పలు దేవాలయాల నిర్వాహకులకు ఆషాడ బోనాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గం లోని సుమారు 230 దేవాలయాలకు, 76లక్షల చెక్కులను పంపిణీ చేయడం జరిగిందని, ప్రతి ఏరియాలో బోనాల పండుగను ఘనంగా జరుపు కొనేందుకు గతంలో కంటే ఈ సంవత్సరం ఎక్కువ నిధులను కేటాయించి ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ అధికారులు, మాజీ కార్పొరేటర్ లు, దేవాలయాల చైర్మన్ లు, అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు



మల్కాజిగిరి ఆనంద్ బాగ్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం మల్కాజిగిరి నియోజకవర్గం బోనాల పండుగ చెక్కులను ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ప్రేమ్ కుమార్, జితేంద్ర నాథ్, కాంగ్రెస్ బి బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, బి కే శ్రీనివాస్, గుండా నిరంజన్, ఎస్ ఆర్ ప్రసాద్, పిట్టల శ్రీనివాస్, జిడి సంపత్ గౌడ్, వినోద్ యాదవ్, సత్యమూర్తి, పిట్టల నాగరాజు, కపిల్, వైనాల ప్రవీణ్, యూసుఫ్ భాయ్, రాందాస్ సంతోష్ ముదిరాజ్, బాబు, సత్యనారాయణ, సంపత్ రావు, బ్రహ్మయ్య, కన్నెమల్ల నాగరాజు, సుమలత, పుష్పలత, ఆశా, లక్ష్మీ, ఫరీద్, సయ్యద్ మబ్బు, షకీల్, సందీప్ గౌడ్, శంకర్, రామచందర్, పార్థ సారథి, వెంకన్న, సిరిగిరీ రాజు, తదితరులు పాల్గొన్నారు

NINADAM CINEMA


# అతీంద్రియ శక్తుల కథ...అగధ

## 14 రిలీజ్‌కు రెడీ అవుతున్న చిత్రం



ప్రముఖ నిర్మాత, దర్శకుడు ఎంఎస్ రాజు మరో విభిన్నమైన కథతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కుతున్న మిస్టికల్ థ్రిల్లర్ 'అగధ' ఇప్పటికే సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తుండగా, తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచేసింది. కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కాశీ విశాలాక్షి బలుసు నిర్మిస్తున్నారు. ఆగస్టు 14న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాలను చిత్రబృందం వేగవంతం చేసింది. అందులో భాగంగా విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను థ్రిల్లింగ్ ప్రపంచంలోకి తీసుకెళ్తోంది. ట్రైలర్ ప్రారంభం నుంచే మిస్టరీ, ఆధ్యాత్మికత, మంత్ర తంత్రాల నేపథ్యాన్ని ఆసక్తికరంగా పరిచయం చేశారు. 'మంత్ర తంత్ర విద్యలకు అందని శక్తి ఉంది దాని గురించి నాకు తెలియాలి' అంటూ కామాక్షి భాస్కర్ల చెప్పే డైలాగ్ ట్రైలర్‌కు హైలైట్‌గా నిలిచింది. ఈ ఒక్క డైలాగ్‌తోనే సినిమాలో అతీంద్రియ శక్తులు, రహస్యాల చుట్టూ తిరిగే కథ ఉండబోతుందనే సంకేతాలు ఇచ్చారు. విజువల్స్, బ్యాకగ్రౌండ్ స్కోర్, సినిమాటోగ్రఫీ ట్రైలర్‌కు ప్రధాన బలంగా కనిపిస్తున్నాయి. ప్రతి ఫ్రేమ్‌లోనూ ఉత్కంఠను పెంచేలా ఎంఎస్ రాజు కథనాన్ని రూపొందించినట్లు తెలుస్తోంది. మిస్టరీతో పాటు భావోద్వేగాలు, సస్పెన్స్ అంశాలను సమతూకంగా మేళవించినట్లు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. కామాక్షి భాస్కర్ల తన పాత్రలో ఎంతో ఎమోషన్‌ను ప్రదర్శించగా, శ్రవణ్ రెడ్డి కూడా కథలో కీలకమైన పాత్రలో ఆకట్టుకునేలా కనిపిస్తున్నారు.

### పెళ్లి చుట్టూ సాగే కథతో
# క్రేజీ కళ్యాణం




అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, అఖిల్ రాజ్, నరేష్ వీకే కీలక పాత్రల్లో నటిస్తున్న ఎంటర్‌టైనర్ 'క్రేజీ కళ్యాణం'. బద్రప్ప గాజుల దర్శకుడు. బూసమ్ జగన్ మోహన్‌రెడ్డి నిర్మిస్తున్నారు. శనివారం ఈ చిత్ర టీజర్ విడుదలైంది. పెళ్లి చుట్టూ సాగే ఆసక్తికరమైన కథతో పూర్తి వినోదాత్మక చిత్రంగా దీన్ని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. సురేశ్ బొబ్బిలి ఈ సినిమాకు సంగీతం అందించారు.

# గాయపడిన రష్మిక



మన తారల్ని గాయాలు వెంటాడుతున్నాయి. ఎప్పట్నుంచో బాధపెడుతున్న గాయాలతోనూ, సెట్స్‌లో ఇటీవల జరిగిన కొన్ని ప్రమాదాలతోనూ పలువురు కథానాయకులు చికిత్సలు తీసుకుంటూ విశ్రాంతిలో ఉన్నారు. పలు వారాలపాటు వాళ్లు కెమెరా ముందుకు వెళ్లే పరిస్థితులు లేవు. అగ్ర కథానాయిక రష్మిక కూడా అదే తరహాలో గాయపడ్డారు. శారీరక శ్రమతో కూడిన యాక్షన్ సన్నివేశాలు, నృత్యాల కారణంగా ఆమె తుంటి భాగంలోని స్నాయువు పూర్తిగా తెగిపోయింది. ఆ గాయం తీవ్రతని గమనించిన వైద్యులు కూడా ఆశ్చర్యం వ్యక్తం చేశారని రష్మిక సన్నిహిత వర్గాలు చెప్పాయి. తీవ్రమైన శారీరక శిక్షణ పొందేవాళ్లలోనూ, క్రీడాకారుల్లోనూ ఇలాంటి గాయాలు కనిపిస్తుంటాయని, ఆరు వారాలపాటు పూర్తిగా విశ్రాంతి తీసుకుంటూ చికిత్స పొందాలని వైద్యులు చెప్పినట్టుగా ఆ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. రణబాలి, మైసా సినిమాల్లో నటిస్తున్న ఆమె కొంతకాలంగా వరుసగా యాక్షన్ సన్నివేశాలు, నృత్యాల కోసం సన్నద్ధం అవుతున్నారు. ఆ క్రమంలోనే ఆమె తుంటి భాగంలో తీవ్ర గాయమైంది. పాన్ ఇండియా స్థాయిలో నాలుగు భారీ సినిమాలు, పలు ఉత్పత్తులకు ప్రచార కార్యకర్తగా వ్యవహరిస్తున్న ఆమె గాయపడటంతో ఆయా సినిమాలు, ప్రకటన చిత్రీకరణలు నిలిచిపోనున్నాయి.



# దంపతుల మధ్య అనురాగం నిత్యనూతనం


## విశ్వనాథ్ అండ్ సన్స్ హీరో సూర్య



ప్రముఖ నటుడు సూర్య, మమితా బైజు ప్రధానపాత్రలో నటించిన చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్' వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఆగస్టు 14న థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ఆడియో విడుదల వేడుకలో హీరో సూర్య ప్రేమ, పెళ్లి, దంపతుల మధ్య పరస్పర గౌరవం గురించి మాట్లాడారు. ప్రేమ అనేది పెళ్లితో ముగిసిపోయేది కాదు. బంధంలో అనురాగం ప్రతిరోజూ వ్యక్తమవ్వాలి. భాగస్వామిని జీవితాంతం ప్రతి రోజూ ప్రేమిస్తూనే ఉండాలి. ఆమెతో 20 ఏళ్లు గడిపినా కూడా ప్రేమ తగ్గకూడదు. ఎప్పుడూ ఒకరికొకరు గౌరవించుకోవాలి. వయసు పెరిగే కొద్దీ మనుషుల్లో మార్పులు సహజం. 25, 30 ఏళ్ల వయసులో ఉండే ఆలోచనలు, ప్రాధాన్యతలు తర్వాత మారిపోతాయి. జీవితం ఎలా ఉన్నా.. మన భాగస్వామిపై ఉండే ప్రేమ, ఆప్యాయత మాత్రం ఎప్పటికీ మారకూడదని చెప్పారు. సమాజంలో, కుటుంబంలో మహిళల పాత్రను, వారి త్యాగాలను సూర్య ప్రస్తావించారు. 'ప్రతి కుటుంబంలో పురుషుడి కంటే మహిళలు ఎక్కువ కష్టపడతారు. ఇల్లు చూసుకోవడం, పిల్లలకు జన్మనివ్వడం వంటి విషయాల్లో వారు ఎన్నో త్యాగాలు, సర్దుబాట్లు చేస్తారు. వాటికి ఎప్పుడూ గౌరవం ఇవ్వాలి. ప్రేమ పంచడంతో పాటు వాళ్లకు గౌరవం ఇవ్వడమూ ముఖ్యమని సూర్య చెప్పారు.ఈ కార్యక్రమంలో హీరోయిన్ మమితా బైజుమాట్లాడుతూ, చిన్నప్పటి నుంచి తనకు సూర్య అంటే ఎంతో ఇష్టమని వెల్లడించారు. 'గతంలో సూర్యతో పనిచేసే మంచి అవకాశాన్ని కోల్పోయాను. కానీ దేవుడి దయ వల్ల ఈ సినిమాలో నటించే ఛాన్స్ వచ్చింది. ఆయనతో కలిసి పనిచేయడం ఎంతో సంతోషంగా ఉంది. ఆయన నిజమైన జెంటిల్‌మన్' అని మమితాబైజు అన్నారు. ఈ చిత్రంలో రాధికా శరత్‌కుమార్, రవీనా టాండన్, నాజర్ కీలక పాత్రలు పోషించారు.

### వారణాసి కథలో
# భారీ బలముంది

## అందుకే ఐమ్యాక్స్ ఫార్మాట్ ఎంచుకున్నా
## దర్శకధీరుడు జక్కన్న వెల్లడి



స్టార్ హీరో మహేశ్‌బాబు కథానాయకుడిగా ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ అడ్వెంచర్ ఫిల్మ్ 'వారణాసి'లో ప్రియాంక చోప్రా కథానాయిక. పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. టైమ్ ట్రావెల్ కథాంశం, భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ మూవీకి సంబంధించిన కీలక అప్‌డేట్‌ను జక్కన్న పంచుకున్నారు. ఇటీవల ఓ ఇంటర్నేషనల్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'వారణాసి' ప్రస్తుత పరిస్థితితో పాటు, ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఇప్పటికే 'వారణాసి' 80 శాతం షూటింగ్ పూర్తయింది. ఇంకా 20శాతం ఉంది. ఈ సినిమాకు సంబంధించి కీలక సన్నివేశాలు, యాక్షన్ సీక్వెన్స్ పూర్తి చేశాం. మిగిలినవి చిన్న చిన్న సన్నివేశాలే. 2022 నుంచి 'వారణాసి' కథను డెవలప్ చేయడం మొదలు పెట్టాం. అంటే దాదాపు నాలుగున్నరేళ్లు పట్టిందని వివరించారు. వారణాసి' గురించి అన్నీ ఇప్పుడే చెప్పలేం. 'ఇండియానా జోన్స్' అంటే నాకు చాలా ఇష్టం. ఆ కథ, హీరో చేసే సాహసాలు చిన్న పిల్లలకు నచ్చుతాయి. నాకూ సరదాగా అనిపిస్తాయి. కథ, దాని నేపథ్యం తెలియకుండా ప్రేక్షకులు సినిమాను ఆస్వాదించలేరని నా అభిప్రాయం అన్నారు.

### ఎల్లమ్మలో దేవిశ్రీప్రసాద్
# లుక్ విడుదల

దిల్ రాజు సమర్పణలో, 'రాకస్టార్' దేవి శ్రీ ప్రసాద్, వేణు యెల్డండి, శిరీష్, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ 'ఎల్లమ్మ' నుంచి పర్శిగా దేవి శ్రీ ప్రసాద్ ఫస్ట్ లుక్ రిలీజ్ అయ్యింది. బలగంతో క్రేజ్ సంపాదించుకున్న దర్శకుడు వేణు యెల్డండి మరో ప్రతిష్టాత్మక చిత్రం ఎల్లమ్మను నిర్మిస్తున్నాడు. గత కొంతకాలంగా ఎల్లమ్మపై అనేక ఊహాగానాలకు తెరదించుతూ.. దేవిశ్రీప్రసాద్‌ను హీరోగా ఎంపిక చేశారు. ఇందులో పర్శిగా అతను లుకను విడుదల చేశారు.



Printed, Published & Owned by B. Srinivas, Printed at RAHNUMA-E-DECCAN PRESS, H.No.12-2-837/A/3, Asifnagar, Hyderabad., Telangana-500028
Published at 6-3-439, Kisannagar, Karimnagar-505001(TS) Editor: B. Srinivas, PRGI.REGN.NO. APTEL/2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL: +91 8333068787